





www.andhrajyothy.com
విజయవాడ సిటీ

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 249








మంగళవారం | 24-12-2019 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai


శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి మ. 12.19 తదుపరి చతుర్దశి; నక్షత్రం: అనూరాధ సా. 5.00 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: రా. 10.31-12.06; దుర్ముహూర్తం: ఉ. 8.58-9.41, రా. 10.01-10.52; అమృతఘడియలు: ఉ. 6.53-8.26; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.46; సూర్యాస్తమయం: 5.44

# జారిన జార్ఖండ్

## జేఎంఎం-కాంగ్రెస్ కూటమి జయభేరి

**మేజిక్ సంఖ్య కంటే 6 సీట్లు ఎక్కువ**

**ఎగ్జిట్‌పోల్ అంచనాలు అందుకోని బీజేపీ**

**సీఎం రఘువర్ పరాజయం.. రాజీనామా**

**కొత్త ముఖ్యమంత్రి హేమంత్ సొరెన్**

ఎవరికెన్ని సీట్లు

| | |
|---|---|
| మొత్తం సీట్లు | 81 |
| సాధారణ మెజారిటీ | 41 |
| జేఎంఎం+కాంగ్రెస్+ఆర్జేడీ | 47 |
| బీజేపీ | 25 |
| ఏజేఎస్‌యూ | 2 |
| జేవీఎం | 3 |
| స్వతంత్రులు | 4 |


పిండి వంటల సందడిలో కాబోయే ముఖ్యమంత్రి హేమంత్ సొరెన్, ఆయన భార్య కల్పనా సొరెన్

రాంచీ, డిసెంబరు 23: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్-జేఎంఎం-ఆర్జేడీ కూటమి జయకేతనం ఎగరేసింది. మొత్తం 81 సీట్లకు గాను 47 స్థానాలను కైవసం చేసుకుంది. అంటే ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్య కంటే ఆరు సీట్లు ఎక్కువే. హంగ్ అసెంబ్లీ ఏర్పడవచ్చనీ, బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరిస్తుందనీ ప్రీపోల్ సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ అంచనా వేసినా అవేవీ నిజం కాలేదు. బీజేపీకి కిందటిసారి కంటే 12 సీట్లు తక్కువగా- 25 స్థానాలు మాత్రమే వచ్చాయి. కమలనాథులకు గతసారి సహకరించిన ఏజేఎస్‌యూ, లోపాయికారీ మద్దతిచ్చిన జేవీఎం పార్టీలకు సైతం సీట్లలో, ఓట్లలో కోత పడింది. ఒంటరిగా పోటీచేసి విజయం సాధించగలమని ధీమా వ్యక్తం చేసిన బీజేపీ చివరకు మట్టి కరవక తప్పలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి, 1995 నుంచి వరుసగా ఐదుసార్లు గెలుస్తూ వచ్చిన రఘువర్ దాస్ సైతం జంషెడ్‌పూర్-తూర్పు నియోజకవర్గంలో ఓడిపోయారు. గతంలో ఆయన కేబినెట్ సహచరుడిగా పనిచేసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన సరయూ రాయ్ ఆయనను 10 వేల ఓట్ల తేడాతో ఓడించారు. "ఇది బీజేపీ పరాజయం కాదు. నా ఓటమి. రాష్ట్రంలో పార్టీ ఓటమికి పూర్తి

మిగతా 9వ పేజీలో...

## రెక్కలు రాలుతున్న కమలం

**ఏడాదిలో 5 రాష్ట్రాల్లో పరాజయం**

**హిందీ బెల్ట్‌లో సగం ఔట్**

**పట్టణ ప్రాంతాల్లోనూ తగ్గిన ఆదరణ**

**ఆధిపత్య వర్గాలను**

**దూరం పెట్టడమే కారణమా!**

**ఢిల్లీ, బిహార్, బెంగాల్...**

**ముందున్నవి మరిన్ని సవాళ్లు**

# రాజధాని రణం

## పిల్లలు, పెద్దలు అందరిదీ నిరసనబాటే

చేతుల్లో దేశనేతల ఫొటోలు, ప్లకార్డులతో రోజంతా 'రాజధాని' శిబిరాల్లోనే గ్రామాలు

వెయిన్నొక్క గొంతులతో నిరసనల హోరు

స్పీకర్ 'ఎడారి' వ్యాఖ్యలపై ఆగ్రహావేశం


తుళ్లూరులో రాజధాని ఆందోళనలో పాల్గొన్నవారిని ఉద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబు

**తుళ్లూరులో పోలీసులతో రైతుల బాహాబాహీ**

**పంతం పట్టి మరీ నిరసన కొనసాగింపు**

**దీక్షలకు మద్దతుగా కదిలిన విద్యార్థులు**

**గ్రామాల్లో పలుచోట్ల పాఠశాలలు బంద్**

**పోరుకు ముస్లింలు, వైసీపీ కార్యకర్తల మద్దతు**

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఏడు పదుల వయసు! 'మూడు రాజధానుల ఆలోచన ఉపసంహరించుకోవాలి' అనే ప్లకార్డు ఆ ముసలవ్వ చేతుల్లో! రెండు, మూడు పదుల ప్రాయం! 'మా భవిష్యత్తు మాట ఏమిటి?' అన్న కలవరం వారి కళ్లలో! బుడి బుడి అడుగుల వయసు! 'రాజధాని మాకు ఉంచేయండి ప్లీజ్' అన్న అమాయకపు అర్థింపు వారి లేతముఖాల్లో! రోజంతా రాజధాని నిరసన శిబిరాల్లోనే ఉన్న వీరందరి చేతుల్లో అంబేడ్కర్, పొట్టి శ్రీరాములు, నరేంద్ర మోదీ, పవన్

మిగతా 11వ పేజీలో...


దీక్షా శిబిరంలో నినాదాలు రాసిన పలకతో...

## సర్కారుకు సవాల్!

**ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఎక్కడ?.. హైకోర్టు జడ్జితో విచారణ జరపండి** 11

**తప్పు చేసిన వారిని శిక్షించండి.. అమరావతిని 'చంపేందుకు' సాకులు**

**పైసా భారం పడకుండా నిర్మించవచ్చు.. నిర్మాణ వ్యయం ఇక్కడే తక్కువ**

**భారీ వరదలప్పుడే ఇక్కడ ముంపులేదు.. వీటన్నింటిపై కమిటీలు వేయండి**

**నాపై కోపంతో రైతులను శిక్షించొద్దు.. జీఎన్ రావు కమిటీకి 'పేపర్ లీక్'**

**నాడు స్వాగతించి ఇప్పుడు మడమ తిప్పారేం?.. సీఎం జగన్‌పై బాబు ఫైర్**

**రాజధాని రక్షణకు ఐక్య ఉద్యమం.. అమరావతి పరిరక్షణ సమితి ఆవిర్భావం**

**20 సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు.. నేడు ఉప రాష్ట్రపతి వెంకయ్యతో భేటీ**

## ఏం జరుగుతోంది..?

**రాజధాని పరిణామాలపై పీఎంవో ఆరా.. ఇప్పటికే ప్రధానికి నివేదించిన ఐబీ**

**ఏఐఎస్ అధికారులతో సంప్రదింపులు.. 24 మంది నుంచి ఫీడ్‌బ్యాక్**

**ఇది తెలిసి ఢిల్లీలో ఓ అధికారి మకాం.. అపాయింట్‌మెంట్ ఇవ్వని మోదీ ఆఫీసు**

**ప్రధాని సన్నిహితులతో భేటీకీ యత్నం.. రైతుల ఉద్యమంపై ఢిల్లీకి నిఘా నివేదిక** 10

## బాబుది మొసలి కన్నీరు



**ఆయన్ను నమ్మి మోసపోవద్దు**

**రైతులకు బొత్స హితవు**

**భూముల్ని అభివృద్ధిచేసిస్తాం**

**ఎడ్యుకేషన్ హబ్‌గా అమరావతి**

**ఆందోళనల్లో కొద్దిమందే: మంత్రి** 10

## జరిగేదీ.. ఒరిగేదీ?

**మూడు రాజధానులపై తీవ్ర చర్చ**

**అమరావతికి దెబ్బతో జంట జిల్లాల వేదన**

**హైకోర్టుతో లాభంపై కర్నూలులో మథనం**

**నవ్యాంధ్రలో ఏకైక మహా నగరం విశాఖ**

**ఇప్పటికే భూములు, ఇంటి అద్దె ధరలు భగ్గు**

ఏపీ హైగ్రేడ్ స్టీలు కార్పొరేషన్ లిమిటెడ్ నిర్మించే ఉక్కు కర్మాగారం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం జగన్




# ఉక్కు సంకల్పం

## మూడేళ్లలోనే కడప స్టీల్స్ నిర్మాణం పూర్తి: సీఎం

**ఉద్యమాలు, బలిదానాలు లేకుండానే వచ్చేసింది**

**మీ బిడ్డ ముఖ్యమంత్రిగా ఉండటమే కారణం**

**గోదావరి జలాలతో సీమ కరువు తీరిపోతుంది**

**60 వేల కోట్లతో కృష్ణలోకి తరలించే ప్రణాళిక**

**కడప పర్యటనలో సీఎం జగన్ ప్రకటన**

**ఉక్కు పరిశ్రమకు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

"రాష్ట్ర విభజన సమయంలోనే రాయలసీమలో కడప ఉక్కు పరిశ్రమ అవసరమని గుర్తించారు. ప్రత్యేక హోదా, ఉక్కు పరిశ్రమపై సంతకాలు చేశాకే రాష్ట్రాన్ని విడగొట్టారు. ఐదేళ్లు ఎదురు చూసినా ఫలితం లేదు. ఇప్పుడు మనమే నిర్మించుకోవాల్సి వస్తోంది"

- సీఎం జగన్ ఆక్రోశం

కడప, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన చేయడం తన జీవితకాలంలో మరిచిపోలేని ఘట్టమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేర్కొన్నారు. "ఫ్యాక్టరీలు కట్టడం రాష్ట్ర ప్రభుత్వాల పనికాదు. ఐదేళ్లు ఎదురు చూసినా విభజన చట్టంలోని హామీని అమలు చేయకపోవడంతో మన పిల్లల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. పెద్ద పెద్ద వాళ్లతో చర్చలు జరుపుతున్నాం. అవి ఏదో ఒక రోజు సఫలమవుతాయి. వాళ్లు ముందుకు వచ్చినా, రాకపోయినా మూడేళ్లలో ఈ పరిశ్రమ పూర్తి చేస్తాం" అని ప్రకటించారు. ఆంధ్రుల హక్కు.. విశాఖ ఉక్కు పిలుపుతో 1966లో పెద్ద ఎత్తున ఉద్యమం జరిగిందని గుర్తు చేశారు. ఈ ఉద్యమంలో ఆరుగురు మరణించారని తెలిపారు. "ఈ రోజు మీ బిడ్డ ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోవడం వల్ల ఎలాంటి ఉద్యమం లేకుండా ఏ ఒక్క ప్రాణం పోకుండా కడప ఉక్కు పరిశ్రమ ప్రారంభిస్తున్నాం. అనంతపురం జిల్లాలో కార్ల పరిశ్రమ ఉంది. ఇక్కడ ఉక్కు పరిశ్రమ నిర్మిస్తే అనుబంధ పరిశ్రమలు మరిన్ని వస్తాయి. రాయలసీమలో

మిగతా 2వ పేజీలో...

## ఎన్‌ఆర్సీకి మేం వ్యతిరేకం: జగన్


సోమవారం ఢిల్లీలో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా మహానటి సినిమాకు ఉత్తమ నటిగా జాతీయ అవార్డు అందుకుంటున్న కీర్తి సురేశ్

## బార్ల రద్దుపై స్టే

**కొత్త లైసెన్సుల ప్రక్రియకు బ్రేక్** 10






## శాసనోల్లంఘన ఉద్యమం

**సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా వేలాది మందితో భారీ ర్యాలీలు**


9
రాజ్‌ఘాట్ వద్ద సత్యాగ్రహంలో సోనియా, మన్మోహన్, రాహుల్

## భారతీయులమని చాటిచెప్పండి

**యువతకు రాహుల్ పిలుపు.. అమరుల సాక్షిగా పోరుకు తీర్మానం: ప్రియాంక**

**రాజ్‌ఘాట్‌లో 'ఐక్య' సత్యాగ్రహం.. సోనియా, రాహుల్ సహా అగ్రనేతల హాజరు**


కన్నీటి వేడుకోలు

## లక్ష ఇస్తాం.. పొలం వదులుకో!

**పట్టాదారు పాస్ పుస్తకం అడిగిన ఓ మహిళా రైతుతో వీఆర్‌ఏ బేరం**

**ఆర్‌ఐ కాళ్లపై పడి కన్నీరుమున్నీరు.. ప్రకాశం జిల్లా 'స్పందన'లో ఘటన**

**ఈమె** మహిళా రైతు గురక వెంకటలక్ష్మమ్మ. తమ పొలానికి పట్టాదారు పాస్ పుస్తకం కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ, అధికారుల చుట్టూ కొన్నినెలలుగా తిరుగుతోంది. 'పాస్ పుస్తకం రాదు. లక్ష ఇస్తాం. పొలం వదులుకోండి' అని స్వయంగా వీఆర్‌ఏ బేరానికి దిగడంతో ఆమె దిమ్మెరపోయింది. న్యాయం చేయాల్సిన అధికారే ఇలా అంటే ఇక దిక్కెవరు? దీంతో సోమవారం ప్రకాశం జిల్లా రాచర్ల మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమానికి వచ్చిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కాళ్లపై పడిపోయింది. తన గోడంతా వెళ్లబోసుకోంది. ఆమె కథనం ప్రకారం, రాచర్ల మండలం సోమిదేవిపల్లికి చెందిన గురక కోటమ్మకు ఇద్దరు కుమారులు. వారిలో ఒకరైన లక్ష్మిరెడ్డి తన తల్లి పేరు మీద ఉన్న 2.75 ఎకరాల పొలంలో తన సగం వాటా రిజిష్టర్ చేయించుకున్నాడు. తన వాటాగా వచ్చిన పొలానికి పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేయాలంటూ నాలుగు నెలల క్రితం మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నారు. లక్ష్మిరెడ్డి పొలం పనుల్లో ఉండటంతో, ఆయన తరపున వెంకటలక్ష్మమ్మ అధికారుల చుట్టూ తిరుగుతోంది. అయినా పని కావడం లేదు. ఎందుకనేది స్పందన కార్యక్రమానికి వచ్చిన ఆర్‌ఐకి కన్నీళ్లపర్యంతమవుతూ ఆమె చెప్పుకొంది. 'రూ.లక్ష తీసుకుని పొలం వదులుకోవాలని వీఆర్‌ఏ ఒత్తిడి తెస్తున్నారు. ఆ పొలమే మాకు ఆధారం. న్యాయం చేయండి" అంటూ ప్రాధేయపడింది.

-రాచర్ల

## ట్యూషన్ ఫీజుకు బ్రేక్!

**50 ఇంజనీరింగ్ కాలేజీలపై నిబంధనల కొరడా**

**'నో ట్యూషన్ ఫీజ్'కు సిఫారసు?**

**అఫిలియేషన్ రద్దుకూ అవకాశం**

**రూల్స్ బేఖాతరు చేస్తున్న కాలేజీలకు షాక్**

**35 వేలకన్నా తక్కువకు కనీస ఫీజు**

**ఉన్నత విద్య నియంత్రణ కమిషన్ నిర్ణయం**

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) నిబంధనలు పాటించకుండా, కనీస ప్రమాణాలు లేకుండా నడుస్తున్న ఇంజనీరింగ్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకునేలా ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సిఫారసులు చేయనుందని తెలుస్తోంది. రాష్ట్రంలో మొత్తం 287 ప్రైవేట్

మిగతా 2వ పేజీలో...

# అందరిలో దేవుణ్ని చూడటమే పూర్ణ పూజ



పరంజ్యోతి

*జగత ఈశధీయుక్త సేవనం*
*అష్టమూర్తి భృద్దేవపూజనం*

"ఈ జగత్తు అంతా ఆ పరమేశ్వరుడే అనే భక్తిభావంతో కూడిన బుద్ధితో ఈ జగత్తుకు చేసే సేవ అంతా.. ఎనిమిది రూపాలను ధరించిన భగవంతుడి పూజే అవుతుంది" అని దీని అర్థం. భగవాన్ రమణులు బోధించిన 30 శ్లోకాల 'ఉపదేశ సారం'లో ఐదో శ్లోకమిది. భక్తిని పెంపొందించుకోవడానికి చేసే సాధనలలో మొదటిదైన పూజ గురించి రమణ మహర్షి ఈ శ్లోకం ద్వారా వివరించారు. అసలైన, శ్రేష్ఠమైన పూజ ఏదో దీని ద్వారా చెప్పారు. భగవంతుని పూజను నాలుగు గోడల మధ్య నుంచి.. మందిరాల నుంచి.. దేవాలయాల నుంచి.. ఈ విశాల విశ్వంలోకి తీసుకొచ్చారు. సామాన్యంగా పూజ అనగానే ఒక మందిరంలోనో, దేవాలయంలోనో కూర్చుని ఒక విగ్రహానికి చేసే షోడశోపచారం లేదా పుష్పాలతో చేసే అష్టోత్తరపూజ అందరికీ గుర్తొస్తాయి. అక్కడ విగ్రహాన్ని భగవంతునిగా భావించి భక్తితో సేవిస్తాం. ఆ విగ్రహాన్ని తప్ప మిగిలినవాటిని గానీ, తోటివారినిగానీ భగవంతుడి కన్నా వేరుగా చూస్తాం. ఒక్కచోటనే భగవంతుని చూసే ఈ దృష్టి సంకుచిత దృష్టి. విగ్రహారాధనం అనేది ఈశ్వరుని అష్టమూర్తులలో ఒకటైన పార్థివమూర్తి ఆరాధనమేగానీ అది పూర్ణ పూజ కాదు. సమస్త జగత్తునూ ఈశ్వర స్వరూపంగా చేసే పూజే.. అష్టమూర్తుల పూజ. అదే పూర్ణ పూజ. అలాగని విగ్రహారాధన తప్పు కాదు. మన మనసును భక్తిమార్గంలోకి మళ్లించి సాధన క్రమంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లే తొలి మెట్టు అది.



కార్యంలో ఉన్నదంతా కారణమేనన్న విషయం మనకూ అనుభవమే. కుండ కార్యం. మట్టి కారణం. కుండలో ఉన్నదంతా మట్టే. నగ కార్యం. బంగారం కారణం. నగలో ఉన్నది బంగారమే. అలాగే జగత్తు కార్యం. జగన్నాథుడు కారణం. జగత్తులో ఉన్నదంతా పరమాత్మే తప్ప మరేమీ కాదు. మట్టిని తీసేస్తే కుండ ఎట్లా లేదో, బంగారాన్ని తీసేస్తే ఆభరణం ఎలా లేదో.. అలాగే, భగవంతుని తీసేస్తే జగత్తు లేదు. జగత్తంతా పరమేశ్వరుడే కనుక జగత్తులో ఉన్న.. మనుషులు, జంతువులు, చెట్లు.. అన్నీ ఆ పరమేశ్వరుడే. అన్ని రూపాల్లో, అన్ని దేహాల్లో అంతర్యామిగా ఉన్నది ఆ దేవుడే. కాబట్టి ఎవరిని పూజించినా భగవంతుని పూజించినట్లే. కానీ, మనం అందరినీ భగవత్ భావనతో చూడట్లేదు కనుక ఆచరణలో ఎవరినీ ద్వేషించకుండా ఉండడం సాధ్యం కావట్లేదు. అలా అందరిలోనూ, అంతటా, అన్ని వేళలా భగవంతుని దర్శించగలిగే జ్ఞానం, అనుభవజ్ఞానం కలిగేంతవరకూ సాధకులు భగవంతుని కొన్ని విశిష్టమూర్తుల్లో గుర్తించి ఆ గుర్తింపునే పూజగా చేయాల్సి ఉంది. అదే అష్టమూర్తి పూజ. దాన్నే రమణులు చెప్పారు. చరాచరాత్మక ప్రపంచమంతా భగవంతుని అష్టమూర్తులుగా మనకు దర్శనమిస్తోంది కాబట్టి.. భగవంతుని ఎనిమిది విశిష్ట రూపాల్లో గుర్తించి పూజించాలి. ఏమిటా అష్టమూర్తులంటే.. భూమి, నీరు, అగ్ని/తేజస్సు, వాయువు, ఆకాశం, సూర్యుడు, చంద్రుడు, అన్ని ప్రపంచ అనుభవాలను అనుభవించే జీవుడు. అష్టమూర్తి పూజకు డబ్బు ఖర్చు పెట్టాల్సిన పని లేదు. ఎవరిని చూసినా భగవంతుని చూసినట్లే భావించాలి. సర్వత్రా పరమాత్మ దర్శనం అలవడాలి. అదే గొప్ప పూజ. పూర్ణ పూజ. ఉత్తమ పూజ.

- దేవిశెట్టి చలపతిరావు, care@srichalapathirao.com



వేదికపై తంబుర మీటుతూ గాత్ర సహకారం అందిస్తున్న సమ్య మెహబూబ్ అహమ్మద్ (ఎడమ చివర)

## ప్రపంచబ్యాంక్ డైరెక్టర్ సతీమణి గాత్ర కచేరి

తిరుమల, డిసెంబరు 23: తిరుమలలోని నాదనీరాజనం వేదికపై సోమవారం సాయంత్రం నిర్వహించిన హిందుస్థానీ గాత్ర కచేరీలో ప్రపంచ బ్యాంక్ భారతదేశ డైరెక్టర్ జునైద్ అహమ్మద్ సతీమణి సమ్య మెహబూబ్ అహమ్మద్ గాత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కచేరిని జునైద్ అహమ్మద్ వేదిక ముందు కూర్చుని ఆసాంతం వీక్షించారు. న్యూఢిల్లీకి చెందిన సుమిత్ర తమ బృందంతో కలిసి హిందుస్థానీ గాత్ర కచేరి చేయగా అందులో గాత్ర సహకారంతో పాటు తంబుర వాయిద్యంతో సమ్య మెహబూబ్ ప్రేక్షకులను అలరించారు.

## ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్‌కు అరుణ్‌సాగర్ విశిష్ట పురస్కారం

- ప్రసేన్‌కు విశిష్ట సాహిత్య అవార్డు

ఖమ్మం అర్బన్, డిసెంబరు 23: 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్, ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ కవి, జర్నలిస్టు ప్రసేన్.. ప్రతిష్ఠాత్మక అరుణ్ సాగర్ పురస్కారాలకు ఎంపికయ్యారు. జనవరి 2న హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డులు అందజేస్తారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన అరుణ్‌సాగర్ కవిగా, జర్నలిస్టుగా సాహిత్య, పాత్రికేయ రంగాల్లో తనదైన ముద్ర వేశారు. ఆయన మరణానంతరం స్నేహితులంతా కలిసి అరుణ్‌సాగర్ పేరుతో ట్రస్టు ఏర్పాటు చేసి సాహిత్యం, పాత్రికేయ రంగాల్లో ప్రతిభావంతులకు ఈ అవార్డులు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్‌కు విశిష్ట పాత్రికేయ అవార్డు, ప్రసేన్‌కు విశిష్ట సాహిత్య పురస్కారాన్ని ప్రకటించారు.

# తెలుగుకు టెక్ వెలుగులు

- తెలుగే కోరుకుంటున్న 92% మంది నెటిజన్లు
- భారతీయ భాషలపై నెట్ దిగ్గజాల ప్రత్యేక దృష్టి
- బెంగళూరులో 'గూగుల్ ఏఐ' కేంద్రం ఏర్పాటు
- తెలంగాణ ప్రభుత్వ వెబ్‌సైట్లకూ సహకారం
- మరింత సులభతరం చేస్తామని వికీపీడియా ప్రకటన

హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'తెలుగు చదివితే భవిష్యత్తు లేదు..' అనే అభిప్రాయం సర్వత్రా వ్యాపిస్తుండగా.. ఆన్‌లైన్‌లో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఇంటర్‌నెట్ వినియోగించే తెలుగువారంతా.. తమకు తెలుగులోనే సమాచారం కావాలని కోరుకుంటున్నారు. మాతృభాషలో టైపింగ్ కోసం తెలుగు కీబోర్డులను వినియోగిస్తున్నారు. గూగుల్ సేవలను అమ్మ భాషలోనే పొందుతున్నారు.. వికీపీడియా సమాచారం మాతృభాషలోనే చదవడానికి ఇష్టపడుతున్నారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఇంటర్‌నెట్‌ను వినియోగిస్తున్న తెలుగువారిలో 92 శాతం మందిది ఇదే ఆకాంక్ష అని గూగుల్ ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో తేలింది. దీంతో ఇంటర్‌నెట్ దిగ్గజ సంస్థలు తెలుగుపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాయి. ఈ విషయంలో గూగుల్ ఇప్పటికే ముందుండగా.. వికీపీడియా, ఇతర సంస్థలూ ఇదే బాటలో పయనిస్తున్నాయి. తెలుగువారికి దగ్గరవ్వాలంటే తెలుగుకు దగ్గరవ్వాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయి. ఈ పరిణామాలు ఇంటర్‌నెట్‌లో తెలుగుకు మరింత వెలుగు ఇస్తున్నాయి.

### గూగుల్ అధ్యయన ఫలితాలు..

2016 చివరి నాటికి 4 కోట్ల మంది తెలుగువారు ఇంటర్నెట్ వినియోగిస్తున్నట్టు గూగుల్ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. 2019 నాటికి ఈ సంఖ్య 7 కోట్లకు చేరింది. మాతృభాషల వినియోగంపై తాజాగా గూగుల్ మరో సర్వే చేయగా సగటున ప్రతి 10 మంది భారతీయ వినియోగదారుల్లో 9 మంది గూగుల్‌లో తమ తమ భాషల్లోని సమాచారం కోసమే వెతుకుతున్నారని వెల్లడైంది. భారతీయ భాషలు వాడేవారిలో 88 శాతం మంది తమ భాషల పట్ల ఆసక్తి చూపిస్తుండగా.. తెలుగులో ఈ సంఖ్య మరింత అధికంగా ఉందని తేలింది. ఇతర భాషల్లో ఇది 88శాతం ఉండగా, తెలుగులో 92 శాతం మంది ఉండటం గమనార్హం. ఈ ఫలితాల నేపథ్యంలో గూగుల్ తెలుగు వారికి మరింత చేరువయ్యేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది.




బెంగళూరులో ఇటీవలే ప్రారంభించిన గూగుల్ ఏఐ కేంద్రం

### గూగుల్-నవలేఖ..

మనదేశంలో చాలా ప్రాంతీయ పత్రికలు ఇప్పటికీ చిత్రాలు (ఇమేజెస్), పీడీఎఫ్‌ల రూపంలోనే కంటెంట్‌ను ఆన్‌లైన్‌లో ప్రచురిస్తున్నాయి. ఆ సమాచారం యూనీకోడ్ అక్షరాల్లో లేకపోవడంవల్ల గూగుల్ సెర్చ్‌లో కనిపించవు. కొత్తగా ఆ పనిచేయాలంటే అది చాలా ఖర్చుతో కూడుకున్న పని. అలాంటివారి కోసమే గూగుల్ సంస్థ 'ప్రాజెక్ట్ నవ్‌లేఖ'ను అందుబాటులోకి తెచ్చింది. యూనీకోడ్ సదుపాయం లేని ప్రచురణ సంస్థలు ఈ ప్రాజెక్టులో నమోదు చేసుకుంటే చాలు. ఏ భాషలో ఉన్న పీడీఎఫ్/ఇమేజెస్‌లోని విశేషాలనైనా కొన్ని నిమిషాల వ్యవధిలో యూనీకోడ్‌లోకి మార్చేస్తుంది. చాలావరకూ భారతీయ భాషల కంటెంట్ యూనీకోడ్ ఫాంట్లలో కాక అను వంటి నాన్-యూనీకోడ్ ఫాంట్లలో ఉండడం లేదంటే పుస్తక రూపేణా ఉండిపోవడం వంటి సమస్యలను గమనించి గూగుల్ ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఉపయోగంలో దీనిని మరింత సులభతరం చేసేలా బెంగళూరు కేంద్రంలో పరిశోధనలు సాగుతున్నాయి.

### వెబ్‌సైట్లు తెలుగులోనే..

తెలుగుతో పాటు ఇతర భారతీయ భాషల్లో నెట్ వినియోగాన్ని పెంచేందుకు గూగుల్ ఇటీవలే బెంగళూరులో కృత్రిమ మేధస్సు కేంద్రాన్ని ప్రారంభించింది. ఇందులో కృత్రిమ మేధస్సును తెలుగు సహా భారతీయ భాషల్లో మెరుగుపరచనుంది. గూగుల్ అసిస్టెంట్ సేవలు ప్రాంతీయ భాషల్లో మరింత స్పష్టంగా ఉండేలా ఈ కేంద్రం పరిశోధనలు చేస్తోంది. అలాగే ప్రభుత్వపరంగా తెలుగు వినియోగంపై సహకారం అందిస్తోంది. దీనికోసం తెలంగాణ ఐటీ శాఖతో ఇటీవలే ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వ వెబ్‌సైట్లలో ఇంగ్లిష్‌లో ఉన్న సమాచారాన్ని, సంక్షేమ పథకాల వివరాలను సామాన్య ప్రజలకూ అర్థం అయ్యేందుకు తెలుగులోని అనువదించనుంది.

### వికీపీడియా కొత్త నిర్ణయాలు

తెలుగు వికీపీడియా ప్రారంభించి డిసెంబరు 22 నాటికి 16 సంవత్సరాలు పూర్తయింది. ఈ సందర్భంగా తెలుగు వికీపీడియన్లు ఆదివారం గచ్చిబౌలిలో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో తెలుగు వికీపీడియాలో అభివృద్ధి చేయాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు 20 వేలకు పైగా గ్రామాల సమాచారం ప్రస్తుతం తెలుగులోనే అందుబాటులో ఉంది. వాటికి సంబంధించి మరింత సమాచారం జతచేయాలని నిర్ణయించారు. తెలుగు వ్యాసాల్లో నాణ్యత పెంచాలని, సంబంధిత రంగాల నిపుణులతో పాటు ప్రజల భాగస్వామ్యం పెంచేలా వారితో వ్యాసాలు రాయించే దిశగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలుగు వికీపీడియా ప్రతినిధులు నిర్వహించారు. ఈ సమావేశంలో శిరీష్ కుమార్, ప్రణయ్ రాజ్, పవన్ సంతోష్, జంగం వీర శశిధర్, యర్రా రామారావు, వీవెన్, డాక్టర్ రాజశేఖర్, ఇడుపులపాటి మహేష్, తదితరులు పాల్గొన్నారు. తెలుగులో వికీపీడియా సమాచారాన్ని మరింత సులభతరం చేయాలని, నాణ్యత పెంచాలని నిర్ణయించామని వారు తెలిపారు.

## లోకం తీరు




ఈశాన్యంలో బరువు పెరిగితే మంచిదంటావా!?

## కోస్తాకు వర్షసూచన

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ అరేబియా సముద్రం, దానికి ఆనుకుని వున్న ప్రాంతాల్లో అల్పపీడనం, దానిపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నాయి. ఇంకా దక్షిణ తమిళనాడు పరిసరాల్లో మరో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. వీటి ప్రభావంతో తమిళనాడు దానికి ఆనుకుని కోస్తా, రాయలసీమపైకి తూర్పు గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల మేఘాలు ఆవరించి తేలికపాటు జల్లులు కురిశాయి. రానున్న ఇరవై నాలుగు గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. తూర్పుగాలుల ప్రభావంతో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం, అంతకంటే ఎక్కువగా నమోదవుతాయని పేర్కొంది.



## పౌరసత్వ చట్టంలో షరతులు రాజ్యాంగ విరుద్ధం

పౌరసత్వ సవరణ చట్టంలో 'అక్రమ వలసదారుల'కు సంబంధించి షరతులు విధించడం రాజ్యాంగ విరుద్ధం. సహేతుకమైన సంబంధంతో చట్టం ద్వారా హేతుబద్ధమైన వర్గీకరణ జరగాలి. ఏకపక్ష వర్గీకరణ చేయకూడదు.

- జస్టిస్ మదన్ లోకుర్, సుప్రీంకోర్టు మాజీ జడ్జి



రాజ్‌భవన్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకలలో కేక్ కట్ చేస్తున్న గవర్నర్

## రాజ్‌భవన్‌కు ప్రత్యేక వెబ్‌సైట్

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాజ్‌భవన్‌ను ప్రజలకు మరింత చేరువ చేసే క్రమంలో విభిన్న అంశాలతో ఒక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. రాజ్‌భవన్ కోసం సిబ్బంది అభివృద్ధి చేసిన వెబ్‌సైట్‌ను సోమవారం ఆయన విజయవాడలో ఆవిష్కరించారు. వెబ్‌సైట్‌లో.. గవర్నర్‌ను కలవాలనుకునే సందర్శకులు ఆన్‌లైన్‌లో ఇ-విజిటర్ సదుపాయం ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఇ-గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదులను సమర్పించవచ్చు. గవర్నర్‌ను సంప్రదలచినవారు http:governor.ap.gov.in లేదా http:rajb-havan.ap.gov.in వెబ్‌సైట్‌ల ద్వారా సంప్రదించవచ్చునని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. కాగా, మానవత్వమే మతం కావాలని, లౌకిక భారతదేశంలో అన్ని కులాలు, మతాలు ఒక్కటేనని ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా జరుపుకునే క్రిస్మస్ పర్వదినం నేపథ్యంలో.. నమ్మికగొన్న వారి ఇంట సుఖశాంతులు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. సోమవారం విజయవాడలో రాజ్‌భవన్ వేదికగా జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఇక, లోక కల్యాణం కోసం శాంతి సందేశం ఇవ్వడమే క్రిస్మస్ పండుగ ప్రధాన ఉద్దేశమని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఆత్మకూరులోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం రాత్రి జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో చంద్రబాబు కేక్ కట్ చేసి రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

## హైకోర్టు తరలింపు అన్యాయం.. లాయర్ల ధర్నా

విజయవాడ లీగల్, గుంటూరు, డిసెంబరు 23: హైకోర్టును కర్నూల్‌కు తరలించాలన్న సీఎం జగన్ నిర్ణయాన్ని బెజవాడ బార్ న్యాయవాదులు తప్పుబట్టారు. దీనికి నిరసనగా బెజవాడ బార్ అధ్యక్షుడు పోపూరి లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విజయవాడలో ర్యాలీ నిర్వహించి ఐదవ నెంబరు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హైకోర్టును కక్షిదారులు, న్యాయవాదులకు దూరంగా, ఒక ప్రాంతం వారికి మాత్రమే లబ్ధిచేకూరే విధంగా కర్నూల్‌కు తరలించడం అన్యాయమని నిందించారు. అమరావతిలో ఆందోళన చేస్తున్న రైతులకు గుంటూరు బార్ అసోసియేషన్, హైకోర్టు న్యాయవాదులు మద్దతు తెలిపారు.

## జనాన్ని ఇంత క్షోభపెడతారా?: యడ్లపాటి



తెనాలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎంతో చరిత్ర ఉన్న తెలుగు రాష్ట్రంలో జనాన్ని ఇంతటి క్షోభకు గురిచేసే ఇటువంటి సీఎంని తన 101 ఏళ్ల జీవితంలో గానీ, రాజకీయ చరిత్రలోగానీ చూడలేదని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యడ్లపాటి వెంకట్రావు విమర్శించారు. ప్రధాని మోదీ, సుప్రీంకోర్టు జడ్జి వంటి ప్రముఖులు వచ్చి శంకుస్థాపన చేసినప్పుడు లేని అభ్యంతరం.. అధికారంలోకి వచ్చాక జగన్‌కు ఎందుకు వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఎంతో ముందుచూపుతో రాజధానిని నిర్ణయించారని, కానీ జగన్ అమరావతిని ముంపు ప్రాంతంగా చూపేందుకు ప్రయత్నించి విఫలమయ్యారని, ఇప్పుడు జగన్ చెప్పిన కొత్త ప్రాంతాలు విపత్తులకు నష్టం కలిగించేవని, ఇటీవలి తుఫానులకు వణికిపోయిన విషయాన్ని గుర్తుచేసుకోవాలని సూచించారు. ఒక రాజధాని నిర్మాణానికే డబ్బులేవని చెబుతూ మూడు రాజధానులు ఎట్లా నిర్మిస్తారని ప్రశ్నించారు. సీఎం జనానికి తండ్రి స్థానంలో ఉండి వారి సంక్షేమం చూడాలి తప్ప.. జగన్‌లా క్షోభకు గురిచేయకూడదని చెప్పారు. అప్పులతో వేరైన రాష్ట్రంలో రాజధాని కోసం రైతులు 33 వేల ఎకరాలను ఉచితంగా అప్పగిస్తే, చివరకు వారి త్యాగాలను కూడా ఎగతాళి చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి పదవి గొప్పదని, అది వచ్చాక కూడా చిన్నపిల్లల తరహాలో ఆలోచిస్తే జగన్‌కు రాజకీయ అభివృద్ధి ఉండకపోవచ్చన్నారు.

# హ్యాపీనెస్ట్.. వాట్ నెక్స్ట్.!?

- తీవ్ర ఆందోళనలో బుకింగ్‌దారులు
- ఆన్‌లైన్‌లో 1200 ప్లాట్ల బుకింగ్
- సీఆర్డీయేకు 72 కోట్ల చెల్లింపు

(ఆంధ్రజ్యోతి-అమరావతి)

కృష్ణానదీ తీరంలో అమరావతి రాజధాని.. దాని నడిబొడ్డున అన్ని హంగులతో హ్యాపీనెస్ట్.. 12 టవర్లతో 1200 అపార్ట్‌మెంట్ల నిర్మాణం.. అన్నీ ఎకో ఫ్రెండ్లీగా మేమే నిర్మించి ఇస్తాం.. అని గత ప్రభుత్వ హయాంలో ఏపీసీఆర్‌డీయే ప్రకటించగానే దేశవిదేశాల నుంచి అనేకమంది ఆన్‌లైన్‌లో ఈ ప్లాట్లను బుక్ చేసుకున్నారు. అడ్వాన్స్‌గా రూ. లక్షల్లో చెల్లించారు. అయితే కొత్తగా ఏర్పడిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాజధాని వికేంద్రీకరణ ప్రతిపాదనను తెరమీదకు తీసుకురావడంతో.. ఇప్పుడు 'హ్యాపీనెస్ట్'పై తీవ్ర ఆందోళన నెలకొంది. బుకింగ్ దారుల్లో అత్యధికులు తాము ఇప్పటి వరకూ చెల్లించిన సొమ్మును వెనక్కు ఇచ్చేయాలని సీఆర్‌డీఏను కోరుతున్నారు. కొంతమంది మాత్రం రాజధాని భవితవ్యంపై స్పష్టత వచ్చేవరకు ఆగడమే మేలని భావిస్తున్నారు. జగన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచే ప్రతిష్ఠాత్మక 'హ్యాపీనెస్ట్' ప్రాజెక్టు భవితవ్యంపై అనుమానాలు నెలకొన్నాయి. తాజా పరిణామాలతో బుకింగ్‌దారులు మరింత కలత చెందుతున్నారు. దీనిపై పూర్తి సమాచారం తెలుసుకునేందుకు కొందరు సోమవారం విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. కమిషనర్ పి.లక్ష్మీనరసింహాన్ని కలుసుకుని, తమ ఆందోళనను వెలిబుచ్చారు. ఆయన వారితో హ్యాపీనెస్ట్ ప్రాజెక్ట్ అధికారిణి ఎస్.శర్మదతో సమావేశాన్ని ఏర్పాటు చేయించారు. ఇప్పటికే చెల్లించాల్సిన మొత్తంలో పదో వంతు కట్టామని, తాజా పరిణామాలతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతుందా లేదా అని బుకింగ్ దారులు ప్రశ్నించారు. ఒకవేళ నిర్మాణం జరిగినా.. సచివాలయం, హైకోర్టు అమరావతి నుంచి తరలిపోతే హ్యాపీనెస్ట్‌కు ఏమాత్రం డిమాండ్ ఉండదని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో దీనిపై స్పష్టత ఇవ్వాల్సిందిగా శర్మదను అభ్యర్థించారు. ఇప్పటి వరకూ తాము చెల్లించిన అడ్వాన్స్‌ను తిరిగివ్వాలని బుకింగ్‌దార్లలో కొందరు కోరగా, అసలు ఈ ప్రాజెక్ట్‌ను కొనసాగించాలని సీఆర్డీయే భావిస్తుందో, లేదో చెప్పాలని మరికొందరు డిమాండ్ చేశారు. కాగా.. వారి అభిప్రాయాలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, వారి ఆదేశానుసారం తగిన నిర్ణయాలు తీసుకుంటామని శర్మద వారికి చెప్పినట్లు తెలిసింది.



## మహిళలను గౌరవిస్తామంటూ విద్యార్థుల ప్రమాణం

మహిళలను గౌరవిస్తామని, వారికి భద్రత కల్పిస్తామంటూ ఢిల్లీలోని 22 లక్షల మంది ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులు ప్రమాణం చేశారు. ఢిల్లీలో మహిళలు రాత్రి కూడా నిర్భయంగా వెళ్లేందుకు సీసీటీవీ కెమెరాలు, వీధి లైట్లు ఏర్పాటు చేశాం.

- అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ సీఎం

# ఉక్కు సంకల్పం

(మొదటి పేజీ తరువాయి)

నవశకానికి నాంది పలుకుతాం'అని జగన్ ప్రకటించారు. సోమవారం ఆయన జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె దగ్గర రూ.15వేల కోటతో నిర్మించనున్న ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సున్నపురాళ్ల పల్లె వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభలో సీఎం ప్రసంగించారు. "ఐదేళ్లు పాలించాలని ప్రజలు అధికారం ఇస్తారు. నాలుగున్నరేళ్లు ఏమీ చేయకుండా ఎన్నికలకు ఆరు నెలల ముందు వచ్చి టెంకాయ కొడితే దాన్ని మోసమంటారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ఉక్కు పరిశ్రమకు టెంకాయ కొడితే చిత్తశుద్ధి అంటారు.. పాలనలో తేడా అంటే ఇదే" అని పరోక్షంగా మాజీ సీఎం చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. 'రూ.15వేల కోట్లతో 30 లక్షల టన్ను ల సామర్థ్యంతో ఈ ఉక్కు కర్మాగారం నిర్మిస్తు న్నాం. ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి' అని తెలిపారు. స్టీల్ పరిశ్రమకు ఇనుప ఖనిజం సరఫరాకు సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికీ, ఉక్కుశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### సీమకు గోదావరి జలాలు

"ఏటా 3వేల టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయి. గోదావరి - కృష్ణా అనుసంధానంలో భాగంగా గోదావరి జలాలను బానకచర్ల క్రాస్ రెగ్యులేటరులో కలుపుతాం. తద్వారా రాయలసీమతోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగు, తాగునీరు పుష్కలంగా అందుతుంది. ఈ ప్రాజెక్టు కోసం రూ.60 కోట్లతో ప్రణాళిక రూపొందించాం'అని నేలటూరులో జరిగిన సభలో సీఎం పేర్కొన్నారు. 'రూ.23వేల కోట్లతో గాలేరు-నగరి హంద్రీనీవా, తెలుగుగంగ, కేసీ కాల్వలను అభివృద్ధి చేసేందుకు రూ.23వేల కోట్లతో ప్రణాళిక రూపొందించాం' అని జగన్ వివరించారు. కుందూ-తెలుగు గంగ ఎత్తిపోతల పథకం, రాజోలి, జొలదరాశి జలాశయాలకు ఇక్కడ శంకుస్థాపన చేశారు.

### ఎన్‌ఆర్సీకి మేం వ్యతిరేకం

జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్‌ఆర్సీ)కి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆంధ్రప్రదేశ్ మద్దతు ఇవ్వదని ముఖ్యమంత్రి జగన్ స్పష్టం చేశారు. కడపలో రిమ్స్ ఆసుపత్రిలో వైఎస్ఆర్ కేన్సర్ కేర్ యూనిట్, సూపర్ స్పెషాలిటీ బ్లాక్, మానసిక వైద్య విభాగాలకు శంకుస్థాపన అనంతరం సీఎం జగన్ మాట్లాడారు. "హెలిప్యాడ్ నుంచి ఇక్కడకు నేను వస్తున్నప్పుడు కడపకు చెందిన ముస్లిం మైనార్టీ పెద్దలు వలీవుల్లాహుసేన్, నయీంలు ఎన్‌ఆర్సీపై ప్రకటన చేయాలని కోరారు. ఇప్పటికే మా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా దీనిపై స్పందించారు. నాతో చర్చించాకే ఆయన మాట్లాడారు. ఆయన ప్రకటనకు ఏపీ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఎన్‌ఆర్సీకి ఏపీ వ్యతిరేకం. మైనార్టీలకు వైసీపీ అండగా ఉంటుంది" అని చెప్పారు.

ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేయడంపై రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సున్నపురాళ్లపల్లెకు వచ్చి ఆయన సీఎంను కలిశారు. మరోవైపు.. జగన్ మాట్లాడుతున్న సమయంలో, ఆ తర్వాత ఎర్రగుంట్లకు చెందిన ఆర్టీపీపీ ఉద్యోగులు 'సేవ్ ఆర్టీపీపీ'ప్లకార్డులు ప్రదర్శించారు. దీనిపై సీఎం స్పందించలేదు. నేలటూరు సభలో ఉల్లి, పసుపు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కోరినా పట్టించుకోలేదు.



సీఎం రమేశ్ ధన్యవాదాలు

# ట్యూషన్ ఫీజుకు బ్రేక్!

(మొదటి పేజీ తరువాయి)

ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా.. వీటిలో దాదాపు 50 కళాశాలలకు 2019-20 నుంచి 2021-22 విద్యా సంవత్సరాలకు ట్యూషన్ ఫీజును సిఫారసు చేయకుండా 'నో ఫీ' జాబితాలో పెట్టే పరిస్థితి కనిపిస్తోంది. అంతేకాదు ఆయా ఇంజనీరింగ్ కళాశాలల అఫిలియేషన్ రద్దుచేసేలా విశ్వవిద్యాలయాలకు సిఫారసు చేయనున్నట్టు సమాచారం. గత ఏఎఫ్‌ఆర్‌సీ సిఫారసు చేసిన ఫీజుల ప్రాతిపదిక కాకుండా, వాస్తవిక ఆదాయ-వ్యయాలు, ఫ్యాకల్టీ, మౌలిక సదుపాయాలు.. వంటి అంశాలను ప్రాతిపదికగా తీసుకుని కొత్త ట్యూషన్ ఫీజులను సిఫారసు చేయాలని కమిషన్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఉన్న కనీస ఫీజు రూ.35 వేలు తగ్గించే అవకాశం కనిపిస్తోంది. నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోని కాలేజీలకు చెక్ పెట్టాలని, అవసరమైతే ఫీజును తగ్గించడం లేదా అసలు ఫీజు లేకుండా సిఫారసు చేయాలన్న యోచన కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

### అలాంటి కాలేజీలకు తాళమే!

విద్యా ప్రమాణాలను పక్కనపెట్టి.. ప్రభుత్వం ఇచ్చే ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసమే నిర్వహిస్తున్న కాలేజీలపై ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ నిశిత దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు 3 దశల్లో 120 ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రత్యేక బృందాల ద్వారా కమిషన్ ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. కొన్ని కాలేజీల పనితీరు అధ్వాన్నంగా ఉన్నట్లు కమిషన్ ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. ముఖ్యంగా ఫ్యాకల్టీ విషయంలో దారుణమైన పరిస్థితి ఉన్నట్లు తేల్చింది. సీఎం జగన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని ఇంజనీరింగ్ కాలేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, నిబంధనలను పాటించని కాలేజీలను ఏ మాత్రం ఉపేక్షించరాదని కమిషన్ భావిస్తోంది. నాలుగో విడత ఈ నెల 28-29 తేదీల్లో మరో 50 కాలేజీల్లో తనిఖీలు చేపట్టనుంది.

వాస్తవ ప్రణాళికలో భాగంగా.. 2019-20-22 వరకు అంటే మూడు సంవత్సరాల సగటు కాలానికి ట్యూషన్ ఫీజులపై ఈ నెలాఖరులోనే హైకోర్టుకు, ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని కమిషన్ తెలిపింది. కొంచెం ఆలస్యమైనా పక్కా పరిశీలన అనంతరమే నివేదిక ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. పరిశీలనలో భాగంగా జనవరి తొలివారంలో కాలేజీలు తమ వాదన వినిపించుకునే అవకాశం కల్పించాలని కమిషన్ భావిస్తోంది. జనవరి నెలాఖరు నాటికి ట్యూషన్ ఫీజులు సహా నిబంధనలు పాటించని కాలేజీలపై చర్యలకు సంబంధించిన సిఫారసులతో కూడిన నివేదికను అందించనున్నట్టు సమాచారం.



## 'లెగో' పరిజ్ఞానంతో క్వాంటమ్ కంప్యూటర్లు

లండన్, డిసెంబరు 23 : ఇవి డెన్మార్క్‌లో ఉత్పత్తి అయ్యే 'లెగో' కంపెనీ ఆటబొమ్మలు. బ్రిటన్‌లోని ల్యాన్‌కాస్టర్ వర్సిటీ శాస్త్రవేత్తలు వీటిని క్వాంటమ్ కంప్యూటర్లను చల్లబరిచే డైల్యూషన్ రిఫ్రిజిరేటర్‌లో ఉంచారు. అందులో అంతరిక్షంలో కంటే 2వేల రెట్ల కనిష్ఠ ఉష్ణోగ్రత ఉంటుంది. కొన్ని గంటలు గడిచినా.. లెగో బొమ్మలు రిఫ్రిజిరేటర్‌లో కరగకుండా, మరగకుండా ఉండగలిగాయి. భవిష్యత్తులో లెగో బొమ్మల్లాంటి దృఢమైన పదార్థాలతో చౌకగా డైల్యూషన్ రిఫ్రిజిరేటర్లు, క్వాంటమ్ కంప్యూటర్ల పరికరాల తయారీకి ఈ పరిశోధన దోహదం చేయనుంది.



## కెఫిన్‌తో హృద్రోగాలకు చెక్

వాషింగ్టన్, డిసెంబరు 23 : కాఫీలోని కెఫిన్ అనే పదార్థం అలసటను దూరం చేస్తుందని మనకు తెలుసు!! హృద్రోగాలు రాకుండా, శరీరం/రక్తంలో కొవ్వు పేరుకుపోకుండా చేసే గుణాలు కూడా అందులో సమృద్ధిగా ఉన్నాయని అమెరికాలోని ఇల్లినాయిస్ వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. వారు అధ్యయనంలో భాగంగా నాలుగు వారాలపాటు ఎలుకలకు ద్రవరూపంలో కెఫిన్‌ను అందించారు. ఇదే కాలంలో మరికొన్ని ఎలుకలను కెఫిన్‌కు దూరంగా ఉంచారు. ఇతర ఎలుకలతో పోల్చుకుంటే కెఫిన్ ద్రావణం తాగిన మూషికాల శరీర బరువు(16 శాతం), కొలెస్టరాల్(22 శాతం) తక్కువగా పెరిగినట్లు గుర్తించారు. ఫలితంగా వాటిలో స్థూలకాయం సమస్య తగ్గుముఖం పట్టినట్లు నిర్ధారించారు.

# పనికి వెళుతూ...పరలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులు మృతి
- ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్
- విశాఖ జిల్లాలో ఘోరం




కశింకోట, డిసెంబరు 23: ఆ యువకులు భవిష్యత్తుపై కోటి ఆశలతో ముందుకు సాగుతున్నారు...ఆర్మీలో ఉద్యోగం సంపాదించి తల్లిదండ్రులకు అండగా ఉండాలనుకున్నారు...అప్పటివరకు కుటుంబానికి భారం కాకుండా చదువు కొనసాగిస్తూనే చిన్నచిన్న పనులకు వెళుతున్నారు. ఈ క్రమంలో సరుగుడు తోట నరికివేత పనికి వెళుతున్న వారిని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. విశాఖ జిల్లా కశింకోట మండలం గొబ్బూరు జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఐదున్నర గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులు దుర్మరణం పాలైన ఘటన పలువురిని కలచివేసింది. బుచ్చెయ్యపేట మండలం ఆర్.శివరామపురం గ్రామానికి చెందిన నమ్మి సతీష్ (19), నమ్మి నాగఅప్పారావు (19), ఉరుకూటి నాగేశ్వరరావు (19),నమ్మి దేముళ్ల (22) స్నేహితులు. సతీష్, నాగ అప్పారావు లంకెలపాలెంలోని ఒక ప్రైవేటు ఐటీఐలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. నలుగురూ ఆర్మీలో ఉద్యోగం సంపాదించేందుకు ప్రతిరోజు సాధన చేస్తున్నారు. ఖాళీ సమయంలో సరుగుడు తోటలు నరికేందుకు వెళుతుంటారు. ఈ నేపథ్యంలో మునగపాక మండలం యాదగిరి పాలెం వద్ద సరుగుడు తోట నరికేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. సోమవారం తెల్లవారుజామున పది మంది కూలీలు వీరి కంటే ముందుగా ఆటోలో బయలుదేరారు. వెనుక ఉరుకూటి నాగేశ్వరరావు, నమ్మి సతీష్, నమ్మి నాగ అప్పారావు, దేముళ్ల ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. వీరి వాహనాన్ని గొబ్బూరు జంక్షన్ వద్ద ట్రాక్టర్ ఢీకొంది. ఈ సంఘటనలో సతీష్, నాగఅప్పారావు, నాగేశ్వరరావు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తీవ్రంగా గాయపడిన నమ్మి దేముళ్లను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పనికని బయలుదేరిన యువకులు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో మృతుల కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సంఘటనా స్థలాన్ని అనకాపల్లి రూరల్ సీఐ వీవీవీ నరసింహరావు పరిశీలించారు. మృతదేహాలను అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. కశింకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏపీ రైల్వేలో మోడర్న్ ట్రైన్ కంట్రోల్ సిస్టం

న్యూఢిల్లీ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని రెండు ప్రధానమైన రైల్వే మార్గాల్లో అధునాతన 'మోడర్న్ ట్రైన్ కంట్రోల్ సిస్టం'ను త్వరలో ఏర్పాటు చేయాలని రైల్వే మంత్రిత్వశాఖ నిర్ణయించింది. దక్షిణమధ్య రైల్వే (ఎస్సీ రైల్వే) పరిధిలోని రేణిగుంట-యర్రగుంట్ల, తూర్పుతీర రైల్వే(ఈస్ట్ కోస్ట్ రైల్వే) పరిధిలోని విజయనగరం-పలాస సెక్షన్లలో దీన్ని ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. దేశంలో మొత్తం నాలుగు లైన్లలో ఈ కొత్త సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, వీటిలో రెండింటిని ఏపీ దక్కించుకుంది. మిగతా వాటిలో నార్త్ సెంట్రల్ రైల్వే పరిధిలోని ఝాన్సీ- బినా సెక్షన్, సెంట్రల్ రైల్వే పరిధిలోని నాగ్‌పూర్-బద్నేరా రైల్వే లైన్లు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 2018-19లో రూ.77,912కోట్లతో సిగ్నలింగ్ సిస్టమ్‌ను ఆధునికరించాలని కేంద్రం నిర్ణయించింది. అందులో భాగంగా ఈ నాలుగు పనులకు రూ.1810కోట్లు మంజూరు చేయగా, 640 రూట్ కి.మీ వరకు ఈ కొత్త సిస్టమ్ ఏర్పాటు కానుంది. నూతన విధానం వల్ల ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్, ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ సిస్టమ్, రిమోట్ డయాగ్నస్టిక్ అండ్ ప్రెడిక్టివ్ మెయింటెనెన్స్ సిస్టమ్, లాంగ్ టెర్మ్ బేస్డ్ మొబైల్ ట్రైన్ రేడియో కమ్యూనికేషన్ సిస్టమ్, సెంట్రలైజ్డ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్, ట్రైన్ మేనేజ్‌మెంట్ సిస్టంలను అభివృద్ధి చేయనున్నారు.

## నేడు నిట్ స్నాతకోత్సవం.. ఉపరాష్ట్రపతి, గవర్నర్ రాక

తాడేపల్లిగూడెం, డిసెంబరు 23: (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ.. ఏపీ నిట్ ప్రథమ స్నాతకోత్సవం మంగళవారం జరగనుంది. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని నిట్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరుకానున్నారు. మరో అతిథిగా రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పాల్గొంటారు. ఏపీ నిట్ మొదటి బ్యాచ్‌లో ఉత్తీర్ణులైన 379 మందికి స్నాతకోత్సవం సందర్భంగా డిగ్రీలు ప్రదానం చేయనున్నారు.

## రాష్ట్ర ఉపాధ్యాయుడికి ఐసీటీ జాతీయ అవార్డు

న్యూఢిల్లీ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల బయాలజీ ఉపాధ్యాయుడు ఓజ్హా నరసింహారెడ్డికి ప్రతిష్ఠాత్మకమైన సమాచార, సంబంధాలు, సాంకేతిక (ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ-ఐసీటీ) అవార్డు లభించింది. ఈ మేరకు కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ సహాయ మంత్రి సంజయ్ శ్యామ్‌రావు ధోత్రే సోమవారం ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో నరసింహారెడ్డికి పురస్కారం అందించారు.

# ధిగిరాని ఉల్లి ధర!

- రాయితీ ఉల్లి కోసం రైతుబజార్ల వద్ద బారులు
- మరో రెండు నెలల వరకు ఇంతే!

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):మార్కెట్లో ధరల ఘాటు ఇంకా తగ్గకపోవడంతో ఉల్లి కోసం రైతుబజార్ల వద్ద సామాన్యులు బారులు తీరుతూనే ఉన్నారు. రాష్ట్రంలో ఏ రైతు బజారు వద్ద చూసినా ఇవే దృశ్యాలు. కిలో రూ.25కి ఇచ్చే రాయితీ ఉల్లి కోసం గంటలతరబడి పడిగాపులు కాస్తున్నారు. గత నెల రోజుల్లో 70వేల క్వింటాళ్ల ఉల్లిని మార్కెటింగ్‌శాఖ పంపిణీ చేసింది. అయినా గిరాకీ తగ్గలేదు. ప్రస్తుతం దుకాణాల్లో కిలో రూ.120దాకా పలుకుతోంది. నాణ్యతలేని పాయలు కూడారూ.100కి అమ్ముతున్నారు. తాజాగా కేంద్రం దిగుమతి చేసుకున్న ఈజిప్టు ఉల్లి రాష్ట్రానికి 130మెట్రిక్ టన్నుల వచ్చాయి. కాగా, మార్కెట్‌లో మరో 20రోజులు పరిస్థితి ఇలాగే ఉంటుందని, సంక్రాంతి తర్వాత కొత్త సరుకు మార్కెట్‌కు వచ్చాక ధరలు తగ్గుతాయని మార్కెటింగ్‌శాఖ అంచనా వేస్తోంది. ప్రస్తుతం టర్కీ నుంచి కేంద్రం దిగుమతి చేస్తున్న ఉల్లిపాయలు సోమవారం ముంబాయి పోర్టుకు చేరాయి. వాటిల్లోనూ రాష్ట్రానికి కొంత కేటాయించాలని మార్కెటింగ్‌శాఖ కేంద్రానికి లేఖ రాసింది.

### సొమ్ము అందక సరఫరాదారులు గగ్గోలు

మార్కెట్ స్థిరీకరణ నిధి నుంచి రూ.20కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం.. ఉల్లి సరఫరా చేసిన కర్నూలు, కడప రైతులకు రూ.10కోట్లు దాకా జమ చేసింది. అలాగే తాడేపల్లిగూడెం, హైదరాబాద్, షోలాపూర్‌ల నుంచి సరుకు పంపించిన వ్యాపారులకు సొమ్ము జమ కాలేదని చెప్తున్నారు. గత నెల రోజుల్లో సేకరించిన 70వేల మెట్రిక్ క్వింటాళ్ల ఉల్లికి సంబంధించి దాదాపు రూ.50 కోట్లు జమ చేయాల్సి ఉందని సమాచారం. ఉల్లి సరఫరా చేసిన వ్యాపారులు సొమ్ము కోసం గగ్గోలు పెడుతున్నారని తెలిసింది.

# రాజకీయ ఒత్తిడి తీసుకురావద్దు

- ప్రభుత్వ విప్ వద్ద పనిచేస్తోన్న అధికారికి సర్కారు హెచ్చరిక

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంటున్న ఓ అధికారిని రాజకీయ ఒత్తిడి తీసుకురావద్దంటూ ప్రభుత్వం హెచ్చరించింది. టి.భాస్కర్‌నాయుడు ఓ ప్రభుత్వ విప్‌కు ప్రైవేటు కార్యదరిగా పనిచేస్తున్నారు. ఆయన ఇంతకు ముందు గుంటూరు ఆర్‌డీవోగా పనిచేశారు. ఆయనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి క్రమశిక్షణ చర్యల్లో భాగంగా అభియోగాలు నమోదుచేస్తూ, వాటిపై పది రోజుల్లోగా తన వాదన తెలియజేయాలంటూ రెవెన్యూశాఖ ఆదేశించింది. లేనిపక్షంలో తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ విషయంలో రాజకీయ ఒత్తిళ్లు తీసుకురావద్దని, అతని తరఫున ఏదైనా వినతి వచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

- పీఆర్‌టీయూ అధ్యక్షునిగా మిట్టా క్రిష్ణయ్య

పీఆర్‌టీయూ నూతన అధ్యక్షునిగా మిట్టా క్రిష్ణయ్య నియమితులయ్యారు. ప్రస్తుత అధ్యక్షుడు అప్పారావు రాజీనామా చేయడంతో కడప జిల్లాకు చెందిన మిట్టా క్రిష్ణయ్యను ఎన్నుకున్నారు.

Form No. 13
BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL - I, HYDERABAD
O.A.No. 461 of 2016
Between :
State Bank of India, SARB-II,Chikkadpalli, Hyderabad 500020, rep. by it's Chief Manager ...Applicant
Vs.
Sri Laxmi Cold Storage & others ...Defendants
Summons by Paper Publication for showing cause as to why the Relief prayed forshould not be granted
To
(D-176) Mr.A. Sreenivasa Rao, S/o late A. Venkateswarlu, 1-45, Rajavaram, Gampalagudem (Mandal) Krishna District, Andhra Pradesh. PIN-521403
Take notice that the applicant has filed O.A.No.461 of 2016 in the Debts Recovery Tribunal -I, at Hyderabad for a recovery of Rs. 7,79,07,079/- , together with current and future interest, costs and other reliefs. The above mentioned defendants are therefore hereby directed to appear before this Tribunal at III Floor, Triveni Complex, Abids, Hyderabad-500001, in person or through an Advocate or duly authorized agent, in support of their defense to show cause within 30 days from the date of publication or on 16-01-2020 at 10.30 A.M as to why the reliefs prayed for should not be granted.
Take notice that in case of default the application will be heard and determined in their absence.
Given under my hand and seal of this Tribunal on this the day of December, 2019.
BY ORDER
M/s V. RAGH
K. Chiranjeevi Reddy, Advocates
4-1-750, 3.N. Road, Hyderabad-500001
Mb.9440051529

ओएनजीसी ONGC
ఈస్టర్న్ ఆఫ్‌షోర్ అస్సెట్, కాకినాడ, (ఆం.ప్ర)
F.No.4-APB061/2018-CHN/0763, Dt.07.05.2019 ప్రకారం పర్యావరణ, అటవీ & వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం R.O.చెన్నై వారిచే ONGC కాకినాడ ఈస్టర్న్ ఆఫ్‌షోర్ అస్సెట్ ONGC కాకినాడ యొక్క KG-DWN-98/2 డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కొరకు ఆఫ్‌షోర్ బావుల నుండి ఆన్‌షోర్ టెర్మినల్ వరకు అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్లు వేయుటకు కాకినాడ డివిజన్‌లోని ఓడలరేవులో 0.733 హెక్టార్ల రక్షిత అటవీ భూమి మళ్లింపుకు స్టేజ్-2 అనుమతి అంగీకరించబడిందని సాధారణ ప్రజలకు ఇది సమాచారం. అనుమతి కాపీలు ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ మరియు MoEFCC వెబ్‌సైట్: http://www.envfor.nic.in లో లభిస్తాయి.
CGM (C)-KG-DWN-98/2, ఈస్టర్న్ ఆఫ్‌షోర్ అస్సెట్, కాకినాడ
M/s. ఆయిల్ & నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ పేరున APIIC కాకినాడ ఇండస్ట్రియల్ పార్క్, తమ్మవరం & వాకలపూడి (గ్రా.), కాకినాడ రూరల్, తూర్పుగోదావరి, ఆంధ్రప్రదేశ్ వద్ద డిస్పాచ్ సెంటర్ మరియు మెటీరియల్ రిసీవింగ్ మరియు ట్రాన్సిట్ స్టోరేజ్ యార్డ్ అభివృద్ధి ప్రాజెక్ట్ కొరకు SEIAA, ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్‌మెంటల్, క్లియరెన్స్ (EC) ఇచ్చింది. క్లియరెన్స్ లెటర్ల కాపీలు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి లో లభిస్తాయి.

ఇండియా గవర్నమెంట్ మింట్, హైదరాబాద్
(సెక్యూరిటీ ప్రింటింగ్ & మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ యూనిట్, న్యూఢిల్లీ)
(పూర్తిగా భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందినది)
CIN: U22213DL2006GOI144763
టెలిఫోన్: 040-27268300 P.B.No.10, H.C.L. పోస్ట్
ఫ్యాక్స్: 040-27262951 IDA ఫేస్ II,
ఇ-మెయిల్: igm.hyderabad@spmcil.com చెర్లపల్లి, హైదరాబాద్-500051.
వెబ్‌సైట్: http://igmhyderabad.spmcil.com తెలంగాణ, ఇండియా
టెండరు కోరుతూ ప్రకటన
దిగువ ఐటమ్‌ల కొరకు రెండు బిడ్ల విధానంలో సీల్డు టెండర్లు కోరబడుచున్నవి:
1. టెండరు నం. 6000014021/146/ADMIN తేది. 24-12-2019 ప్రకారం 14 మంది ఆఫీస్ బాయ్స్ (అన్‌స్కిల్డ్) అద్దెకు తీసుకొనుట.
2. టెండరు నం.6000014044/149/ELECTRICAL తేది.24-12-2019 ప్రకారం MSDS, సబ్‌స్టేషన్, VCs, టౌన్‌షిప్ పంప్‌హౌస్ వైర్లెస్ కొరకు AMC.
ఆసక్తిగల బిడ్డర్లు తదుపరి వివరాల కొరకు మింట్ వెబ్‌సైట్ http://igmhyderabad.spmcil.com దర్శించవచ్చును. బిడ్డర్లు టెండరు డాక్యుమెంట్‌ను 24-12-2019 నుండి కూడా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. ఈ టెండరుకు తదుపరి సవరణ / అనుబంధం ఉన్నచో మింట్ వెబ్‌సైట్‌లో మాత్రమే తెలియజేయబడును.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్




MARUTI SUZUKI NEXA

CREATE NEW EXPERIENCES WITH THE BEST OFFERS OF THE YEAR.
Avail great year-end offers before the stock runs out.



LIMITED PERIOD OFFERS ONLY
VALID TILL 31ST DECEMBER 2019

| BRAND | BALENO (P) | BALENO (D) | IGNIS | S-CROSS | CIAZ (P) | CIAZ (D) |
|---|---|---|---|---|---|---|
| CONSUMER OFFER* | ₹25 000 | ₹25 000+5 YEAR WARRANTY | ₹30 000 | ₹50 000+5 YEAR WARRANTY | ₹25 000 | ₹40 000+5 YEAR WARRANTY |
| EXCHANGE OFFER | ₹15 000 | ₹15 000 | ₹25 000 | ₹40 000 | ₹40 000 | ₹40 000 |
| CORPORATE OFFER | ₹5 000 | ₹10 000 | ₹10 000 | ₹10 000 | ₹10 000 | ₹10 000 |
| TOTAL SAVINGS# | ₹45 000 | ₹67 400 | ₹65 000 | ₹1 22 900 | ₹75 000 | ₹1 12 700 |

Contact us at 1800-200-[6392] 1800-102-[NEXA]
VIJAYWADA: NEXA RING ROAD (VARUN MOTORS PH: 7799994679, 8662541513),
NEXA MG ROAD (PARAMSHIVA MOTORS PH: 0866-2484129, 7893833959),
NELLORE: NEXA AYYAPA TEMPLE (BHARGAVI AUTOMOBILES PH: 7095393333),
BHIMAVARAM: NEXA BHIMAVARAM WEST (NOVELTY REDDY AND REDDY PH: 9133378630),
GUNTUR: NEXA AUTONAGAR (JAYALAXMI AUTOMOBILES PH: 863-2261000, 9573945678).
*Offer may vary from variant to variant. #Total savings include Consumer Offer + Exchange Offer + Highest Corporate Offer and a 5-year warranty (2-year standard warranty + 3-year extended warranty) on all NEXA Diesel cars.



# మరో ఓటమి!

దాదాపు ఏడాదికాలంలో బీజేపీ అధికారానికి దూరమైన ఐదవ రాష్ట్రం జార్ఖండ్. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్, జార్ఖండ్ ముక్తిమోర్చా, ఆర్జేడీల కూటమిది కాస్తంత పైచేయి కావచ్చునన్న ఎగ్జిట్‌పోల్స్ అంచనాలను మించి కూటమి విస్పష్టమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. అతిపెద్ద పార్టీగా అవతరించే భాగ్యాన్ని కూడా ప్రజలు జార్ఖండ్ ముక్తిమోర్చాకే కట్టబెడుతూ, చీలికలు, చేర్పులతో ప్రజాభీష్టాన్ని తారుమారు చేసే వీల్లేని రీతిలో తీర్పు ఇచ్చేశారు. గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీ పదిస్థానాలకు పైగా కోల్పోవడం అది పొత్తులూ ఎత్తుల్లో చేసిన తప్పులా, ఆదివాసులకు ఆగ్రహం కలిగించిన భూసేకరణ విధానాలా అన్నది అటుంచితే, మిగతా దేశాన్ని రగిలిస్తున్న కొత్త పౌరసత్వ చట్టమూ, దేశవ్యాప్త ఎన్నార్సీ వంటివి ఈ ఫలితాలను ప్రభావితం చేయలేకపోవడం విశేషం.

ఇప్పటికే, దేశవ్యాప్తంగా ప్రజలు రోడ్లమీదకు వచ్చి సీఏఏ–ఎన్నార్సీ ద్వయానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్న నేపథ్యంలో, ఈ ఫలితం కచ్చితంగా విపక్షాలకు మరింత ఉత్తేజాన్నీ, ఉత్సాహాన్నీ ఇస్తుంది. మోదీ హవా, అమిత్ షా చాణక్యం దెబ్బతినిపోతున్నాయని అవి వాదించవచ్చు. ఈ ఫలితం పూర్తిగా స్థానికాంశాలతో ముడిపడినదనీ, ఆదివాసీ భూములను 'అభివృద్ధి'కి కట్టబెట్టే లక్ష్యంతో రఘుబర్‌దాస్ ప్రభుత్వం చట్టాలను తిరగరాస్తున్నందుకే ప్రజలు ఈ శిక్షవేశారని కొందరి వాదన. ఇది తన పాలనాపాపమేనంటూ రఘుబర్ దాస్ కూడా మోదీ, అమిత్ షాలను వెనకేసుకొస్తున్నారు. ఆర్నెల్ల క్రితం 14 ఎంపీ స్థానాల్లో పన్నెండింటిని కట్టబెట్టిన ప్రజలు ఇప్పుడు బీజేపీని ఇలా ఓడించడంతో, రాష్ట్రాలకు వచ్చేసరికే బీజేపీ జాతకం ఇలా మారిపోతున్నదనీ, మోదీ ప్రభ మాత్రం తగ్గలేదని బీజేపీ అభిమానులు ఇక సర్దిచెప్పుకోవాలేమో! మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ఓటమి తరువాత ఇప్పుడు జార్ఖండ్‌ను కోల్పోవడం, మధ్యలో మహారాష్ట్రలో అధికారాన్ని అందుకోలేకపోవడం చిన్న దెబ్బలేమీ కావు. వచ్చే ఏడాది బీజేపీ ఢిల్లీ, బిహార్ ఎన్నికలు ఎదుర్కోవలసి ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో దెబ్బతిన్న తరువాత కేజ్రీవాల్ మాటలు తగ్గించి చేతల్లో పడ్డారు. మోదీతో ప్రత్యక్షంగా ఘర్షణ పడకుండా, సంక్షేమ కార్యక్రమాలతో, అభివృద్ధి ఎజెండాతో బీజేపీ–కాంగ్రెస్ ఓటర్లను తనవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక, లోక్‌సభలో ముప్పయ్యేళ్ళ రికార్డు బలం సంపాదించిన తరువాత బిహార్‌లో నితీశ్‌తో కయ్యానికి కాస్తంత కాలుదువ్విన బీజేపీ జార్ఖండ్ ఫలితాలతో మరింత మెత్తబడక తప్పదు. పొత్తులతో కాంగ్రెస్ రాష్ట్రాలను తన్నుకుపోతుండగా, ప్రాంతీయపార్టీలు క్రమంగా బలపడుతున్నాయి.

గతంలో మిత్రపక్షంగా ఉన్న జార్ఖండ్ ముక్తిమోర్చా దూరం కావడం బీజేపీని ఈమారు పెద్దదెబ్బతీసింది. నరేంద్రమోదీ ఎనిమిది, అమిత్‌షా పదకొండు భారీ సభల్లో ఉద్వేగపూరితమైన ప్రసంగాలు చేసిన తరువాత కూడా ఫలితం ఇలా ఉండటం విచిత్రమే. ఎప్పటిలాగానే, రాహుల్‌గాంధీ ఈ ఎన్నికలను కూడా తేలిగ్గానే తీసుకున్నారు. ఐదువిడతల పోలింగ్‌లో ఆయన ఐదు సభల్లో మాట్లాడి, చివర్లో దక్షిణకొరియాకు ప్రయాణం కడితే, జెఎంఎం అధినేతతో కలసి ప్రియాంక కొన్ని సభల్లో పాల్గొనవలసి వచ్చింది. జార్ఖండ్ ఎన్నికలను కాంగ్రెస్ పూర్తిగా జెఎంఎం వ్యవహారంగా వదిలేసినా, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అంత బలం లేకున్నా గతం కంటే రెట్టింపు స్థానాలు గెలుచుకోవడం పార్టీకి కొత్త ఉత్తేజాన్నిస్తుంది. బీజేపీకి దూరం జరిగి, విపక్షాన్ని ఏకంచేసి కూటమి కట్టిన హేమంత్ సొరేన్ మొత్తానికి తన లక్ష్యాన్ని సాధించి, అధికారం దక్కించుకున్నారు. ఆదివాసుల భూములను గ్రామసభ తీర్మానంతో నిమిత్తం లేకుండా స్వాధీనం చేసుకొని కార్పొరేట్లకు ధారపోసేందుకు చట్టాలు మారుస్తున్న రఘుబర్ దాస్‌ను ఆదివాసీ వ్యతిరేకిగా చూపడంలో ఫలితం సాధించారు. ఈ ఆదివాసీయేతర ముఖ్యమంత్రికీ, జార్ఖండ్ ప్రజల కోసం జీవితమంతా పోరాడిన తన తండ్రి, ఆదివాసుల 'గురుజీ' షిబూ సొరేన్‌కూ ఉన్న తేడాను తెలియచెప్పగలిగారు. ప్రజాందోళనలతో పాటు, ఈ ఫలితాలు కూడా ఎన్నార్సీని కాదు పొమ్మనడానికి మరింతమంది రాష్ట్రపాలకులకు ధైర్యాన్నిస్తాయేమో!

## మూడో కన్ను




ఎన్ఆర్‌సీపై మోదీ, అమిత్ షా చెరో మాట..!

మంజుల్

**మూడు రాజధానులు ఏర్పాటు చేయాలనుకోవడం ఒక అరాచక నిర్ణయం. 14వ శతాబ్దానికి చెందిన ఢిల్లీ సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ దేశ రాజధానిని ఢిల్లీ నుంచి దౌలతాబాద్ తరలించాలని అసంబద్ధ నిర్ణయం తీసుకుని, తర్వాత ఆ నిర్ణయం మార్చుకుని వేలాది మంది ప్రజలను బలి చేశారు. ఇప్పుడు 21వ శతాబ్దంలో మన తెలుగు రాష్ట్రంలో ఆధునిక తుగ్లక్‌ను చూడాల్సి రావడం మన దురదృష్టం.**

# ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన

సత్యకాలమ్



■ వై. సత్యకుమార్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి ఆరునెలలు మాత్రమే పూర్తయ్యాయి. అయితే ఈ ఆరు నెల్లోనే అరాచక పాలన సాగించడంలో తనను మించిన వారు లేరని ఆయన నిరూపించుకున్నారు. దేశంలోని రాజకీయవేత్తలలో పిన్న వయస్కుడైన ఒక యువకుడు, భారీ మెజారిటీతో అధికారంలోకి రావడం సామాన్యమైన విషయం కాదు. ఈ మెజారిటీ వల్ల ఆత్మవిశ్వాసం పుంజుకుని, జనరంజకమైన పాలన చేస్తూ, అన్ని వర్గాల మెప్పు పొందుతూ, కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మాణాత్మక బాటలో నడిపించేందుకు అన్ని అవకాశాలు జగన్‌కు లభించాయి. కాని ఆయన ఈ ఆరునెలల్లోనే ఈ అవకాశాలన్నిటినీ కాలరాచుకున్నారు. తన నరనరాల్లో ద్వేషం జీర్ణించుకుపోయిందని, తన రక్తంలో అరాచకత్వం మిళితమైపోయిందని, తన భావాల్లో పగ, ప్రతీకారం, కక్ష తప్ప మరేమీ లేవని అడుగడుగునా నిరూపించుకున్నారు. అధికారంలోకి వచ్చిన మరుక్షణంలోనే ఆయన తాను ముందుకు అడుగులు వేయనని, వెనక్కి అడుగులు వేయడమే తన లక్ష్యమని ప్రకటించుకున్నారు. పోలవరంలో రివర్స్ టెండరింగ్, విద్యుత్ ప్రాజెక్టుల రద్దు, తెలుగు మాధ్యమాన్ని ఉన్నపళాన రద్దుచేయడం లాంటి అనేక నిర్ణయాలు ఆయన స్వభావానికి తార్కాణంగా నిలిచాయి. తాజాగా మూడు రాజధానుల ప్రకటనతో ఆయన దుర్మార్గ స్వభావం స్పష్టంగా బయటపడింది. చంద్రబాబునాయుడు తన పాలన మార్గమధ్యంలో అభివృద్ధిని మరిచి రాజకీయాలకు ప్రాధాన్యతనిస్తే, జగన్మోహన్ రెడ్డి ఆది నుంచే అరాచకత్వానికి బాట వేశారు.

నిజానికి అధికారంలోకి రాకముందే జగన్ పార్టీ అమరావతి ప్రాజెక్టుపై ప్రపంచ బ్యాంకుకు కొందరు రైతుల ద్వారా ఫిర్యాదు చేయించి అడ్డుకునే ప్రయత్నం చేసింది. అయితే ఈ ఫిర్యాదులు సరైనవి కావని తేల్చుకున్న ప్రపంచ బ్యాంకు ఈ ప్రాజెక్టు విషయంలో సహాయానికి ముందడుగే వేసింది. కేంద్రం కూడా మొదటి దశ సహాయానికి అంగీకారాన్ని తెలియజేసింది. కాని జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రపంచ బ్యాంకు రుణ సహాయం విషయంలో అప్పటికే కుదిరిన ఒప్పందంపై శీతకన్ను వేయడం, ఈ విషయంలో కేంద్రం రాసిన లేఖలకు సరైన విధంగా స్పందించకపోవడంతో రాజధానిగా అమరావతిని కొనసాగించే విషయంలో జగన్‌కు ఆసక్తి లేదన్న విషయం స్పష్టమైంది. దీనితో అమరావతి ప్రాజెక్టుకు నిధులు అందించాలన్న తమ ప్రతిపాదనను వెనక్కి తీసుకున్నట్లు ప్రపంచ బ్యాంకు జూలై నెలలోనే ప్రకటించింది. ఆ తర్వాత కొద్ది రోజులకు అమరావతి నగరానికి నిధులు సమకూర్చే ప్రణాళికలనుంచి తప్పుకుంటున్నట్లు ఆసియా మౌలిక సదుపాయాల పెట్టుబడి బ్యాంకు (ఏఐఐబి) కూడా ప్రకటించింది. దీనితో ఈ రెండు సంస్థల నుంచీ దాదాపు రూ.7వేల కోట్ల రూపాయల రుణం లభించే అవకాశాలు లేకుండా పోయాయి. ఒకవైపు అమరావతిలో మెట్రోపై అనాసక్తి ప్రదర్శిస్తూనే మరోవైపు విశాఖలో లైట్ మెట్రో ప్రాజెక్టుకు కొరియా నుంచి సహాయం కావాలంటూ జగన్ సర్కార్ ప్రతిపాదనలు పంపిందట. దీన్ని బట్టి జగన్ అసెంబ్లీలో ప్రకటించకముందే విశాఖ పట్టణంలో కార్యనిర్వాహక రాజధానిని ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఎప్పుడో ఏర్పర్చుకున్నారన్న విషయం అర్థమవుతోంది. కాని అభివృద్ధి వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న జగన్ సర్కార్‌కు ఏ అంతర్జాతీయ సంస్థలనుంచి నిధులు వస్తాయి? ఈ ప్రాజెక్టుకు తాము సహాయం అందించలేమన్న విషయం కొరియా స్పష్టం చేసిందని కేంద్ర మంత్రి శీతాకాల సమావేశాల్లో వెల్లడించారు. నిజానికి దేశంలో సంప్రదాయేతర ఇంధన వనరుల రంగం ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షిస్తున్న తరుణంలో జగన్ సర్కార్ పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులను రద్దు చేయడం, అమరావతి ప్రాజెక్టు నుంచి ప్రపంచ బ్యాంకు, ఏఐఐబి వైదొలగడంతోనే అంతర్జాతీయ సంస్థలకు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల విషయంలో తప్పుడు సంకేతాలు వెళ్లాయి. ఇప్పుడు ఏ ప్రాజెక్టును నెలకొల్పాలన్నా అంతర్జాతీయ సంస్థలు, పారిశ్రామిక వేత్తలు వెనుకాడే పరిస్థితి ఏర్పడింది.



రాజధానిగా ఒక ప్రాంతాన్ని నిర్ణయించిన తర్వాత, వివిధ ప్రాజెక్టులు అమలయ్యే అవకాశాలున్న తర్వాత ఆ నిర్ణయాన్ని రద్దు చేసి, మూడు రాజధానులు ఏర్పాటు చేయాలనుకోవడం అనేది ఒక అరాచక నిర్ణయం, కాని దూరదృష్టితో తీసుకున్న నిర్ణయం కానేకాదు. అసెంబ్లీలో తన నిర్ణయం ప్రకటిస్తూ దక్షిణాఫ్రికాలో కూడా మూడు రాజధానులున్నాయని జగన్ ప్రకటించారు. దక్షిణాఫ్రికాకు, ఆంధ్రప్రదేశ్‌కూ ఎంతో తేడా ఉన్నది. దక్షిణాఫ్రికా ఒక దేశం అయితే ఆంధ్రప్రదేశ్ కేవలం 13 జిల్లాలున్న ఒక రాష్ట్రం. దక్షిణాఫ్రికా ఏపీ విస్తీర్ణం కన్నా ఆరు రెట్లు ఎక్కువ విస్తీర్ణమున్న దేశం. బ్రిటిష్ వలస పాలనలో ఉన్న దక్షిణాఫ్రికాలో చారిత్రక, సామాజిక, సాంస్కృతిక కారణాల వల్ల మూడు రాజధానులు ఏర్పడ్డాయి. కాని ఒక చిన్న రాష్ట్రానికి మూడు రాజధానులు ఉన్న సందర్భాలు ఎక్కడా లేవు. పైగా ఈ మూడు రాజధానుల వల్ల అనవసర వ్యయ ప్రయాసలు ఏర్పడుతున్నాయని దక్షిణాఫ్రికా అధినేతలు ఆవేదన వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. 'వేర్వేరు రాజధానుల నిర్వహణ భారంగా ఉంది. అధికారులు, పాలనా వర్గాలకు వ్యయ ప్రయాసలు తప్పడంలేదు. వీరికి... ప్రిటోరియాలో ఒక ఇల్లు ఉండాలి, కేప్‌టౌన్‌లో మరొకటి ఉండాలి. ప్రిటోరియాలో ఒక కారు, కేప్‌టౌన్‌లో మరోకారు ఉండాలి. అధికారులు ప్రిటోరియా–కేప్‌టౌన్ మధ్య అటూఇటూ తిరగాల్సి వస్తోంది.' అని 2016లో అప్పటి దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జుమా చట్టసభలో చేసిన ప్రసంగం వెలుగులోకి వచ్చింది.

అమరావతిని రాజధానిగా నిర్ణయించినప్పుడు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. రాజధాని శంకుస్థాపనకు 2015 అక్టోబర్ 22న ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా రావడమే కేంద్రం రాజధాని పట్ల ప్రదర్శించిన సానుకూలతకు సంకేతం. 2019 ఎన్నికలకు ముందు బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రాసిన బహిరంగ లేఖను చదివితే అనేక వాస్తవాలు తెలుస్తాయి. రాజధాని నిర్మాణానికి కేంద్రం తక్షణమే రూ.2500కోట్ల నిధులు విడుదల చేసింది. అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాలకే కాదు, వివిధ రవాణా, రైలు ప్రాజెక్టులకు ప్యాకేజీలో భాగంగా సహాయం ప్రకటించింది. అమరావతి నుంచి అనంతపురం వరకు ఎక్స్‌ప్రెస్ రహదారి కోసం రూ. 20 వేల కోట్లు, రాజధానిలో ఔటర్ రింగ్‌రోడ్‌కు రూ.19,700 కోట్లు ఇచ్చేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) అంగీకరించింది. అంతర్గత జల రవాణా సదుపాయాలను అభివృద్ధి చేసే బకింగ్‌హామ్ కాలువ పునరుద్ధరణ కొరకు రూ. 7015 కోట్లతో మరొక పెద్ద ప్రాజెక్ట్ చేపట్టేందుకు సుముఖత వ్యక్తం చేసింది. గన్నవరంను అంతర్జాతీయ విమానాశ్రయంగా మార్చేందుకు చేపట్టవలసిన చర్యలన్నీ తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి భూసేకరణ కోసం భూములిచ్చిన రైతుల త్యాగనిరతిని కేంద్రం గుర్తించినందువల్లే వారికి పరిహారం క్రింద సిఆర్‌డిఏ ఇచ్చిన ప్లాట్లను విక్రయించగా వచ్చే మొత్తంపై మూలధన పన్ను నుంచి మినహాయింపు నిస్తూ 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌లో నిర్ణయాన్ని ప్రకటించారు.

ఇప్పుడు కేంద్రప్రభుత్వ ప్రమేయం లేకుండా ముఖ్యమంత్రి మూడు రాజధానులను ప్రకటించడం అంటే అమరావతికి కేంద్రం చేసిన సహాయాన్ని విస్మరించడమే. అభివృద్ధి వికేంద్రీకరణను అందరూ సమర్థిస్తారు. కేంద్రం అభివృద్ధి వికేంద్రీకరణను సమర్థించినందువల్లే ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కేంద్ర ప్రాజెక్టులను నెలకొల్పేందుకు ముందుకు వచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆమోదంతో, రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్ వెలువడిన తర్వాత అమరావతిలో ఏర్పడిన హైకోర్టును ఇప్పుడు కర్నూలుకు తరలించడం సాధ్యమా? ఈ విషయం తెలిసీ జగన్మోహన్ రెడ్డి సీమ ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు అర్థమవుతోంది.

కేవలం రాజధానులను ఏర్పాటు చేయడం వల్ల అధికార వికేంద్రీకరణ జరగదు. నాయకుడన్న వాడికి దూరదృష్టి, లక్ష్యస్పష్టత ఉంటే వికేంద్రీకరణ సహజంగా జరుగుతుంది. ప్రజల వద్దకు పాలన చేరుతుంది. 14వ శతాబ్దానికి చెందిన ఢిల్లీ సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ దేశ రాజధానిని ఢిల్లీ నుంచి దౌలతాబాద్ తరలించాలని అసంబద్ధ నిర్ణయం తీసుకుని, తర్వాత ఆ నిర్ణయం మార్చుకుని వేలాది మంది ప్రజలను బలిచేశారు. ఇప్పుడు 21వ శతాబ్దంలో మన తెలుగు రాష్ట్రంలో ఆధునిక తుగ్లక్‌ను చూడాల్సి రావడం మన దురదృష్టం.

(బిజెపి జాతీయ కార్యదర్శి)

# భయాలు వద్దు, భారత పౌరులం మనం

■ ప్రకాశ్ జవదేకర్



దేశం యావత్తు పౌరసత్వ సవరణ చట్టం గురించి చర్చిస్తోంది. దాన్ని అర్థం చేసుకోలేక, అపార్థం చేసుకున్న వారు ఆందోళన చేస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని వ్యతిరేకించే కొన్ని రాజకీయ పార్టీలు, వ్యక్తులు అగ్గికి ఆజ్యం పోస్తూ ఆందోళనలను ఎగదోస్తున్నారు. మరింత గందరగోళం సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో దానికి సంబంధించిన వాస్తవాలను అందరికీ అర్థమయ్యే రీతిలో విశదీకరించడం అవసరం.

పౌరసత్వ సవరణ చట్టం–2019, పౌరుల జాతీయ రిజిస్టర్ (ఎన్ఆర్‌సి) రెండూ విభిన్న అంశాలు. కానీ, ఎలాంటి సంబంధం లేని ఈ రెండు అంశాలను కలగాపులగం చేస్తూన్న ప్రతిపక్షాలు దేశంలో భయోత్పాత వాతావరణం కల్పిస్తున్నాయి. ముస్లింలకు గల రక్షణలన్నింటినీ పూర్తిగా తొలగించి, వారిని దేశం వెలుపలి వారుగా ప్రకటించే లక్ష్యంతోనే మోదీ సర్కారు ఈ చట్టాలను తీసుకు వచ్చిందంటూ భయాందోళనలు రేపుతున్నాయి. భారత రాజకీయ చరిత్రలో ఇలా చెప్పడాన్ని మించిన అబద్ధం మరొకటి లేదని నిస్సందేహంగా చెప్పవచ్చు. వాస్తవం అవగాహన అయితే ఈ సందేహాలన్నీ పటాపంచలైపోతాయి. దేశంలో ప్రశాంత వాతావరణం నెలకొంటుంది. అందుకే, ఆ వివరాలను తెలుసుకుందాం.

తొలుత మనం పౌరసత్వ సవరణ బిల్లు గురించి చర్చిద్దాం. దేశవిభజన వరకు పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లు భారతదేశంలో అంతర్గత భాగాలు. ఆఫ్ఘనిస్థాన్ ఈ ఉపఖండంలో ఒక పెద్ద ప్రాంతం. బంగ్లాదేశ్, పాకిస్థాన్ ఏర్పాటు వెనుక ప్రధాన లక్ష్యం మతం. ఆయా దేశాల ఏర్పాటు సమయంలో భారీ సంఖ్యలో ముస్లింలు ఆ దేశాలకు తరలిపోయారు. అక్కడ నుంచి హిందువులు భారత్‌కు వచ్చారు. అక్కడ నుంచి వచ్చిన ఈ శరణార్థులు భారతదేశంలో తిరిగి స్థిరపడ్డారు. 'ఒక్కటిగా ఉన్న భారత దేశం రెండుగా వేరుపడ్డాయి. విభజిత దేశం నుంచి భారత్‌కు వచ్చిన వారందరికీ పౌరసత్వం కల్పించడం మన బాధ్యత' అని ఆ సమయంలో మహాత్మాగాంధీ అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్ కూడా అప్పట్లో అదే తరహా అభిప్రాయం వెల్లడించారు. దానితో లక్షలాది మంది శరణార్థులకు భారత పౌరసత్వం కల్పించారు.

పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ ప్రస్తుతం పూర్తిగా స్వయం ప్రకటిత ఇస్లామిక్ దేశాలు. కాబట్టి, అక్కడ ముస్లింలను మతం పేరిట అవమానాల పాలు చేసే ఆస్కారమే లేదు. కానీ, భారత్ మతాధార దేశం కాదు, ఈ దేశంలో మతం కన్నా రాజ్యాంగమే పవిత్రమైనది. అందుకే, హిందువులు, సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధులు, పార్సీ శరణార్థులందరికీ రక్షణ కల్పించే విధానాన్నే భారత్ అనుసరిస్తోంది.

2003లో అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం ఈ విధానాన్ని చట్టబద్ధం చేసేందుకు తొలిసారిగా చర్యలు తీసుకుంది. పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన హిందూ శరణార్థులందరికీ పౌరసత్వం కల్పించనున్నట్టు ప్రకటించింది. నేడు ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న రాజకీయ పార్టీలు ఆ రోజు వాజపేయి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చాయంటే ఆశ్చర్యం కలగక మానదు. కానీ, ఇది వాస్తవం.

ఆ తర్వాత, 2004లో డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వంలోని యుపిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ ప్రభుత్వం కూడా ఈ విషయంలో వాజపేయి విధానాన్నే అనుసరించింది. నేడు ఎన్డీయే ప్రభుత్వ చర్యను వ్యతిరేకిస్తున్న కమ్యూనిస్టు పార్టీలు, తృణమూల్ కాంగ్రెస్, మరెన్నో ఇతర పార్టీలు నాడు యుపిఏ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నాయి. అంటే, దాన్ని సమర్థించినట్లే గదా!

2003 బిల్లు పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన హిందూ శరణార్థుల గురించి మాత్రమే మాట్లాడుతుంది. కానీ, ఈ రోజు మేం తెచ్చిన చట్టం మతపరమైన అవమానాలకు గురవుతున్న హిందువులు, సిక్కులు, బౌద్ధులు, క్రైస్తవులు, జైనులు, పార్సీలు అందరి తరఫునా మాట్లాడుతుంది. మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టం–2019 పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల నుంచి మతపరమైన అవమానాలకు, అణచివేతలకు తట్టుకోలేక వలస వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, క్రైస్తవులు, జైనులు, పార్సీలు అందరికీ పౌరసత్వం ఇవ్వాలని చెబుతోంది. అందుకని, పాత బిల్లు కన్నా ఇది సమగ్రమైనది. రాజకీయ పార్టీలన్నీ దీన్ని ఆహ్వానించవలసి ఉంది. కానీ, సంకుచిత రాజకీయాల కారణంగా కొన్ని పార్టీలు 2004, 2005ల్లో తాము అనుసరించిన వైఖరికి భిన్న వైఖరి తీసుకుని దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఇది వారి కుటిలత్వమే తప్ప మరోటి కాదు.




**పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ ఇస్లామిక్ దేశాలు కావడం వల్ల ఆయా దేశాల్లో ముస్లింకు మతపరమైన అవమానాలు ఎదురయ్యే ఆస్కారమే లేదు. "ఆ దేశాల్లోని ముస్లింలకు భారత పౌరసత్వం పొందేందుకు రాచబాట వేయాలా? 30కోట్ల మందికి పౌరసత్వం కల్పించే ప్రత్యేక ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం? అందుకు ప్రతిపక్షం సిద్ధంగా ఉన్నదా?" అని ఈ సందర్భంగా ప్రధానమంత్రి వేసిన ప్రశ్నకు ఏ ఒక్క రాజకీయ పార్టీ సమాధానం చెప్పలేకపోయింది.**

ముస్లింల పట్ల ఎందుకు వివక్ష ప్రదర్శిస్తున్నారన్న ఒక్క ప్రశ్ననే పౌరసత్వ సవరణ చట్టాన్ని విమర్శిస్తున్న వారు అడుగుతున్నారు. అయితే, ఈ చట్టంలో ముస్లింల పట్ల ఎలాంటి వివక్ష లేదన్నదే దీనికి సమాధానం. ఇప్పుడే కాదు, భవిష్యత్తులో కూడా ముస్లింల పట్ల ఎలాంటి వివక్ష చూపే ప్రసక్తే లేదు. ఒక్క ముస్లింలే కాదు, భారత పౌరులెవరూ ఎప్పుడూ ఎలాంటి అసౌకర్యానికి గురి కారు. ముస్లిం పౌరుల దేశభక్తి గురించి ఎలాంటి అనుమానాలూ వ్యక్తం కావు, వారి హక్కుల విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదు. ప్రతిపక్షాలు ప్రస్తావిస్తున్న అంశం అసలు భారత పౌరులకు సంబంధించినదే కాదు.

పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ ఇస్లామిక్ దేశాలు కావడం వల్ల ఆయా దేశాల్లో ముస్లింకు మతపరమైన అవమానాలు ఎదురయ్యే ఆస్కారమే లేదు. 'ఆ దేశాల్లోని ముస్లింలకు భారత పౌరసత్వం పొందేందుకు రాచబాట వేయాలా? 30 కోట్ల మందికి పౌరసత్వం కల్పించే ప్రత్యేక ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం? అందుకు ప్రతిపక్షం సిద్ధంగా ఉన్నదా?' అని ఈ సందర్భంగా ప్రధానమంత్రి వేసిన ప్రశ్నకు ఏ ఒక్క రాజకీయ పార్టీ సమాధానం చెప్పలేకపోయింది.

ప్రపంచంలోని ఏ దేశమూ తమ పౌరసత్వం కల్పించేందుకు తేలిక మార్గం సిద్ధం ఏర్పాటు చేయదు. ప్రతి దేశానికీ సొంత చట్టాలుంటాయి. ఎప్పుడైనా అక్రమ వలసదారులను వెనక్కి పంపుతూనే ఉంటాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా ఆచరణలో ఉన్నదే. దీనికి ఏ ఒక్కరూ ఎలాంటి అభ్యంతరం కూడా చెప్పరు. కానీ, భారతదేశం అదే సూత్రాన్ని ఆచరిస్తే మాత్రం కొందరికి అది సమస్య కావడమే దురదృష్టకరం.

ఇలాంటి వారే ప్రజలు పౌరసత్వ సవరణ చట్టాన్ని, ఎన్ఆర్‌సీని కలిపేస్తూ ప్రజల మనసుల్లో గందరగోళ బీజాలు నాటుతున్నారు. ప్రపంచంలోని ప్రముఖ దేశాలన్నీ పౌరుల రిజిస్టర్ కలిగి ఉన్నాయి. కాని భారతదేశానికే అలాంటిది లేదు. ఎన్ఆర్‌సీ ఆలోటును తీరుస్తుంది. 1985లో అస్సాం ఒప్పందంపై సంతకం చేసినప్పుడు రాజీవ్‌గాంధీ ఎన్ఆర్‌సి అవసరాన్ని గుర్తించారు. ఆనాటి ఒప్పందానికి అనుగుణంగానే అసోంలో ఇప్పుడు ఎన్ఆర్‌సి ఉంది. ఆ ఎన్ఆర్‌సిలో పేర్లు లేని వారికి అప్పీలు చేసుకునే అవకాశం కూడా కల్పించారు. ఈ ప్రక్రియ అంతా సుప్రీంకోర్టు నిర్దేశకత్వం మేరకే జరిగినందు వల్ల దానిపై అనుమానాలు వ్యక్తం చేయడం అసమంజసం.

ఇక దేశం మొత్తానికి వర్తింపచేసే ఎన్ఆర్‌సి విధివిధానాలు ఇంకా నిర్ణయించాల్సి ఉంది. ఈ పరిస్థితిలో దానిపై అపోహలు సృష్టించడం రాజకీయ దురుద్దేశం, దురదృష్టకరం.

ఆధార్ కార్డు ప్రక్రియ చేపట్టినప్పుడు పేదలు తమ గుర్తింపును ధ్రువీకరించే పత్రాలు ఎలా ఇవ్వగలుగుతారని చాలామంది అనుమానాలు వ్యక్తం చేశారు. పది సంవత్సరాల తర్వాత చూస్తే ఏం కనిపిస్తోంది? దాదాపు ప్రతీ పౌరుడూ ఆధార్ కార్డు కలిగి ఉన్నాడు. తమ సామర్థ్యంపై అనుమానాలు వ్యక్తం చేసే వారి కన్నా భారత ప్రజలు ఎంతో తెలివైన వారు. ప్రస్తుతానికైతే పౌరసత్వ సవరణ చట్టం ఒక్కటే ఉంది. ఎన్ఆర్‌సి ఇంకా చర్చల దశలోనే ఉంది. ఇక్కడ నేను ఒకటి స్పష్టం చేయాలనుకుంటున్నాను. నేటి 130 కోట్ల మందికి పైగా భారతీయుల్లో ఏ ఒక్కరి పేరూ ఎన్ఆర్‌సిలో లేకుండా ఉండదు. దాని గురించి ఏ ఒక్కరూ భయపడాల్సిన, చింతించాల్సిన అవసరం లేనేలేదు.

కొన్ని శక్తులు దౌర్జన్యకాండకు ఆజ్యం పోస్తున్నాయి. వారి అసలు రూపం త్వరలోనే బట్టబయలు చేస్తాం. రెండో సారి చారిత్రక విజయం తర్వాత చేసిన ట్రిపుల్ తలాక్, అయోధ్య సమస్యకు శాంతియుత పరిష్కారం, 370వ అధికరణం రద్దు వంటి మోదీ ప్రభుత్వం సాధించిన ఘనతలు ప్రతిపక్షాలను తీవ్ర నిరాశకు గురి చేశాయి. అందుకే, వారు బురదజల్లాలని చూస్తున్నారు. కానీ, భారతదేశం నిరాశ, ప్రతికూల ధోరణి రాజకీయాలకు ఎక్కడా చోటు కల్పించదు.

*(రచయిత కేంద్ర సమాచార, ప్రసార శాఖామంత్రి)*

# జీఎస్టీ, జాతీయ సమైక్యత

భరతవాక్యం



■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

వస్తుసేవల పన్ను (జీఎస్టీ) అమలులోకి వచ్చిన తొలి ఐదు సంవత్సరాల పాటు ఆ పన్ను వసూళ్ళలో తగ్గుదలను భర్తీ చేస్తామని రాష్ట్రాలకు కేంద్రం హామీ ఇచ్చింది. జీఎస్టీ వసూళ్లు ఏటా 14 శాతం చొప్పున పెరగగలవనేది అధికారుల అంచనా. ఈ మేరకు వసూళ్లు పెరగని పక్షంలో రాష్ట్రాలకు తగ్గిన రాబడిని కేంద్రం భర్తీ చేస్తుంది. ఈ మేరకు కేంద్రం పూచీ పడింది ఐదేళ్ళ వరకే అయిన దృష్ట్యా జీఎస్టీపై అసలు పోరాటం ఐదు సంవత్సరాల అనంతరం మాత్రమే ప్రారంభమవుతుంది. ఐదేళ్ల అనంతరం జీఎస్టీ వసూళ్లలో తగ్గుదలను భర్తీ చేసుకునేందుకు రాష్ట్రాలకు ఎలాంటి మార్గాలు లేవు. కనుక అవి తమ వ్యయాలను తప్పనిసరిగా తగ్గించుకోవల్సి వుంటుంది. దీని వల్ల మొత్తం ఆర్థిక వ్యవస్థకు చిక్కులు ఏర్పడతాయి. 2010–11 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల మూల ధన వ్యయాలు రూ.1.7 లక్షల కోట్లు. ఇవి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019–20) రూ.6.2 లక్షల కోట్లకు పెరిగాయి.రాష్ట్రాలతో పోల్చితే కేంద్ర ప్రభుత్వ మూల ధన వ్యయాలు తక్కువ. 2010–11 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయాలు రూ.1.6 లక్షల కోట్లు కాగా అవి 2019–20 ఆర్థిక సంవత్సరానికి కేవలం రూ.3.4లక్షల కోట్లకు మాత్రమే పెరిగాయి. 2010–11లో కేంద్రం, రాష్ట్రాల మూల ధన వ్యయాలు ఇంచుమించు సమానస్థాయిలో వుండగా 2019–20 నాటికి రాష్ట్రాల మూల ధన వ్యయాలు దాదాపు రెట్టింపు అయ్యాయి. కనుక మనం దూరదృష్టితో ఆలోచించవల్సిన అవసరమున్నది. రాష్ట్రాల జీఎస్టీ వసూళ్ల తగ్గుదల కొనసాగే పక్షంలో ఉత్పన్నమయ్యే ఆర్థిక చిక్కులను దృష్టిలో ఉంచుకొని వాటి నధిగమించేందుకు ఒక పటిష్ఠ ప్రణాళికను ముందుగానే రూపొందించుకోవాలి.




అసలు జీఎస్టీని ప్రవేశ పెట్టడంలో ప్రభుత్వ లక్ష్యమేమిటో నిశితంగా చూద్దాం. అంతర్ రాష్ట్ర వాణిజ్యాన్ని సుగమం చేసేందుకు జీఎస్టీని ప్రవేశ పెట్టారు. అయితే మన పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలోకి పడిన చందమయింది. అంతర్ రాష్ట్ర వాణిజ్యంలో వున్న సమస్యలను తొలగించుకోగలిగినప్పటికీ అసలు రాష్ట్రాల స్వతంత్ర ప్రతిపత్తి హరించుకుపోయే ముప్పును కొని తెచ్చుకున్నాము. రాష్ట్రాల స్వతంత్ర ప్రతిపత్తికి ఎలాంటి భంగం కలుగకుండా అంతర్ రాష్ట్ర వాణిజ్యాన్ని సుగమం చేసేందుకు తోడ్పడే ఇతర మార్గాలను పరిశీలించవల్సిన అవసరమున్నది.

అమెరికాలో వస్తు సేవల పన్ను లేదు. మన దేశంలో గతంలో ఉన్న కేంద్ర అమ్మకపు పన్ను సైతం అమెరికాలో లేదు. అమెరికాలోని రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రాలలో జరిగే అమ్మకాలపై అమ్మకపు పన్ను వసూలు చేస్తాయి. ఈ పన్నురేటు సగటున 10 శాతం నుంచి శూన్య శాతం దాకా వుంటుంది. అయినప్పటికీ వస్తువులను ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి రవాణా చేయడంలో ఎటువంటి సమస్యలు వుండవు. రాష్ట్రాల సరిహద్దుల వద్ద ఎలాంటి చెక్‌పోస్ట్‌లు వుండవు ఎంతో మంది వినియోగదారులు న్యూయార్క్ రాష్ట్రానికి చెందిన ఎంతో మంది ప్రజలు న్యూ జెర్సీ రాష్ట్రానికి వెళ్ళి తమకు కావల్సిన సరుకులు కొనుక్కుంటారు. న్యూజెర్సీలో అమ్మకపు పన్ను న్యూయార్క్‌లో కంటే తక్కువగా వుంటుంది. ఐరోపాలో పరిస్థితి కూడా కొద్ది మార్పులతో ఇంచుమించు ఇదే విధంగా వుంటుంది. ఫిన్లాండ్ లాంటి దేశాలు మాత్రం తమ రాష్ట్రాలకు మరింత ఎక్కువగా స్వతంత్ర ప్రతిపత్తినిస్తున్నాయి. ఇతర యూరోపియన్ దేశాలు అంతదూరం పోలేదు. ఏమైనా అమెరికా, ఐరోపా అనుభవాలను బట్టి, వివిధ స్థాయిల అమ్మకపు పన్ను లేదా రాష్ట్రాలు వసూలు చేసే జీఎస్టీ రేట్లు భిన్నంగా వున్నా అంతర్ రాష్ట్ర వాణిజ్యం సుగమంగా సాగుతుందనే విషయం స్పష్టమవుతున్నది.

ఈ వాణిజ్య సౌలభ్యానికి కారణమేమిటి? సరుకులను ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా వర్గీకరించడం వల్ల ఎదురవుతున్న సమస్యలను తొలగించడమేనని చెప్పవచ్చు. ఉదాహరణకు క్రాఫ్ట్ పేపర్‌ను పంజాబ్‌లో 'పేపర్'గా వర్గీకరించగా, హర్యానాలో 'ప్యాకింగ్ మెటీరియల్'గా వర్గీకరించారు. ఇలా భిన్న వర్గీకరణలు అమల్లో వుంటే అంతర్ రాష్ట్ర వాణిజ్యం కష్ట సాధ్యమవుతుంది. ఒక సరుకుకు వర్తించే పన్నురేటు వివిధ రాష్ట్రాలలో భిన్నంగా వుండడమే అందుకు కారణం. వస్తు సేవల పన్ను పుణ్యమా అంటూ ఈ సమస్య సమసిపోయింది. ఇప్పుడు మనం చేయవల్సింది రాష్ట్రాలు నిర్ణయించే భిన్న జీఎస్టీ రేట్ల విధానాన్ని పునరుద్ధరించడమే. వివిధ పన్ను రేట్లతో కూడా అంతర్ రాష్ట్ర వాణిజ్యం సాధ్యమేనని అమెరికా, ఫిన్లాండ్ అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. సరుకుల వర్గీకరణ విషయంలో ఒక ఉమ్మడి పద్ధతిని అనుసరించడం ఉత్తమం. అయితే ఆ సరుకుల అమ్మకాలపై వసూలు చేసే పన్ను రేట్ల పై నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలివేయాలి. మనం ప్రధానంగా చేయవల్సింది రాష్ట్రాల స్వతంత్ర ప్రతిపత్తి పునరుద్ధరణ. తమ తమ ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా పన్ను రేట్లను నిర్ణయించుకుని, రాబడిని సమకూర్చుకునేందుకు రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛ నివ్వాలి. గతంలో అమ్మకం పన్నును అధిక స్థాయిలో వసూలు చేసిన అసోం తదితర రాష్ట్రాలు ఇప్పుడు కేంద్రం మోపిన జీఎస్టీ రేట్ల విధానాన్ని అనుసరిస్తున్నాయి. దీనివల్ల ఆ రాష్ట్రాలకు ఆదాయం తగ్గిపోయి ఆర్థిక సమస్యలు ముమ్మరమవుతున్నాయి. జీఎస్టీ విషయంలో రాష్ట్రాలకు స్వేచ్ఛ నిచ్చిన పక్షంలో కేంద్రం నిర్దేశించిన విధానాన్ని అనుసరించాల్సిన అనివార్యత తొలగిపోతుంది. రాష్ట్రాలకు, మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుంది.

జీఎస్టీ రేట్లను సొంతంగా నిర్ణయించుకునే స్వేచ్ఛ వుంటే రాష్ట్రాలు తప్పకుండా ఆ రేట్లను అధిక స్థాయిలో నిర్ణయిస్తాయి. తద్వారా గతంలో వలే తమ అవసరాలకు సరిపడా రాబడిని పెంపొందించుకోగలుగుతాయి. ఉమ్మడి కుటుంబం ఉదాహరణ ద్వారా ఈ సమస్యను తరచి చూద్దాం. ఒక ఉమ్మడి కుటుంబంలో ప్రతి ఒక్కరి నెలసరి వ్యయాలపై ఇంతే వుండాలని కుటుంబ పెద్ద కట్టడి చేయవచ్చు. ఇది నచ్చని చిన్న కుమారుడు ఎదురుతిరిగి వేరే కాపురం పెట్టే అవకాశముంటుంది కదా. అలా జరగడమంటే ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్న మవ్వడమే. అయితే కుటుంబ సభ్యులందరూ తమ స్వభావాలు, అభిరుచులకు అనుగుణంగా ఖర్చు పెట్టుకునే స్వేచ్ఛను కుటుంబ పెద్ద ఇవ్వడం జరిగితే ఆ కుటుంబం ఎప్పటిలా ఒకే కుటుంబంగా మనగలుగుతంది. చెప్పవచ్చిన దేమిటంటే జీఎస్టీని భిన్న రేట్ల ప్రకారం వసూలు చేసుకునే స్వేచ్ఛ రాష్ట్రాలకు వుంటే దేశ సమైక్యత మరింత పటిష్ఠంగా వుంటుంది. జీఎస్టీ లక్ష్యం 'ఒకే పన్ను ఒకే దేశం' కదా. అయితే రాష్ట్రాల స్వతంత్ర ప్రతిపత్తిని పునరుద్ధరించని పక్షంలో ఆ విధానం మూలంగా తద్విరుద్ధమైన ఫలితమే 'ఒకే పన్ను, పలు దేశాలు' ప్రాప్తమవుతుంది.

(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)

## శాపగ్రస్త బెజవాడా!

శాపగ్రస్త బెజవాడా!
ఏం పాపం చేశావని!!
అడుగడుగున అవమానం
అంతులేని పరితాపం
అవమానం అవమానం
తిరిగి తిరిగి వస్తున్నది
చరిత మరల ఒకచోటికె
నాడు వంద ఏళ్ళనాడు
జరిగిందొక అవమానం
వచ్చినట్టులే వచ్చీ
నచ్చక ఈ భూభాగం
తరలి పోయినది నాడే
అట్లా ఆ విశ్వవిద్యాలయం
బెజవాడా కాదు కాదు
బ్లేజ్ వాడ అని అంటూ
అలా పోయి ఇలా మరల
అదే చరిత తిరగ రాసి
మరలి పోవనున్నది ఈ
రాజధాని మన ప్రాంతం
శాపగ్రస్త బెజవాడా!
ఏం పాపం చేశావని!!
ఉద్యమాలె ఊపిరిగా
ఉద్భవించినది రాష్ట్రం
నాడె నీవు రాజధాని
కాకుండా చేశారే
కక్ష పట్టి, కుట్ర చేసి
'కుల'మంటూ ఒకటి చెప్పి
కమ్యూనిస్టు బూచి చూపి
సహజ న్యాయం వదిలి వేసి
నాడు నిన్ను వెలి వేసీ
అక్కడెక్కడో మూలో
పెట్టారే రాజధాని
మూడునాళ్ళ ముచ్చటగా
ముగిసిందే నాటి కథా
ఆంధ్రప్రదేశ్ అవతరణని
హైదరబాద్ మనదేనని
చంకలెగుర వేసుకొనీ
చతికిల పడ్డాం కాదా
చివరికిపుడు విజయవాడ
రాజధాని అనుకున్నాం
సంబరాలు పడుతుంటే
అగపడనదృశ్యశక్తి
కబళిస్తున్నది మళ్ళీ
శాపగ్రస్త బెజవాడా!
ఏం పాపం చేశావని!!

– పెనమకూరు సుబ్బారావు

వెబ్ సినిమా



'శక్తి'గా రమ్యకృష్ణ

**తెరపై ఆమె అందాలతార... రాజకీయాల్లో ఆమె ఫైర్‌బ్రాండ్... అందరి దృష్టిలో ఆమె ఒక ఉక్కు మహిళ. మరోవైపు ఆమె ఎన్నో విషాదాలను తనలో దాచుకున్న సాగరం. అవమానాలను స్వీకరించిన అలుపెరగని కెరటం. లెక్కలేనన్ని ఆటుపోట్లకు ఎదురొడ్డి రాటుదేలిన ఆమె జీవితం పట్ల అందరికీ ఆసక్తి ఉండటం సహజం. అందుకే ఆమె జీవిత కథను తెరకెక్కించేందుకు ఇప్పటికే వెండితెరపై రెండు ప్రయత్నాలు (కంగనారనౌత్, నిత్యామీనన్) జరుగుతుండగానే వాటి కన్నా ముందే వెబ్‌సిరీస్ ప్రత్యక్షమైంది. ఇటీవల ఎం.ఎక్స్.ప్లేయర్‌లో తొలివిడత 11 భాగాలుగా విడుదలైన 'క్వీన్' వెబ్ సిరీస్ 'పురట్చితలైవి' జయలలితను (వాస్తవ సంఘటనల నుంచి స్ఫూర్తిపొంది తీసిందని రూపకర్తలు అంటున్నారు) అద్భుతంగా ఆవిష్కరించింది.**




# విప్లవ నాయకి 'శక్తి'మంతంగా...!

ఒక సాదాసీదా అమ్మాయి ఉక్కు మహిళగా మారాలంటే... జీవితం ఆమెకు ఎన్నో పోరాటాలను నేర్పించి ఉండాలి. అనుభవం ఆమెకు సహనాన్ని, సాహసాన్ని బోధించి ఉండాలి. మారుతున్న కాలాన్ని, మనుషులను అంచనా వేసే 'శక్తి'ని ఆమె సాధించి ఉండాలి. పదేళ్ల వయసున్న తెలివైన అమ్మాయి శక్తి శేషాద్రి (అనికా) "ఇంట్లో ఉండటం కన్నా నాకు బడికి రావడమే ఇష్టం" అంటుంది. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ ఫ్లావియా 'నొప్పి ఉన్నా కూడా...' అంటూ ఆమెను ఆశ్చర్యంగా చూస్తుంది. అప్పుడు ఆ అమ్మాయి చూసిన చూపులో ఎన్నో అర్థాలు స్ఫురిస్తాయి. అందరు ఆడపిల్లల్లాంటి అందమైన బాల్యం కాదు శక్తిది. అంత చిన్నవయసులోనే ఆ తెలివైన పిల్లకు అనేక కష్టాలు అది కూడా తల్లి రంగనాయకి (సోనియా అగర్వాల్) రూపంలో. కూతురు తన కనుసన్నల్లోనే మెలగాలని ఆమె ఆంక్షలు పెడుతుంది. అసలు ఆమెకు కూతురు చదువుకోవడం కూడా ఇష్టం లేదు. కానీ శక్తి మాత్రం స్కూల్లో బ్రిలియంట్ స్టూడెంట్. చదువుతో పాటు ఆటపాటల్లో కూడా ఆమె సత్తా చాటుకుంటుంది. 14 ఏళ్ల ప్రాయంలో ఆమె కంటినిండా కలలే. అయితే తన జీవితానికి తన స్నేహితురాలు పింకీ జీవితానికి ఎంతో తేడా. లేలేత వయసులోనే సినిమాల్లో నటించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. శక్తికి నటించడం కన్నా కాలేజీలో చేరి చదువు కొనసాగించాలనే డ్రీమ్ ఉంటుంది. అయితే ఆమె కలలు కల్లలవుతాయి. బలవంతంగా స్కూలు మానిపిస్తుంది ఆమె తల్లి. సెట్లో ఆమెకు ఎన్నో అనుభవాలు. తోటి నటీనటులతో స్నేహంగా ఉండాలని భావిస్తే, వారు దగ్గరకు రానివ్వరు. దాంతో సమూహంలో ఒంటరిగా మారుతుంది. పుస్తకాలే నేస్తాలుగా మారుతాయి. కానీ 'ఒంటరిగా కూర్చుంటే ఎలా? అందరితో కలవాల'ని తల్లి మందలింపు. డైరెక్టర్ శ్రీధర్ (గౌతమ్ మీనన్) ద్వారా శక్తి సినిమా మేకింగ్‌కు సంబంధించిన అనేక విషయాలను తెలుసుకుంటుంది. కెమెరా షాట్ ఎలా పెట్టాలో, సీన్‌లో జరిగిన తప్పేంటో... ఆమె చెబుతుంటే దర్శకుడు శ్రీధర్ షాక్ అవుతాడు. సినిమా పట్ల ఆమెకున్న నిబద్ధతకు ఆశ్చర్యపోతాడు.

అనికా


అంజన

### 17 ఏళ్ల ప్రాయంలో...

చిన్నప్పటి శక్తి ఆశ అడియాసల నడుమ సినీతారగా మారుతుంది. శక్తి యవ్వనంలోకి అడుగిడిన తర్వాత ఆ పాత్రలో అంజనా జయప్రకాశ్ జీవించింది. 17 ఏళ్ల వయసులోనే శక్తి జీవితంలోకి తమిళనాడు సూపర్‌స్టార్ జీఎంఆర్ (ఇంద్రజిత్ సుకుమారన్) ప్రవేశిస్తాడు. ఆయన శక్తికి తన సరసన నటించే అవకాశాలిస్తాడు. జనాలు వారిద్దరి గురించి ఏమనుకున్నా శక్తి లెక్కచేయదు. 21 ఏళ్లకే విజయవంతమైన నాయకిగా ఎదుగుతుంది. అయితే జీఎంఆర్‌తో మనస్పర్థలు వచ్చిన తర్వాత ఆమెకు అవకాశాలు తగ్గుతాయి. ఇదే సమయంలో ఆమె పెళ్లి చేసుకుని పిల్లలకు తల్లవ్వాలనుకుంటుంది. చైతన్యరెడ్డి (వంశీకృష్ణ)కి దగ్గరవుతుంది. అతడిని పెళ్లి చేసుకోవాలనుకుంటుంది. కానీ విధి మరోసారి ఆమెతో ఆడుకుంటుంది. చైతన్యతో ఆమె పెళ్లి కోరిక తీరదు. దాంతో నిరాశానిస్పృహలకు లోనవుతుంది. అదే సమయంలో తల్లి మరణం ఆమెను మరింత కుంగుబాటుకు గురిచేస్తుంది. ఆర్థికంగా దెబ్బతింటుంది. ఆమె జీవితం అతలాకుతలం అవుతుంది. అలాంటి పరిస్థితిలో సాయం చేస్తానంటూ ఆమె జీవితంలోకి మరోసారి జీఎంఆర్ ప్రవేశిస్తాడు. అనేకానేక ఆలోచనలు, ఆత్మాభిమానాల సంఘర్షణ తర్వాత శక్తి తీసుకున్న నిర్ణయం ఆమె జీవితాన్ని మరో మలుపు తిప్పుతుంది. ఆ తర్వాత జీఎంఆర్ హఠాన్మరణం, శక్తి సాహసోపేతమైన నిర్ణయం... ఆమెను ఉక్కుమహిళగా మారుస్తాయి. అయితే ఎవరి సపోర్టూ లేకున్నా 'శక్తి'మంతంగా మారిందా? లేదా వెనుదిరిగిందా? అనే ఆసక్తిని పెంచుతూనే 11 ఎపిసోడ్లు పూర్తవుతాయి.

### సినిమా కన్నా మిన్నగా...

విప్లవ నాయకిగా పేరున్న ఒక 'శక్తి'మంతమైన మహిళ జీవితాన్ని సినిమాగా రెండున్నర గంటల్లోకి కుదించడం వల్ల ఆమెకు న్యాయం జరగదనే చెప్పాలి. అయితే 'క్వీన్' వెబ్‌సిరీస్‌తో ఆమె జీవితాన్ని పెద్ద కాన్వాస్‌పై చూసిన అనుభూతి కలుగుతుంది. ఈ వెబ్ సిరీస్‌ను గౌతమ్ వాసుదేవ్ మీనన్, ప్రశాంత్ మురుగేశన్‌లు డైరెక్ట్ చేశారు. 'పురట్చితలైవి' జయలలిత మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలు అన్నింటిలోకి ఆమె సిమీ గరేవాల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ ప్రత్యేకం. తొలి సిరీస్‌లోని 11 ఎపిసోడ్లు అన్నీ కూడా శక్తి (రమ్యకృష్ణ) ఇంటర్వ్యూతోనే ప్రారంభం అవుతాయి. ఆమె మీడియా ప్రతినిధి (లిటిల్ దూబే)తో కెమెరా ముందు పంచుకున్న అనుభవాల సారమే ఈ వెబ్ సిరీస్. చిన్నతనం, యవ్వనం, రాజకీయం... ఇలా తన జీవితంలో జరిగిన సంఘటనలన్నింటినీ ఆమె వివరిస్తుంది.

ఇందులో 'శక్తి' మూడు కోణాల్లో కనిపిస్తుంది. చిన్నప్పటి శక్తిగా అనికా, యవ్వనంలో శక్తిగా అంజనా, మధ్యవయస్కురాలైన శక్తిగా రమ్యకృష్ణ... ముగ్గురూ అద్భుతంగా నటించారు. ముఖ్యంగా అనికా, అంజనలు తమ హావభావాలతో చూపు తిప్పుకోనివ్వరు. ఆయా కాలమాన పరిస్థితులకు తగ్గట్టుగా బ్యాక్‌గ్రౌండ్‌ను ఎంచుకున్నారు. ఒక ప్రధాన పాత్రలో డైరెక్టర్ గౌతమ్ తనలోని నటుడిని ఆవిష్కరించాడు. తులసి (పెద్దయ్యాక శక్తి తల్లి రంగనాయకి), వనితా కృష్ణచంద్రన్ (జీఎంఆర్ భార్య), ఛార్మిళ (శక్తి అమ్మమ్మ) తదితరులున్నారు.

అనితా శివకుమారన్ నవల 'క్వీన్' ఆధారంగా అదే పేరుతో రూపుదిద్దుకున్న ఈ వెబ్ సిరీస్‌కు రేష్మా రచన చేశారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత జయలలిత జీవితాన్ని ఆధారంగా తీసుకుని 'క్వీన్' నవల రాసినప్పటికీ, వివాదాల నేపథ్యంలో ఈ వెబ్ సిరీస్ మాత్రం ఆమె జీవితకథ కాదని, ఇది కేవలం కల్పితం మాత్రమే అని నిర్వాహకులు పేర్కొన్నారు. అయితే ఆయా పాత్రలు, వాటికి పెట్టిన పేర్లు (ఎంజీఆర్- జీఎంఆర్, నాడోడి మన్నన్- నాడోడి వేంధన్, శశికళా నటరాజన్- సూర్యకళా ధన్‌రాజ్, చర్చ్ పార్క్ స్కూల్- సెయింట్ లూయిస్ పార్క్) జయలలిత కథను గుర్తుకు తెస్తాయనడంలో సందేహం లేదు. కానీ ఆయా పాత్రల తీరుతెన్నులను రేష్మా తన రచనాపటిమతో చాలా జాగ్రత్తగా డీల్ చేశారు. 11 ఎపిసోడ్ల 'క్వీన్' వెబ్‌సిరీస్ ఎం.ఎక్స్.ప్లేయర్‌లో అందుబాటులో ఉంది.

• సి.ఎస్

---

**ఉద్యోగం కోసం అమెరికా వెళ్లి, అక్కడే స్థిరపడిన భారతీయుల్లో మోనిషా ఘోష్ కూడా ఒకరు. సమాచార రంగంలో పరిశోధకురాలిగా సమాచార, సాంకేతిక వ్యవస్థ మీద అనతికాలంలోనే తనదైన ముద్ర వేశారామె. తాజాగా అక్కడి ఫెడరల్ కమ్యూనికేషన్ కమిషన్ (ఎఫ్‌సీసీ)లో ముఖ్య సాంకేతిక అధికారిణిగా ఎంపికై వార్తల్లో నిలిచారు. ఈ హోదాకు చేరుకున్న మొదటి మహిళ ఆమే కావడం విశేషం. జనవరిలో సీటీవోగా బాధ్యతలు చేపట్టనున్న మోనిషా విశేషాలివి...**

న్యూస్‌మేకర్



అమెరికాలో రేడియో, టీవీ, శాటిలైట్, కేబుల్ ద్వారా జరిగే అంతర్‌రాష్ట్ర, అంతర్జాతీయ సమాచారాన్ని ఎఫ్‌సీసీ నియంత్రిస్తుంది. ఎఫ్‌సీసీ అనేది అమెరికా ప్రభుత్వంలోని శక్తిమంతమైన స్వతంత్ర సంస్థ. ఇది అమెరికన్ కాంగ్రెస్ కనుసన్నల్లో పనిచేస్తుంది. అమెరికాలో సమాచార వ్యవస్థకు సంబంధించిన చట్టం, నియమాలు సవ్యంగా అమలు చేయడం ఈ సంస్థ బాధ్యత. ఎఫ్‌సీసీలో ఇప్పటివరకూ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా మగవాళ్లే ఉండేవారు. మొదటిసారిగా ఒక మహిళకు ఆ అవకాశం దక్కింది. ప్రస్తుతం మోనిషా షికాగో యూనివర్సిటీకి చెందిన అర్‌గొన్నె నేషనల్ ల్యాబరేటరీలో రీసెర్చ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

# ఆమె సమాచార వారధి!

### వైర్‌లెస్ రంగంలో అందెవేసిన చెయ్యి....

ఐఐటీ ఖరగ్‌పూర్‌లో బీటెక్ పూర్తయ్యాక తన బ్యాచ్‌మేట్స్ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తుంటే మోనిషా మాత్రం పీహెచ్‌డీ చేయాలనుకున్నారు. వైర్‌లెస్ కమ్యూనికేషన్, సిగ్నల్ ప్రాసెసింగ్ మీద ఆమెకు ఆసక్తి ఎక్కువ. దాంతో అదే అంశం మీద పీహెచ్‌డీ చేయాలనుకున్నారామె. అదే సమయంలో కాలిఫోర్నియాలోని సదరన్ యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో పరిశోధన చేసే అవకాశం రావడంతో వెంటనే చేరిపోయారు మోనిషా. పీహెచ్‌డీ తరువాత షికాగో యూనివర్సిటీలో రీసెర్చ్ ప్రొఫెసర్‌గా కొన్నాళ్లు పనిచేశారు. సమాచార వ్యవస్థలో వేగంగా వస్తోన్న మార్పులను గమనించడం, తదనుగుణంగా పరిశోధనలు చేయడంలో మోనిషా ముందుండేవారు. ఆ క్రమంలోనే ఆమె వైర్‌లెస్ టెక్నాలజీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, 5జీ, వైఫై వ్యవస్థ మీద పరిశోధనలు చేశారు. వీటితో పాటు వ్యవసాయ రంగంలో తక్కువ శక్తితో పనిచేసే సెన్సార్ నెట్‌వర్క్స్ రూపొందించడం, సిగ్నల్ ప్రాసెసింగ్ టెక్నాలజీతో జన్యుక్రమాన్ని అధ్యయనం చేయడం మీద ఆమె దృష్టి సారిస్తున్నారు.

అమెరికన్లకు 5జీ టెక్నాలజీ అందుబాటులోకి తేవడంలో మోనిషా కీలకపాత్ర పోషిస్తారని ప్రస్తుతం ఎఫ్‌సీసీ ఛైర్మన్‌గా ఉన్న భారతీయ అమెరికన్ అజిత్ పాయ్ ఆమెను ప్రశంసించారు. "డాక్టర్ ఘోష్ వైర్‌లెస్ టెక్నాలజీ మీద ఎన్నో పరిశోధనలు చేశారు. ఆమె పరిశోధనలు ఎంతో విలువైనవి. ఇంటర్నెట్ థింగ్స్ నుంచి మెడికల్ టెలిమెట్రీ, బ్రాడ్‌కాస్టింగ్‌కు సంబంధించిన సమాచారం ఆమె సొంతం. చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా మోనిషా నియామకం చరిత్రలో నిలిచిపోతుంది. సైన్స్ రంగాన్ని కెరీర్‌గా ఎంచుకునేందుకు ఎంతోమంది అమ్మాయిలకు ఆమె స్ఫూర్తిగా నిలుస్తారని భావిస్తున్నా" అంటున్నారు అజిత్. జనవరి 13న సీటీవోగా బాధ్యతలు చేపట్టనున్న మోనిషా ఇప్పటి వరకూ 50కి పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. ఆమె పేరిట 40 పేటెంట్లు కూడా ఉన్నాయి.

---

తిరుప్పావై

# మైమరపించేవాడు మాధవుడు!

### తొమ్మిదో పాశురం

**తూమణి మాడత్తు చ్చుత్తుమ్ విళక్కెరియ**
**తూపం కమళ త్తుయిల్ అణై మేల్ కణ్ వళరుమ్**
**మామన్ మగళే! మణి క్కదవమ్ తాళ్ తిఱవాయ్**
**మామీర్! అవళై ఎళుప్పీరో! ఉన్ మగళ్ తాన్**
**ఊమైయో? అన్రిచ్చెవిడో? అనన్దలో?**
**ఏమప్పెరున్దుయిల్ మందిర ప్పట్టాళో?**
**"మామాయన్ మాదవన్ వైకున్దన్" ఎన్రెన్రు**
**నామమ్ పలవుమ్ నవిన్రు ఏల్ ఓర్ ఎంబావాయ్**

**భావం:** సంపన్నంగా ఉన్న ఒక ఇంట్లో నిద్రిస్తున్న గోపికను గోదాదేవి మేలుకొలుపుతోంది. "మణులు తాపడం చేసిన మేడలో, చుట్టూ దీపాల కాంతిలో, సుగంధభరితమైన ధూపాలు వ్యాపించి ఉండగా, సుఖంగా ఉండే మెత్తని శయ్య మీద నిద్రిస్తున్న మామ కూతురా! తలుపు తెరువవమ్మా! అత్తయ్యా! మీరైనా ఆమెను మేలుకొలుపరాదా? అయ్యో! మీ కుమార్తె మూగదా? చెవులు వినబడనిదా? లేదా సోమరితనమా? అంతటి మొద్దు నిద్ర పట్టడానికి ఎవరైనా మంత్రం వేశారా? లేకపోతే కావలివారిని కాపలా ఉంచేరా?" అని గోదాదేవి అడిగింది. అప్పుడు ఆ గోపిక తల్లి "ఊరికే కేకలు వేయడం కాదు, భగవన్నామస్మరణ చేయండి" అని చెప్పింది. వెంటనే, శ్రీకృష్ణుడు విచిత్రమైన చేష్టలతో మైమరపించే వాడనీ, మాధవుడనీ, వైకుంఠవాసుడనీ ఆండాళ్, ఆమె చెలులు కీర్తించారు. "ఇది మేము సంకల్పించిన అద్వితీయమైన వ్రతం. అందులో పాలుపంచుకోవాలని మీ కుమార్తెను పిలుస్తున్నాం" అని వివరించారు.


ప్రముఖ చిత్రకారుడు బాపు బొమ్మ

• ఎ.సీతారామారావు

---

## ముత్యాల ముగ్గు


17 చుక్కలు
7 వరసలు
7 వచ్చే వరకు


**జి. తిరుమల**
బాలాజీనగర్, కరీంనగర్


5 చుక్కలు
5 వరుసలు
1 వచ్చే వరకు


**సిరిపురం లక్ష్మీకళ**
నకిరేకల్, నల్గొండ జిల్లా


19 చుక్కలు
మధ్య చుక్క
10 వచ్చే వరకు

**లుక్కా భాగ్యలక్ష్మి**
కనగాల, గుంటూరు జిల్లా


15 చుక్కలు
8 వచ్చే వరకు
మధ్య చుక్క

**పి. జాన్సీరాణి**
అనంతపల్లి, పశ్చిమగోదావరి జిల్లా

మీ ముత్యాల ముగ్గుతో పాటు మీ ఫొటో, పోస్టల్ అడ్రస్, ఫోన్ నంబర్ కూడా వివరంగా రాయండి.

మా చిరునామా... నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. Email: navya@andhrajyothy.com

---

# ఎవరితోనో ఉంటూ... మమ్మల్ని వదిలేస్తే ఎలా?

లీగల్ కౌన్సెలింగ్



మేము హిందువులం. మా నాన్న ప్రభుత్వ ఉద్యోగి. నా చిన్నతనంలోనే నాన్న మమ్మల్ని వదిలేసి ఒక ముస్లిం మహిళతో కలసి (16 ఏళ్లుగా) జీవిస్తున్నాడు. ఆవిడకు ఇద్దరు పిల్లలు. అయితే నాన్న ఆమెను పెళ్లి మాత్రం చేసుకోలేదు. నాన్న అసలు పేరు చంద్రశేఖర్. ఆవిడతో ఉండడం మొదలెట్టాక తన పేరును రజాక్‌గా మార్చుకున్నాడు. ఆఫీసులో మాత్రం చంద్రశేఖర్ అనే ఉంది. పదేళ్లక్రితం మా మేనమామలు, అమ్మ కలిసి కోర్టులో కేసు వేశారు. కోర్టువారు రాజీ కుదిర్చి నెలకు 2 వేల రూపాయల చొప్పున అమ్మకు భరణం ఇచ్చేలా తీర్పు ఇచ్చారు. ఆ మేరకు మూడేళ్లపాటు ఇచ్చి ఆ తరువాత ఇవ్వడం మానేశాడు. పెద్దక్క పెళ్లికోసం డబ్బులు అడిగితే, మా పేరు మీద ఉన్న ప్లాట్‌ను ఆవిడ పేరు మీద రాయించుకుని 50 వేల రూపాయలు ఇచ్చాడు. ఇక చిన్నక్క పెళ్లి గురించి డబ్బు అడిగితే, డబ్బులు ఇవ్వనని చెప్పాడు. వాళ్లుంటున్న ప్రాంతానికి చెందిన ఎస్సై మమ్మల్ని పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకోమన్నారు. ఆ పంచాయతీలో పెద్ద మనుషులు అమ్మకు జీవనభృతిగా నెలకు 5 వేల రూపాయల చొప్పున ఇస్తూ, రెండో అమ్మాయి పెళ్లి చేయాలని తీర్పు ఇచ్చారు. కాకపోతే పెళ్లి ఎప్పటిలోగా చేయాలో ఏమీ నిర్దేశించలేదు. ఈ విషయంలో మేము ఏం చేయాలో తగిన సలహా ఇవ్వండి.

**- పి. సునంద,** మహబూబ్‌నగర్

ఎవరైనా కారణం లేకుండా తల్లిదండ్రులను గానీ, భార్యను గానీ, మైనర్ పిల్లలను గానీ సంరక్షించే బాధ్యతను నిర్వర్తించనట్లయితే, అట్టి వ్యక్తి నుంచి జీవనభృతి పొందడానికి చట్టంలో వెసులుబాటు ఉంది. మీ నాన్నగారు తన అసలు పేరుతో ఉద్యోగం చేస్తున్నందువల్ల మీ అమ్మ వేసిన కేసులో రాజీ కుదిర్చి 2 వేల రూపాయలు నిర్ణయించినా... ఆ తరువాత పెద్దలు నెలకు 5 వేల రూపాయలు ఇవ్వాలని నిర్ణయించినా అవేవీ ఖాతరు చేయకుండా నెలనెలా పంపాల్సిన మొత్తం చెల్లించడం లేదని తెలిపారు. పెద్దలు నిర్ణయించిన సొమ్మును చెల్లించ నట్లయితే, వాటిని చట్టం ద్వారా అమలు పరచడానికి ఆస్కారం ఉండదు. కానీ, గతంలో రాజీ ద్వారా నిర్ణయించిన 2 వేల రూపాయల విషయంలో అప్పటి రాజీ షరతులకు లోబడి అవి సరిపోవన్నట్లుగా కోర్టువారికి తెలియచేసినట్లయితే, మీ నాన్నగారి ప్రస్తుత ఆదాయం ఆధారంగా ఎంత జీవన భృతిని చెల్లించాలనే విషయాన్ని నిర్ణయిస్తారు.

ఇకపోతే మీ నాన్న ముస్లిం మహిళను పెళ్లి చేసుకోకుండానే సహజీవనం చేస్తూ, పిల్లలను కనడం చట్టరీత్యా నేరం. ఏది ఏమైనా తన స్వార్జితం ద్వారా ఏవైనా ఆస్తులను సంపాదించినప్పుడు అవి ఎవరికి చెందాలనే విషయంలో నిర్ణయం తీసుకునే హక్కులు మీ నాన్నగారికే ఉంటాయి. ఇకపోతే మీ అక్కయ్యలకు పెళ్లి చేయవలసిన బాధ్యత చట్టపరంగా మీ నాన్నగారి మీదే ఉంది. ఆయన మొండిగా వ్యవహరించినట్లయితే, మీ చిన్నక్కయ్య పెళ్లి విషయంలో మీ అమ్మ, మీ అక్కయ్య ఇద్దరూ ఫ్యామిలీ కోర్టులో మెయింటెనెన్స్ విషయంలో, పెళ్లి ఖర్చుల విషయంలో దావా వేసినట్లయితే తప్పనిసరిగా న్యాయం జరుగుతుంది.



• **ఒడ్నాల శ్రీహరి**, న్యాయవాది, హైదరాబాద్

హెల్తీ స్మెల్

# పుదీనా సువాసనతో...

ఆరోమాథెరపీతో సుగంధాలను లోనికి తీసుకోవడం అంటే, శరీరంలోని దుర్గంధాలను బయటికి పంపడమే! పీల్చిన సుగంధాలు శ్వాసకోశాల్లో నిండిపోయి అక్కడి నుంచి రక్తంతో కలిసి శరీరంలోని అణువణువూ వ్యాపిస్తాయి. అలాంటి సుగంధ మొక్కల్లో పుదీనా ఒకటి. పుదీనా ఆకుల వాసన మెదడును ఉత్తేజితం చేస్తుంది. ఒత్తిళ్లతో అలసిపోయిన మెదడుకు శక్తిదాయకంగా పనిచేస్తుంది. ఏకాగ్రతను పెంచడం ద్వారా స్పష్టమైన ఆలోచనలకు మూలమవుతుంది. ఉత్సాహాన్ని నింపడంతో పాటు నీరసాన్ని దూరం చేస్తుంది. పుదీనా వాసన పీల్చడంతో తలనొప్పులు తగ్గడంతో పాటు, పూడుకుపోయిన సైనస్ గదులు శుభ్రమవుతాయి. మైగ్రేన్ సమస్య తగ్గిపోయేలా చేస్తుంది. నాణ్యమైన నిద్రకు బాగా ఉపయోగపడుతుంది. భావోద్వేగాల్లో స్థిమితత్వాన్ని తెస్తుంది.



కేర్

# బుజ్జాయిలకు లాల ఇలా!

పసికందులు తాకితేనే కందిపోయేంత సున్నితంగా ఉంటారు. అలాంటి బుజ్జాయిలకు ఏకంగా స్నానమే చేయించాలంటే... భయం వేయటం సహజమే! కానీ, ఇందుకు విరుద్ధంగా పసికందులకు కాస్త మొరటుగా స్నానం చేయించేవాళ్లూ లేకపోలేదు. అసలు పిల్లలకు స్నానం చేయించే పద్ధతంటూ ఉంటుందా? ఏ పద్ధతి వల్ల పిల్లలు అసౌకర్యానికి గురికాకుండా ఉంటారు?

**బొడ్డుతాడు ఊడేవరకూ:** పుట్టింది మొదలు ప్రతిరోజూ పసికందులకు స్నానం చేయించవచ్చు లేదా వారంలో మూడు సార్లు చేయించినా సరిపోతుంది. అయితే ఏకంగా టబ్‌లో కాకుండా సబ్బు నీళ్లలో ముంచి మెత్తని స్పాంజ్‌తో ఒళ్లంతా తుడిచి, వేడి నీళ్లలో తడిపి పిండిన గుడ్డతో తుడవాలి.



**ఏ సమయంలో?:** పిల్లలు ఉదయం వేళ స్నానం ఇష్టపడతారు. ఇంకొందరు రాత్రి పడుకోబోయే ముందు స్నానం చేయటానికి మక్కువ చూపుతారు. అసలు స్నానమే వద్దనుకుంటే ముఖం, మెడ, చేతులు, డయాపర్ వేసే ప్రదేశాలను శుభ్రం చేసినా సరిపోతుంది. అయితే స్నానం మాత్రం వారంలో కనీసం 3 సార్లైనా తప్పక చేయించాలి.

**ఏ సబ్బు:** పిల్లలకు గరుకుగా ఉండే సున్నిపిండి బదులు పర్‌ఫ్యూమ్, డైలు వాడకుండా తయారైన సబ్బును ఎంచుకోవాలి. సబ్బును రుద్దేటప్పుడు ఒక చేత్తో తలను పట్టుకుని ఇంకో చేత్తో ఒళ్లు రుద్దాలి. ఎక్కువ నీటితో సబ్బు నురగంతా వదిలేలా సున్నితంగా రుద్ది స్నానం చేయించాలి.

హార్మోనల్ హెల్త్

# ఈ మార్పులు ఎందుకు?

**డాక్టర్! నా వయసు 45 ఏళ్లు. గత కొంతకాలంగా నా శరీరంలో కొన్ని మార్పులను గమనిస్తున్నాను. గడ్డం పూర్తిగా పెరగడం లేదు. వక్షోజాల పరిమాణం పెరుగుతోంది. వృషణాలు, అంగం పరిమాణం తగ్గింది. కోరికలు కూడా తగ్గినట్టు గ్రహించాను. పరీక్షల్లో టెస్టోస్టిరాన్, థైరాయిడ్ హార్మోన్ల పరిమాణం మామూలుగానే ఉంది. నాకు రెండేళ్ల నుంచీ మద్యం అలవాటు కూడా ఉంది. నాలో ఈ మార్పులకు మద్యం అలవాటు కారణమా? లేక హార్మోన్ల సమస్యలు కారణమా?**

**- ఓ సోదరుడు,** విజయవాడ



మీ లక్షణాలను బట్టి మీలో ఈస్ట్రోజన్ హార్మోన్ స్థాయి పెరిగినట్టు అనిపిస్తోంది. టెస్టోస్టిరాన్ హార్మోన్ తగ్గినా ఇవే లక్షణాలు కనిపిస్తాయి. అయితే పరీక్షల్లో ఆ హార్మోన్ సమంగానే ఉన్నట్టు తేలింది కాబట్టి మీ సమస్యకు ఈస్ట్రోజన్ హార్మోన్ పెరగడమే కారణంగా భావించవచ్చు. సాధారణంగా పురుషుల్లో టెస్టోస్టిరాన్‌తో పాటు ఈస్ట్రోజన్ హార్మోన్ కూడా తక్కువ పరిమాణంలో ఉంటుంది. ఈ హార్మోన్ స్రావం పెరిగినప్పుడు మీరు చెప్పిన లక్షణాలన్నీ తలెత్తుతాయి. కాబట్టి ఈ హార్మోన్‌కు సంబంధించిన పరీక్ష చేయించుకోండి. ఫలితాన్ని బట్టి మందులు వాడితే, కొద్ది నెలల్లోనే పరిస్థితి సర్దుకుంటుంది. ఇంతకుముందు లాగే గడ్డం పెరుగుతుంది. అంగం, వృషణాల పరిమాణం సాధారణ స్థితికి వస్తుంది. వక్షోజాలు తగ్గుతాయి. లైంగిక కోరికలూ పెరుగుతాయి. కాబట్టి కంగారు పడకుండా వైద్యులను కలిసి, హార్మోన్ పరీక్ష చేయించుకోండి. ఫలితాన్ని బట్టి చికిత్స తీసుకోండి. అయితే మద్యం అలవాటు వల్ల కూడా లైంగిక కోరికలు తగ్గే అవకాశం ఉంది. కాబట్టి మద్యం అలవాటును నియంత్రించుకోండి.

**- డాక్టర్ రాహుల్ రెడ్డి**
ఆండ్రాలజిస్ట్, హైదరాబాద్
8332850090 (కన్సల్టేషన్ కోసం)





పుట్టినరోజులు... పెళ్లిరోజులు... పండగలు....
ఇలాంటి ఏ సందర్భం ఉన్నా,
అసలు ఎలాంటి సందర్భమూ లేకపోయినా....
విందు, దాంతో పాటు మందు ఇప్పుడు
చాలా మామూలైపోతున్నాయి!
'గమ్మత్తైన ఆ మత్తులో అడపాదడపా తూలకపోతే...
సరదాలకు, వినోదాలకు అర్థం,
పరమార్థం లేనే లేదు' అనుకుంటున్నారు.
అయితే మందు మత్తులో ముంచుతుందా? లేక
బయట పడలేని ఊబిలోకి లాగేస్తుందా?
తాత్కాలిక సరదాలను అందిస్తోందా? లేక
శాశ్వత దుష్పరిణామాలకు దారి తీస్తోందా?
రానున్న 'న్యూ ఇయర్ సెలబ్రేషన్స్' టైమ్‌లో...
ఓ లుక్కేద్దాం!

హెల్త్ కేర్

# మత్తు వదలరా..!

టీనేజ్‌లోకి అడుగుపెట్టక ముందే మద్యం రుచి చూసే వారి సంఖ్య క్రమేపీ పెరిగిపోతోంది. మన దేశంలో సుమారుగా 13 ఏళ్ల వయసు నుంచే మద్యపానం మొదలుపెడుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే మద్యం మత్తు దిగినంత తేలికగా దాని ప్రభావం శరీరం నుంచి దిగిపోదు. అది అందించే తాత్కాలిక మత్తు, ఆరోగ్యాన్ని శాశ్వతంగా చిత్తు చేస్తుందనేది వాస్తవం!



### మద్యపానంలో మూడు రకాలు!

అరుదుగా, తరచుగా... ఇలా రెండు విధాల్లో తాగేవారు ఉంటారు. వారంలో ఒకసారి కేవలం రెండు పెగ్‌ల మద్యాన్ని మాత్రమే సేవిస్తే 'సోషల్ డ్రింకింగ్' అనీ, ప్రతి రోజూ తాగుతూ ఉంటే, 'క్రానిక్ డ్రింకింగ్' అనీ వైద్యులు వర్గీకరించారు. అయితే ఈ రెండిటికంటే భిన్నమైన 'బింజ్ డ్రింకింగ్' ప్రస్తుతం ఎక్కువగా కనిపిస్తోంది. వారంలో ఒక్కసారి తాగినా ఎక్కువ మద్యం తాగేయడమే - బింజ్ డ్రింకింగ్! ఇది 'క్రానిక్ డ్రింకింగ్'తో సమానం.

### కిక్కు లెక్క!

మద్యంలో ఆల్కహాల్ గ్రాముల పరిమాణంలో ఉంటుంది. అన్ని రకాల మద్యాల్లో (విస్కీ, ఓడ్కా, రమ్, జిన్, షాంపెయిన్, బ్రాందీ) ఆల్కహాల్ పరిమాణం ఇంచుమించుగా, 100 మిల్లీ లీటర్లలో సుమారుగా 42 గ్రాములు ఉంటుంది. ఉదాహరణకు 90 మిల్లీ లీటర్ల విస్కీ తీసుకుంటే సుమారుగా 40 గ్రాముల ఆల్కహాల్ తాగినట్టుగా భావించాలి. అయితే 100 మిల్లీ లీటర్ల బీరులో 5 గ్రాముల ఆల్కహాల్ మాత్రమే ఉన్నా, సీసా మొత్తం 650 మిల్లీ లీటర్ల పరిమాణం తాగడంతో సుమారుగా 40 గ్రాముల ఆల్కహాల్ తాగేస్తూ ఉంటారు. అంటే ఒక బీరు సీసా, మూడు పెగ్గుల (90 మిల్లీ లీటర్ల) విస్కీతో సమానంగా భావించాలి.

### మద్యంతో నష్టాలు ఇవే!

మద్యం ప్రభావం నాడీ వ్యవస్థ, కాలేయం, జీర్ణవ్యవస్థ, మూత్రపిండాలు, గుండె, మానసిక స్థితుల మీద ఉంటుంది. మద్యం తాగిన వెంటనే మాట, నడకల్లో తూలుడు, విచక్షణ కోల్పోవడం లాంటి తాత్కాలిక లక్షణాలు కనిపిస్తాయి. అంతకుమించి, దీర్ఘకాలంలో అంతర్గతంగా శాశ్వత నష్టం కలిగించే ప్రభావం మద్యానికి ఉంటుంది.

**నాడీవ్యవస్థ:** మద్యపానం వల్ల ఆహారంలోని పోషకాలను శోషించుకునే శక్తి శరీరంలో సన్నగిల్లుతుంది. ఫలితంగా పోషకాహార లోపం తలెత్తుతుంది. ఫలితంగా నాడీసంబంధ సమస్యలు మొదలవుతాయి. మద్యం ప్రభావంతో పరాధీన నాడుల పనితీరు దెబ్బతినడం వల్ల అరచేతులు, అరికాళ్లలో మంటలు వేధిస్తాయి. కేంద్రనాడీ వ్యవస్థ దెబ్బతిని, నడకలో తూలు శాశ్వతంగా మిగిలిపోతుంది.

**జీర్ణవ్యవస్థ:** మద్యం జీర్ణవ్యవస్థను అతలాకుతలం చేస్తుంది. అతి స్వల్ప పరిమాణంలో మద్యం తీసుకున్నా ఎక్కువ మొత్తంలో ఆమ్లం ఉత్పత్తి జరిగి, 'గ్యాస్ట్రయిటిస్'(జీర్ణాశయ లోపలి పొర వాపు) సమస్య తలెత్తుతుంది. దాంతో పొట్టలో మంట, నొప్పి, వాంతులు, కొన్ని సందర్భాల్లో పొట్టలో పుండ్లు మొదలవుతాయి. అలాగే వీరిలో 'ఎక్యూట్ ప్యాంక్రియాటైటిస్' (క్లోమ గ్రంథి ఉబ్బిపోవడం) అనే సమస్య కూడా తలెత్తుతుంది. ఇది మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌కూ దారి తీయవచ్చు. ఇది కూడా ప్రాణాంతకమే!

**కాలేయం:** మద్యం తాగే 90% మందికి 'ఫ్యాటీ లివర్' ఉంటుంది. వీరిలో 30% మందికి 'సివియర్ ఆల్కహాలిక్ హెపటైటిస్' (కామెర్లు) అనే సమస్య ఉంటుంది. ఈ స్థితి ప్రాణాంతకంగా మారవచ్చు లేదా 'లివర్ సిరోసిస్'కు దారి తీయవచ్చు.

### మహిళల్లో...

పురుషులతో పోల్చినప్పుడు మద్యం కారణంగా కాలేయం దెబ్బతినే తీవ్రత మహిళల్లో ఎక్కువ. ఆల్కహాల్‌ను అరిగించుకోవడానికి ఉపయోగపడే 'ఆల్కహాల్ డీహైడ్రోజినేజ్' అనే ఎంజైమ్ మహిళల్లో తక్కువగా ఉండడమే దీనికి కారణం. కాబట్టి వీరిలో త్వరగా, తేలికగా కాలేయం దెబ్బతింటుంది.



**మూత్రపిండాలు:** మూత్రపిండాలు శరీరంలో నీటి సమతౌల్యాన్ని కాపాడుతూ ఉంటాయి. అలాగే రక్తంలో కలిసిన ప్రమాదకర పదార్థాలనూ వడకడుతూ ఉంటాయి. మద్యం తీసుకోవడం మూలంగా మూత్రపిండాలకు ఆ సామర్థ్యం తగ్గుతుంది. అలాగే మద్యం వల్ల శరీరంలో డీహైడ్రేషన్ (నీటి శాతం తగ్గడం) స్థితి నెలకొంటుంది. ఈ స్థితి మూత్రపిండాలను దెబ్బతీస్తుంది. అలాగే మద్యం అతిగా తీసుకోవడం వల్ల రక్తపోటు పెరిగి, తత్ఫలితంగా మూత్రపిండాలు దెబ్బతింటాయి.

**గుండె:** మద్యం ప్రభావం గుండె మీద నేరుగా ఉండకపోయినా, మద్యం తాగే సమయంలో తినే పదార్థాల కారణంగా రక్తంలో కొలెస్ట్రాల్ పెరిగి, తద్వారా గుండె జబ్బులు తలెత్తుతాయి. అలాగే మద్యంతో పెరిగే రక్తపోటు ప్రభావంతో గుండె మీద ఒత్తిడి పెరుగుతుంది. దీర్ఘకాలంలో ఇది గుండె సమస్యలకు దారితీస్తుంది. గుండె పనితీరు సామర్థ్యం తగ్గే సమస్య 'ఆల్కహాలిక్ కార్డియోమయోపతి' కూడా రావచ్చు.

**పునరుత్పత్తి:** పురుషుల్లో, స్త్రీలలో పునరుత్పత్తి అవయవాల పరిమాణం కుంచించుకుపోతుంది. ఫలితంగా పురుషుల్లో వీర్యకణాల సంఖ్య, స్త్రీలల్లో అండాల సంఖ్య తగ్గుతుంది.

**మానసిక సమస్యలు:** మద్యానికి బానిసలైనవారిలో డిప్రెషన్ తలెత్తుతుంది. దాని నుంచి తప్పించుకోవడం కోసం తిరిగి మద్యాన్నే ఆశ్రయిస్తూ ఉంటారు. వీరి చేత మద్యం మాన్పించే ప్రయత్నం చేస్తే విత్‌డ్రాయల్ సింప్టమ్స్ తీవ్రమై, కొంతమందిలో కార్డియాక్ అరెస్ట్ (గుండె ఆగిపోవడం)కూ దారి తీసే ప్రమాదం ఉంటుంది.

### ఎంత తాగవచ్చు?

వారంలో రెండు డ్రింకులు... అంటే సుమారు 50 మిల్లీ లీటర్ల (రెండు పెగ్గులు) మద్యం మించకూడదు. ఒక పింట్ బీర్ ఒక యూనిట్ ఆల్కహాల్‌తో సమానం. ఒక యూనిట్ అంటే 10 మిల్లీ లీటర్ల లేదా 8 గ్రాముల స్వచ్ఛమైన ఆల్కహాల్. 25 మిల్లీ లీటర్ల విస్కీలో ఈ పరిమాణంలో ఆల్కహాల్ ఉంటుంది. అంటే వారంలో ఒకసారి 50 మిల్లీ లీటర్ల (రెండు పెగ్గులు)కు మించి మద్యం తీసుకోకూడదు. అలాగే ఇంతే పరిమాణంలో ఆల్కహాల్ పరిమాణం ఒక బీరు సీసాలో ఉంటుంది. కాబట్టి వారంలో ఒక్క బీరుకు మించి తాగకూడదు.

### అపోహలు - వాస్తవాలు!



మద్యం గురించి ఎవరికి అనుకూలమైన వాదనలు వాళ్లు వినిపిస్తూనే ఉంటారు. దాని ప్రభావం ఆరోగ్యం మీద పడకుండా తప్పించుకోవడం కోసం ఎక్కడో విన్నవీ, చదివినవీ ఆచరిస్తూ ఉంటారు. విస్కీ కంటే బీరు మేలనీ, దాని కంటే వైన్ సురక్షితమనీ... ఇలా లెక్కలేనన్ని నమ్మకాలు ఉంటూ ఉంటాయి. కానీ నిజాలు ఇందుకు పూర్తి విరుద్ధం!

★ ★ ★

**అపోహ:** హార్డ్ లిక్కర్ కంటే బీర్లు సురక్షితం!

**వాస్తవం:** బీరు సీసా మీద ముద్రించి ఉండే ఆల్కహాల్ పరిమాణం 5%. ఇది 100 మిల్లీ లీటర్ల బీరులో ఉండే ఆల్కహాల్ శాతం. దీన్ని బట్టి 650 మిల్లీ లీటర్ల బీరు సీసాలో సుమారుగా 32.5 గ్రాముల ఆల్కహాల్ ఉంటుందని గ్రహించాలి. ఇది మూడు పెగ్గుల హార్డ్ లిక్కర్‌తో సమానం.

★ ★ ★

**అపోహ:** మద్యంతో పాటు సరిపడా తింటే మందు దుష్ప్రభావం ఉండదు.

**వాస్తవం:** పోషకాహారం తీసుకునేవాళ్లు, తీసుకోనివాళ్లు ఇద్దరి కాలేయాల మీద మద్యం ప్రభావంలో స్వల్ప తేడా ఉంటుంది. అయితే ఇందుకోసం పౌష్టికాహారంగా నూనె తక్కువగా వాడి, ఇంట్లో వండిన, మాంసకృత్తులు, ఖనిజలవణాలతో కూడిన ఆహారం తీసుకోవాలి.

**అపోహ:** రెడ్ వైన్ లేదంటే బ్రాందీ గుండెకు మంచిది!

**వాస్తవం:** రెడ్ వైన్ తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయి తగ్గి, గుండెకు మేలు జరుగుతుందని 2000వ సంవత్సరంలో ఒక అధ్యయనంలో వెల్లడైంది. అయితే ఆ అధ్యయనాన్ని ఇంతవరకూ ఎవరూ నిరూపించలేకపోయారు. పైగా రెడ్ వైన్‌లో కూడా ఆల్కహాల్ ఉంటుంది. కాబట్టి మిగతా అన్ని మద్యాలకు లాగే, పరిమితంగా తీసుకోవడం శ్రేయస్కరం. అలాగే బ్రాందీ కూడా!

★ ★ ★

**అపోహ:** మద్యంలోకి సోడా కంటే నీళ్లు మేలు!

**వాస్తవం:** సోడాలో క్యాలరీలు ఉండవు. కాబట్టి సోడా వల్ల లావవుతాం అనేది అపోహ మాత్రమే! సోడా, నీళ్లు... ఏది కలిపి మద్యం తాగినా ప్రభావం సమానంగానే ఉంటుంది.

★ ★ ★

**అపోహ:** బీరు తాగి ఆరోగ్యంగా లావెక్కవచ్చు!

**వాస్తవం:** బీరులో క్యాలరీలతో పాటు ఆల్కహాల్ కూడా ఉంటుంది. కాబట్టి లావయినా ఆరోగ్యపరమైన చెడు జరిగే వీలూ ఉంటుంది. అలాగే బీరుతో ప్రతి ఒక్కరూ లావవుతారు అనీ చెప్పలేం! బీరు బదులు పౌష్టికాహారం, వ్యాయామంతో అంతకంటే మెరుగ్గా, ఆరోగ్యంగా లావయ్యే వీలుంది.

★ ★ ★

**అపోహ:** నింపాదిగా తాగడం క్షేమం!

**వాస్తవం:** ఎంత వేగంగా తాగినా, ఎంత నింపాదిగా తాగినా... ఎంత తాగారు? అనేది కీలకం. తాగే ఆల్కహాల్ మీద దుష్ప్రభావాలు ఆధారపడి ఉంటాయి.



**- డాక్టర్ సోమశేఖర రావు**
గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, హైదరాబాద్

## లిటిల్స్

### పదాలు సరిచేయండి




### చుక్కలు కలిపి రంగులు వేయండి



### జతలేని బొమ్మ ఏది?



### 5 తేడాలు గుర్తించండి



### డైలీ సుడోకు -232

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | |
| 8 | | 3 | 6 | 9 | | | | |
| | 5 | 1 | 8 | | 4 | | | 6 |
| | 8 | | | 2 | 9 | | 7 | |
| 5 | | | | | | | | 9 |
| | 2 | | 7 | 6 | | | 4 | |
| 6 | | | 3 | | 5 | 1 | 8 | |
| | | | | 1 | 8 | 6 | | 7 |
| | | | | | | | | |

**ఎలా పూరించాలి?**

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

**సుడోకు - 231 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 6 | 7 | 3 | 8 | 4 | 1 | 9 | 5 |
| 5 | 3 | 9 | 1 | 7 | 6 | 2 | 8 | 4 |
| 8 | 4 | 1 | 9 | 2 | 5 | 3 | 6 | 7 |
| 3 | 1 | 6 | 7 | 4 | 2 | 8 | 5 | 9 |
| 7 | 9 | 5 | 8 | 1 | 3 | 6 | 4 | 2 |
| 4 | 8 | 2 | 6 | 5 | 9 | 7 | 3 | 1 |
| 6 | 5 | 3 | 2 | 9 | 7 | 4 | 1 | 8 |
| 1 | 7 | 4 | 5 | 6 | 8 | 9 | 2 | 3 |
| 9 | 2 | 8 | 4 | 3 | 1 | 5 | 7 | 6 |


ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రకాశ్ జవదేకర్, నాగ్ అశ్విన్


రాహుల్ రవీంద్రన్

# జాతీయ అవార్డులందుకొన్న విజేతలు


సంజయ్‌లీలా భన్సాలీ


ఆదిత్య ధర్


అక్షయ్‌కుమార్


విక్కీ కౌశల్

**జాతీయ చలనచిత్ర అవార్డుల వేడుక సోమవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగింది. ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు విజేతలకు అవార్డులు అందజేశారు. ఉత్తమ నటుడు అవార్డ్‌ను విక్కీ కౌశల్ (ఉరి), ఆయుష్మాన్ ఖురానా (అంధాధూన్) సంయుక్తంగా అందుకొన్నారు. ఉత్తమ నటి అవార్డ్‌ను కీర్తి సురేశ్ (మహానటి) స్వీకరించారు సామాజిక అంశాల ఆధారంగా రూపుదిద్దుకొన్న 'ప్యాడ్‌మ్యాన్' ఉత్తమ చిత్రంగా ఎంపికయింది. నటుడు అక్షయ్‌కుమార్ ఆ అవార్డ్‌ను స్వీకరించారు.. ఇతర విజేతలకు ఉప రాష్ట్రపతి అవార్డులు అందజేశారు.**

## జ్వరంతో ఉన్నా.. హాజరు కాలేను

దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్ విజేత బిగ్ బి అమితాబ్ బచ్చన్ చలనచిత్ర జాతీయ అవార్డుల కార్యక్రమానికి అనారోగ్యం కారణంగా హాజరు కాలేకపోతున్నట్లు ఆదివారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'జ్వరంతో ఉన్నా.. ప్రయాణం చేసే పరిస్థితి లేదు.. అందుకే ఢిల్లీలో జరిగే అవార్డుల కార్యక్రమానికి హాజరుకాలేను.. ఇది చాలా దురదృష్టకరం' అని ఆయన ట్విట్టర్‌లో రాసుకొచ్చారు. జాతీయ అవార్డుల విజేతకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ నెల 29న తేనీటి విందు ఇవ్వనున్నారు. ఆ కార్యక్రమంలో అమితాబ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును అందజేస్తామని కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ వెల్లడించారు.

## చిత్రాల్లో అసభ్యత, హింస వద్దు

**- వెంకయ్య నాయుడు**

ఎంతో మంది జనాలను, ముఖ్యంగా యువతను ప్రభావితం చేసే సినిమాల్లో హింసాత్మక, అసభ్యకరమైన సన్నివేశాలను చూపించవద్దని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. సామాజిక మార్పు, ప్రజలను చైతన్యవంతం చేసేలా, శ్రేయస్సును పెంచేలా సినిమా మాధ్యమాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అవార్డుల వేడుకలో ఆయన మాట్లాడుతూ... మహిళలపై దాడులకు వ్యతిరేకంగా మంచి సందేశాలను ఇవ్వాలని, అందరూ మహిళలను గౌరవప్రదంగా భావించాలని పిలుపునిచ్చారు. సందేశాత్మక చిత్రాలను వీక్షకులు ఆమోదించబోరని అనుకోవడం సరికాదని సూచించారు. సామాజిక సందేశాలు ఇచ్చే చిత్రాలు వినోదపరంగానూ, వాణిజ్యపరంగానూ విజయవంతమవుతాయని అభిప్రాయడ్డారు. సినిమాల్లో పాత్రలు, డైలాగులు, వేషధారణ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉండేలా చూడాలని చిత్ర నిర్మాతలు, డైరెక్టర్లకు సూచించారు. కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసేలా, ప్రజాస్వామిక పరిపాలనను ప్రోత్సహించేలా సినిమాలు ఉండాలన్నారు. ప్రపంచానికి భారతీయతను చాటడంలో సినిమాలు కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. సినిమాకు భౌగోళికమైన, మతపరమైన సరిహద్దులు ఉండదని, అది విశ్వభాషను వ్యక్తం చేస్తూ భావోద్వేగాలను తాకుతుందని వివరించారు.


కీర్తి సురేశ్, ఆయుష్మాన్ ఖురానా, విక్కీ కౌశల్, అక్షయ్ కుమార్

## ఉత్తమ నటి అవార్డును అందుకున్న కీర్తి సురేశ్

దివంగత నటి సావిత్ర జీవితచరిత్ర ఆధారంగా రూపొందిన 'మహానటి' సినిమాలో సావిత్రి పాత్ర పోషించిన కీర్తి సురేశ్ జాతీయ ఉత్తమ నటి అవార్డును అందుకున్నారు. అలాగే ప్రాంతీయ ఉత్తమ తెలుగు చిత్రం అవార్డుకు ' మహానటి' సినిమా ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ అవార్డును ఆ చిత్రదర్శకుడు నాగ్ అశ్విన్ స్వీకరించారు. ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ అవార్డును ఇంద్రాక్షి పట్నాయక్, గౌరాంగ్ షా, అర్చనా రావు ('మహానటి') అందుకున్నారు. 'చీ లా సౌ' సినిమాకు లభించిన ఉత్తమ స్క్రీన్ ప్లే అవార్డును ఆ సినిమా స్క్రీన్‌ప్లే రచయిత రాహుల్ రవింద్రన్ అందుకున్నారు. 'రంగస్థలం' సినిమా ఉత్తమ ఆడియోగ్రఫీ అవార్డును రాజా కృష్ణన్ ఎంఆర్, ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్‌గా ' అ!' సినిమాకు పనిచేసిన రంజిత్, ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్ అవార్టును సృష్టి క్రియేటివ్ స్టూడియో ప్రతినిధులు అందుకున్నారు.

**- ఆంధ్రజ్యోతి, న్యూఢిల్లీ**













# ఆఫీస్ స్పేస్‌కు భలే గిరాకీ



## 7 ప్రధాన నగరాల్లో అద్దెకు 4.65 కోట్ల చదరపు అడుగులు

### ఇది సరికొత్త రికార్డు.. ఏడాదిలో 40 శాతం వృద్ధి

### హైదరాబాద్‌లో లీజుకు తీసుకున్నది కోటి ఎస్‌ఎఫ్‌టీలకు పైనే.. జేఎల్‌ఎల్ వెల్లడి

న్యూఢిల్లీ: ఈ ఏడాదిలో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ జోరుగా పెరిగింది. గత ఏడాదితో పోల్చితే నికరంగా కంపెనీలు అద్దెకు తీసుకున్న ఆఫీస్ ప్రదేశం 40 శాతం పెరిగింది. ఏడాదికాలంలో ఏడు ప్రధాన నగరాల్లో 4.65 కోట్ల చదరపు అడుగుల ప్రదేశాన్ని కంపెనీలు అద్దెకు తీసుకున్నాయి. ఇది సరికొత్త రికార్డు కావడం విశేషం. ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలతోపాటు కోవర్కింగ్ నిర్వాహకుల నుంచి అధిక డిమాండ్ ఏర్పడినట్టు ప్రాపర్టీ కన్సల్టెంట్ జేఎల్‌ఎల్ ఇండియా వెల్లడించింది. 2018 సంవత్సరంలో ఏడు ప్రధాన నగరాల్లో (హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, చెన్నై, పుణే, కోల్‌కతా) కంపెనీలు అద్దెకు తీసుకున్న ఆఫీస్ స్పేస్ 3.32 కోట్ల చదరపు అడుగులుగా ఉంది.

- "భారత ఆఫీస్ మార్కెట్ సరికొత్త బెంచ్‌మార్క్‌ను ఏర్పరిచింది. నికరంగా అద్దెకు తీసుకున్న ఆఫీస్ ప్రదేశంలోనేకాకుండా కొత్తగా పూర్తి చేసిన వాటిలోనూ చరిత్రాత్మక గరిష్ఠ స్థాయి నమోదైంది. ఏడాది కాలంలో 4.65 కోట్ల చదరపు అడుగుల (ఎస్‌ఎఫ్‌టీ) ప్రదేశాన్ని కంపెనీలు అద్దెకు తీసుకున్నాయి. 2019 సంవత్సరంలో దాదాపు 5.2 కోట్ల చదరపు అడుగుల గ్రేడ్ ఏ ఆఫీస్ ప్రదేశం పూర్తయింది" అని జేఎల్‌ఎల్ పేర్కొంది.
- ఆఫీస్ ప్రదేశం కొత్త సప్లయ్ 45 శాతం పెరిగి 3.57 కోట్ల చదరపు అడుగుల నుంచి 5.16 కోట్ల చదరపు అడుగులకు చేరుకుంది. ఖాళీగా ఉన్న ఆఫీస్ ప్రదేశం 13 శాతం తగ్గింది.
- ఐటీ/ఐటీఈఎస్ కంపెనీలు, కోవర్కింగ్ ఆపరేటర్ల వల్ల ఈ నగరాల్లో ఆఫీస్ ప్రదేశానికి డిమాండ్ ఏర్పడింది. అద్దెకు తీసుకున్న ప్రదేశంలో ఐటీ/ఐటీఈఎస్ రంగం వాటా 42 శాతం ఉండగా.. కోవర్కింగ్ ఆపరేటర్ల వాటా 14 శాతంగా ఉంది.
- ఈ ఏడాదిలో నికరంగా అద్దెకు తీసుకున్న ఆఫీస్ ప్రదేశంలో ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, హైదరాబాద్ నగరాల వాటా దాదాపు 70 శాతంగా ఉంది.
- గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాదిలో ముంబైలో నికరంగా అద్దెకు తీసుకున్న ఆఫీస్ స్పేస్ 2 శాతం క్షీణించింది. ఇక్కడ సప్లయ్ ఆశించిన స్థాయిలో లేదు.
- హైదరాబాద్‌లో 1.05 కోట్ల చదరపు అడుగులు అద్దెకు తీసుకోవడం గమనార్హం. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలోనే 50 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని కంపెనీలు లీజుకు తీసుకున్నాయి.
- ఢిల్లీ-ఎన్‌సీఆర్ మార్కెట్లో రికార్డు స్థాయిలో దాదాపు 1.1 కోట్ల చదరపు అడుగుల స్థలాన్ని కంపెనీలు అద్దెకు తీసుకున్నాయి.
- రీట్స్ నేపథ్యంలో డెవలపర్లు మరింత నాణ్యమైన ఆఫీస్ ప్రదేశాలను అభివృద్ధి చేసే అవకాశం ఉందని జేఎల్‌ఎల్ ఇండియా సీఈఓ, కంట్రీ హెడ్ రమేష్ నాయర్ తెలిపారు. భవిష్యత్‌లో డేటా సెంటర్ పరిశ్రమ నుంచి ఎక్కువ డిమాండ్ ఏర్పడవచ్చని ఆయన తెలిపారు. స్థలాన్ని తీసుకునే కంపెనీలు వ్యయాలు, నైపుణ్యం కలిగిన సిబ్బంది, నిబంధనలు, ఉత్పాదకత తదితర అంశాలపై దృష్టిసారించనున్నట్టు చెప్పారు. ఆఫీస్ స్పేస్ రంగంలో పెట్టుబడుల సెంటిమెంట్స్ బలంగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న ప్రదేశం తగ్గినట్టు తెలిపారు.

# మిస్త్రీ కేసులో మమ్మల్నీ చేర్చండి

- తీర్పులో 'అక్రమం' పదాన్ని తొలగించండి..
- ఎన్‌సీఎల్‌ఏటీని కోరిన ఆర్‌ఓసీ ముంబై





న్యూఢిల్లీ: టాటా సన్స్-సైరస్ మిస్త్రీ కేసు కొత్త మలుపు తిరిగింది. ఈ కేసులో తమను కక్షిదారుగా చేర్చాలని జాతీయ కంపెనీల చట్టం అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ)ను రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌ఓసీ) ముంబై విభాగం కోరింది. అంతేకాదు ఈ కేసుకు సంబంధించి గతవారంలో ఇచ్చిన తీర్పులో స్వల్ప సవరణలను సైతం కోరింది. తీర్పు కాపీలో పేర్కొన్న 'అక్రమం' అనే పదంతో పాటు 'ఆర్‌ఓసీ సాయంతో' అనే వాక్యాన్ని సైతం తొలగించాలని అప్పిలేట్ ట్రిబ్యునల్ వద్ద దాఖలు చేసిన పిటిషన్‌లో ఆర్‌ఓసీ పేర్కొంది. 2016 అక్టోబరులో టాటా సన్స్ బోర్డు సైరస్ మిస్త్రీని ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కాలంలో పలు టాటా సంస్థల బోర్డుల నుంచి కూడా తప్పించింది. ఛైర్మన్‌గా తనను తొలగించడాన్ని సవాలు చేస్తూ మిస్త్రీ తొలుత జాతీయ కంపెనీల చట్టం ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ని ఆశ్రయించారు. ట్రిబ్యునల్ టాటాల నిర్ణయాన్నే సమర్థించడంతో అప్పిలేట్ ట్రిబ్యునల్ గడప తొక్కారు.

సైరస్ మిస్త్రీ తొలగింపు తర్వాత టాటా సన్స్ తాత్కాలిక ఛైర్మన్‌గా రతన్ టాటా బాధ్యతలు చేపట్టారు. కొద్ది నెలలకు ఎన్ చంద్రశేఖరన్‌ను టాటా గ్రూపు ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా నియమించారు. అయితే ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్ చంద్రశేఖరన్ నియామకం అక్రమమని గతవారం తీర్పులో ఎన్‌సీఎల్‌ఏటీ పేర్కొంది. అంతేకాదు టాటా సన్స్ హోదాను ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి తిరిగి పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మార్చాలని ఆర్‌ఓసీని ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించి ఆర్‌ఓసీ ముంబై సోమవారం దాఖలు చేసిన పిటిషన్‌ను అప్పిలేట్ ట్రిబ్యునల్ స్వీకరించిందని, శీతాకాల సెలవుల అనంతరం జనవరి 2న విచారణ చేపట్టవచ్చని కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు.

## కార్వీ ఫైనాన్షియల్‌కు రూ.5 లక్షల జరిమానా

న్యూఢిల్లీ: కార్వీ గ్రూప్‌పై సెబీ మరోసారి కొరడా ఝుళిపించింది. ఒక కంపెనీకి చెందిన ప్రమోటర్ల నుంచి తాకట్టు పెట్టుకున్న షేర్ల విషయం వెల్లడించనందుకు కార్వీ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనే కంపెనీపై రూ.5 లక్షల జరిమానా విధించింది. రిగాలియా రియల్టీ అనే కంపెనీ ప్రమోటర్లు కంపెనీ ఈక్విటీలో తమకున్న 55.56 శాతం షేర్లను కార్వీ ఫైనాన్షియల్ సర్వీసెస్ దగ్గర తాకట్టు పెట్టి రుణం తీసుకున్నారు. తర్వాత కంపెనీ ఈ రుణం చెల్లించడంతో తన తాకట్టులో ఉన్న రిగాలియా రియల్టీ కంపెనీ షేర్లను కార్వీ ఫైనాన్షియల్ విడుదల చేసింది. నిబంధనల ప్రకారం కార్వీ ఈ విషయాన్ని అధికారికంగా ఆ కంపెనీకి, స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలపాలి. ఆరేళ్ల 11 నెలల వరకు కార్వీ ఫైనాన్షియల్ ఈ విషయాన్ని వెల్లడించలేదు. దీంతో కంపెనీకి రూ.5 లక్షల జరిమానా విధిస్తూ సెబీ ఉత్తర్వులు జారీ చేసింది.

## ఫిక్కీ ప్రెసిడెంట్‌గా సంగీతా రెడ్డి



న్యూఢిల్లీ: పరిశ్రమల చాంబర్ ఫిక్కీ ప్రెసిడెంట్ (2019-20 సంవత్సరానికి)గా అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతా రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ప్రెసిడెంట్‌గా ఉన్న హెచ్ఎస్ఐఎల్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ సోమాని నుంచి ఆమె బాధ్యతలు చేపట్టారు. వాల్ట్ డిస్నీ కంపెనీ అపాక్ ప్రెసిడెంట్, స్టార్ అండ్ డిస్నీ ఇండియా ఛైర్మన్ ఉదయ్ శంకర్ ఫిక్కీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఫిక్కీ వైస్ ప్రెసిడెంట్‌గా హెచ్‌యూఎల్ సీఎండీ సంజీవ్ మెహతా నియమితులయ్యారు. ఫిక్కీ 92వ వార్షిక సర్వసభ్య సమావేశంలో భాగంగా దేశ ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవడానికి సంబంధించిన రోడ్ మ్యాప్ రూపొందించామని, వివిధ అంశాలపై చర్చించామని సంగీతా రెడ్డి తెలిపారు.

## మార్కెట్‌లో మైనర్ రియాక్షన్

**టెక్ వ్యూ**

నిఫ్టీ మైనర్ కరెక్షన్‌లో ప్రారంభమై మద్దతు స్థాయి 12200 వరకు దిగజారింది. చివరి సెషన్‌లో ఆస్థాయి నుంచి నిలకడగా రికవరీ సాధిస్తూ డే గరిష్ఠ స్థాయికి చేరువలో నిలకడగా క్లోజయింది. కనిష్ఠ స్థాయిల్లో కొనుగోళ్ల మద్దతు లభించిందనేందుకు ఇది సంకేతం. ఇంట్రాడే కనిష్ఠ స్థాయిల నుంచి సాధించిన ఈ రికవరీతో డౌన్‌ట్రెండ్‌ను నివారించుకుంది. కాని గత రెండు రోజులుగా గరిష్ఠ స్థాయిల్లో మాత్రం నిరోధం ఎదుర్కొంటోంది. కదలికలు పరిమితంగానే ఉన్నాయి. స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను నిలబెట్టుకోవాలంటే మరొక్క రోజు బలంగా నిలదొక్కుకోవడం అవసరం.

**మంగళవారం స్థాయిలివే...**

**నిరోధం : 12300 మద్దతు : 12200**

- మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించాలంటే ప్రధాన నిరోధం 12300 కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. మానసిక అవధి 12400.
- మద్దతు స్థాయి 12200 కన్నా దిగజారితే మైనర్ బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 12150. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్‌లో పడవచ్చు.

**సూచన :** ఓవర్‌బాట్ స్థితి ఏర్పడడం అప్రమత్త సంకేతం. స్వల్పకాలిక ట్రేడర్లు తాజా బై పొజిషన్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

■ వి.సుందర్ రాజా

## ఉదయం సెషన్ బలహీనం

**ఆస్ట్రో వ్యూ**

**తిథి:** మార్గశిర బహుళ త్రయోదశి; నక్షత్రం : అనూరాధ

**అప్రమత్తం:** భరణి, పుబ్బ, పూర్వాషాఢ నక్షత్ర జాతకులు, ధనుస్సు, మేష రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు: 11.05**

**ధోరణి:** నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 11.15 వరకు, తిరిగి 2.25 నుంచి ముగింపు వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. మధ్యలో 12.45 వరకు మెరుగ్గాను, ఆ తర్వాత 2.25 వరకు నిలకడగాను ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం:** నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ఎటిపి కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 12.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం : 12300, 12345**

**మద్దతు స్థాయిలు : 12220, 12185**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి

www.thefinancialastrologer.blogspot.in

# 'జెట్'పై హైదరాబాద్ సంస్థ ఆసక్తి?

## బరిలో టర్బో ఏవియేషన్!



న్యూఢిల్లీ: దివాలా తీసిన జెట్ ఎయిర్‌వేస్‌ను చేజిక్కించుకునేందుకు హైదరాబాద్‌కు చెందిన టర్బో ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆసక్తిగా ఉన్నట్లు తెలిసింది. జెట్ కొనుగోలుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నదని, బిడ్డింగ్‌లో పాల్గొనడంపై ఇంకా తుది నిర్ణయానికి రావాల్సి ఉందని సమాచారం. కొత్తగా మరో రెండు కంపెనీలు జెట్‌పై ఆసక్తి చూపాయని ఎయిర్‌లైన్స్ దివాలా పరిష్కార నిపుణుడు (ఆర్‌పీ) ఆశిష్ చావ్‌చరియా ఈ నెల 17న ట్రిబ్యునల్‌కు తెలిపారు. అందులో టర్బో ఏవియేషన్ ఒకటని తెలిసింది. గత వారంలో బ్రిటన్‌కు చెందిన ఓ గ్రూపు నుంచి 10 కోట్ల పౌండ్ల ఫండింగ్ సేకరించిన టర్బో ఏవియేషన్.. ట్రూస్టార్ పేరుతో వచ్చే ఏడాది ద్వితీయార్ధానికల్లా విమానయాన సేవలను ప్రారంభించాలనుకుంటోంది.

### మళ్లీ కొత్తగా బిడ్ల ఆహ్వానం

జెట్ ఎయిర్‌వేస్ విక్రయానికి మళ్లీ కొత్తగా ఆసక్తి వ్యక్తీకరణల (ఈఓఐ)ను ఆహ్వానించాలని ఎయిర్‌లైన్స్ రుణదాతల కమిటీ (సీఓసీ) నిర్ణయించింది. సోమవారం నాడు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు కంపెనీ ఈ సమాచారాన్ని అందించింది. కొత్త బిడ్లను ఆహ్వానించే విషయమై త్వరగా నిర్ణయం తీసుకోవాలని గతవారంలో జాతీయ కంపెనీల చట్టం ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) సీఓసీని నిర్దేశించింది. జెట్ ఎయిర్‌వేస్ వెబ్‌సైట్ ప్రకారం.. కొనుగోలుకు ఆసక్తిగా ఉన్న వారు జనవరి 6కల్లా ఆసక్తి వ్యక్తీకరణను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 8నాటికి దివాలా పరిష్కార ప్రణాళికను సమర్పించాలి.

### పరిష్కారానికి మరో 90 రోజుల గడువు

జెట్ దివాలా పరిష్కార చర్యలకు తొలుత ఇచ్చిన 180 రోజుల గడువు ముగిసింది. దాంతో ట్రిబ్యునల్ మరో 90 రోజుల అదనపు గడువు కల్పించింది. ఇప్పటివరకు జెట్ కొనుగోలుకు సినర్జీ గ్రూపు మాత్రమే బిడ్ దాఖలు చేసింది. అయితే, కొనుగోలుపై తుది నిర్ణయం తీసుకునేందుకు సినర్జీ మరింత సమయం కోరడంతోనే మళ్లీ కొత్తగా బిడ్లను ఆహ్వానించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

### ఏప్రిల్‌లో మూతపడ్డ ఎయిర్‌లైన్స్

జెట్ ఎయిర్‌వేస్.. రుణాల భారం, నిధుల కొరత కారణంగా ఏప్రిల్‌లో సేవలను నిలిపివేసింది. దాంతో రుణాలిచ్చిన బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు తమ బకాయిలను రాబట్టుకునేందుకు ఎయిర్‌లైన్స్‌పై దివాలా పరిష్కార చర్యలు ప్రారంభించాయి.

### హిందూజాలూ ఆసక్తిగా..!

జెట్ ఎయిర్‌వేస్ కొనుగోలుకు హిందూజా గ్రూపు ఆసక్తిగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఎయిర్‌లైన్స్ విక్రయం కోసం గతంలో కేంద్రంతోపాటు రుణదాతలు కూడా ఈ గ్రూపును సంప్రదించారు. జెట్‌లో ఆర్థిక అవకతవకలపై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో రిస్క్ తీసుకోవడం ఇష్టం లేక హిందూజా గ్రూపు బిడ్డింగ్‌లో పాల్గొనలేదు. ఈ దఫా బిడ్ సమర్పించే అవకాశాలెక్కువగా ఉన్నాయి.

### ఎయిర్ ఇండియాకు స్పందన కరువు

ప్రభుత్వ రంగ విమాన సంస్థ ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించేందుకు మోదీ సర్కారు చేస్తున్న ప్రయత్నాలు ఇప్పట్లో ఫలించే అవకాశాలు కన్పించడం లేదు. ఈ ఎయిర్‌లైన్స్‌లో వాటా విక్రయం కోసం కేంద్రం ఈమధ్య సింగపూర్, లండన్‌లో రోడ్‌షోలు నిర్వహించింది. అయితే, ఇన్వెస్టర్ల నుంచి మాత్రం అంతగా స్పందన రాలేదని సమాచారం. విదేశాలతో పోలిస్తే ముంబైలో నిర్వహించిన రోడ్‌షోలోనే కాస్త మెరుగైన స్పందన లభించిందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

## అభిబస్‌లో అద్దెకు బస్సులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అద్దెకు బస్సులను అందించే కొత్త సేవను అభిబస్ డాట్‌కామ్ ప్రారంభించింది. ఇక బస్సులు, చిన్న బస్సులు, 14-52 సీట్ల సామర్థ్యం కలిగిన టెంపో ట్రావెలర్ వాహనాలను అద్దెకు తీసుకోవచ్చని అభిబస్ వ్యవస్థాపకుడు, సీఈఓ సుధాకర్ రెడ్డి తెలిపారు. దేశంలో బస్ రెంటల్ మార్కెట్ అసంఘటిత రంగంలో ఉంది. ఆఫ్‌లైన్‌లో జరుగుతోందన్నారు. వాహనాలను బుక్ చేసుకోవడంలో ఇబ్బందులు, ధరల విధానాల్లో పారదర్శకతలోపం వంటి సమస్యలను వినియోగదారులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రస్తుతం అభిబస్ 500 మంది బస్ ఆపరేటర్లతో ఒప్పందం కుదుర్చుకుంది. వీరి వద్ద 10 వేలకు పైగా బస్సులున్నాయి. అభిబస్ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా వీటిని బుక్ చేసుకోవచ్చు.

## జియో
## 2020 హ్యాపీ న్యూ ఇయర్ ఆఫర్

ముంబై: రిలయన్స్ జియో.. స్మార్ట్‌ఫోన్, జియో ఫోన్ కస్టమర్ల కోసం '2020 హ్యాపీ న్యూ ఇయర్ ఆఫర్'ను సోమవారంనాడు ప్రకటించింది. ఇందులో భాగంగా స్మార్ట్ ఫోన్ కస్టమర్లు రూ.2,020 చెల్లిస్తే ఏడాది పాటు అపరిమిత వాయిస్ కాల్స్‌తోపాటు రోజుకు 1.5 జీబీ డేటాను పొందవచ్చని తెలిపింది. ఎస్‌ఎంఎస్ సర్వీసులతో పాటు జియోయాప్స్‌ను వాడుకోవచ్చు. దీని కాలపరిమితి 365 రోజులు. మరోవైపు రూ.2,020 చెల్లిస్తే ఒక కొత్త జియో ఫోన్‌తోపాటు 12 నెలల పాటు అపరిమిత వాయిస్ సర్వీసు, రోజుకు 0.5 ఎంబీ డేటా, ఎస్ఎంఎస్, జియో యాప్స్‌ను పొందవచ్చని తెలిపింది. మంగళవారం నుంచి ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. జియోయేతర వాయిస్ కాల్స్‌పై ఎఫ్‌యూపీ అమలవుతుందని కంపెనీ తెలిపింది.

# చిన్న సంస్థలకు 'ఫ్రూగల్' అండ!



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఖాతాదారులతో రిలేషన్ షిప్ మేనేజ్‌మెంట్ చేయడానికి పెద్ద కంపెనీలకు తగిన టెక్నాలజీ వ్యవస్థ ఉంటుంది. ఖాతాదారుల అభిరుచులు, అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటే లాయల్టీ కార్యక్రమాలను ఆ కంపెనీలు ప్రవేశపెడుతూ ఉంటాయి. రివార్డు పాయింట్లతో ఖాతాదారులను ఆకర్షిస్తాయి. అయితే.. అటువంటి లాయల్టీ మార్కెటింగ్, రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్‌కు తగిన వ్యవస్థలు చిన్న, మధ్య స్థాయి కంపెనీలకు ఉండవు. ఏర్పాటు చేసుకోవాలన్నా చాలా వ్యయం అవుతుంది. అటువంటి కంపెనీలకు డిజిటల్ లాయల్టీ కార్యక్రమాలు, రిలేషన్ షిప్ మేనేజ్‌మెంట్ సేవలను హైదరాబాద్‌కు చెందిన ఫ్రూగల్ అందిస్తోంది. ఖాతాదారులను ఆకట్టుకోవడానికి వ్యూహాత్మక కన్సల్టెంగ్ సేవలను కూడా అందిస్తున్నట్లు ఫ్రూగల్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ జీవన్ చౌదరి చెప్పారు. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీలతో ఖాతాదారులకు సంబంధించిన అన్ని అంశాలను విశ్లేషించి రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్‌కు దోహదం చేసే యాప్‌ను మూడు ప్యాకేజీల్లో అందిస్తున్నట్లు వివరించారు. 350 బ్రాండ్‌లకు 2,000 లొకేషన్లలో (స్టోర్లు) డేటాను సమీకరించి విశ్లేషించి కస్టమర్ మేనేజిమెంట్‌లో ఫ్రూగల్ మద్దతు ఇస్తున్నట్లు చౌదరి తెలిపారు. ఇందులో అధిక భాగం బ్రాండ్‌లు హైదరాబాద్‌లోనే ఉన్నాయని.. క్రీమ్ స్టోన్, బిగ్ సి, లాట్, థిక్‌షేక్ వంటి కంపెనీలకు సేవలు అందిస్తున్నామని చెప్పారు. తాజాగా కంపెనీకి అమెరికా ఏంజిల్ ఇన్వెస్టర్ల నుంచి రూ.7 కోట్ల (మిలియన్ డాలర్లు) నిధులు లభించిన సందర్భంగా జీవన్ మాట్లాడారు. సంస్థను బట్టి ఒక్కో లొకేషన్ డేటాను విశ్లేషించడానికి నెలకు రూ.2,500 నుంచి రూ.10,000 వరకూ వసూలు చేస్తున్నట్లు తెలిపారు. తాజాగా సమకూరిన నిధులతో వచ్చే ఏడాది ముంబై, బెంగళూరు, గురుగ్రామ్, కోల్‌కతా, చెన్నైలకు సేవలను కంపెనీ విస్తరించనుంది. అమెరికా మదుపర్లు పెట్టుబడులు పెట్టిన నేపథ్యంలో అమెరికాలో కూడా కార్యకలాపాలను ప్రారంభించనున్నామని, అంతర్జాతీయ కంపెనీల అవసరాలకు అనుగుణంగా 'ఫ్రూగల్' ఉత్పత్తిలో మార్పులు చేయనున్నామని వివరించారు. వచ్చే ఏడాది చివరి నాటికి లొకేషన్లను 10 వేలకు పెంచుకోనున్నట్లు చెప్పారు.

## జీఎస్‌టీ కొత్త రిజిస్ట్రేషన్లపై తనిఖీ

బెంగళూరు: కొత్తగా నమోదైన 66.79 లక్షల జీఎస్‌టీ రిజిస్ట్రేషన్లను జీఎస్‌టీ మండలి తనిఖీ చేస్తోంది. ఈ రిజిస్ట్రేషన్లు నకిలీ లేదా డొల్ల కంపెనీలవై ఉండవచ్చన్న అనుమానంతో తనిఖీలు చేపట్టింది. బిహార్ డిప్యూటీ సీఎం, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ మంత్రుల బృందం(జీఓఎం) కన్వీనర్ సుశీల్ కుమార్ మోదీ ఈ విషయాన్ని తెలిపారు. "మొత్తం జీఎస్‌టీ ఆదాయంలో 66.79 లక్షల మంది పన్ను చెల్లింపుదారుల నుంచి సమకూరుతున్నది కేవలం 15 శాతమే. అంటే రూ.10,000 కోట్లు. అందుకే వీరివి సరైన రిజిస్ట్రేషన్లో కాదో తెలుసుకునేందుకు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం" అని సోమవారం బెంగళూరులో జరిగిన జీఓఎం సమావేశం అనంతరం మోదీ చెప్పారు. చాలా రాష్ట్రాల్లో అధికారులు కొత్తగా రిజిస్టర్ అయిన కంపెనీల ప్రాంతాల్లో భౌతిక తనిఖీలు జరుపుతున్నారని, కంపెనీ కార్యాలయాలను జియో ట్యాగింగ్ చేస్తున్నట్లు, వాటి ఫొటో తీసి నెట్‌వర్క్‌లో అప్‌లోడ్ చేసున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం జీఎస్‌టీ నెట్‌వర్క్‌లో యాక్టివ్‌గా ఉన్న పన్ను చెల్లింపుదారుల సంఖ్య 1.21 కోట్లకు పెరిగింది. అందులో 66.79 లక్షల మంది కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్నవారే.

# రూ.3,000 కోట్లతో కడప పారిశ్రామిక క్లస్టర్

- కేంద్రం సూత్రప్రాయ ఆమోదం

కడప (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): చెన్నై, బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా రూ.3,000 కోట్ల పెట్టుబడితో కడప పారిశ్రామిక క్లస్టర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి సూత్రప్రాయ ఆమోదం వచ్చింది. జిల్లాలోని జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్ భార్గవ ఈ విషయం వెల్లడించారు. సీఎం జగన్ ప్రోద్బలంతో కడపను ఈ కారిడార్‌లో చేర్చి క్లస్టరు నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్టు తెలిపారు.

### త్వరలో రూ.50,000 కోట్ల భారీ పరిశ్రమ

రాష్ట్రానికి త్వరలో ఒక భారీ పరిశ్రమ రానుందని భార్గవ చెప్పారు. ఈ పరిశ్రమ పెట్టుబడులు రూ.50,000 కోట్ల వరకు ఉంటాయన్నారు. అయితే ఆ కంపెనీ పేరు, ఏ రంగానికి చెందిన పరిశ్రమ అనే విషయాలను రజత్ భార్గవ్ వెల్లడించలేదు. ఆ పరిశ్రమ ఎక్కడ ఏర్పాటు చేస్తారనే విషయాన్నీ తెలుపలేదు. అనేక తైవాన్ కంపెనీలు రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నాయన్నారు.

## ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 23వ తేదీకి.. | | విజయవాడ | 455 |
| హైదరాబాద్ | 425 | విశాఖపట్నం | 475 |
| 24వ తేదీకి.. | | | |
| చిత్తూరు | 448 | వరంగల్ | 428 |
| గోదావరి | 455 | డజను గుడ్లు రూ. 66 | |

## ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 96 | విజయవాడ | 98 |
| వరంగల్ | 96 | గుంటూరు | 98 |
| మహబూబ్‌నగర్ | 96 | ఒంగోలు | 100 |
| కరీంనగర్ | 96 | చిత్తూరు | 91 |
| కర్నూలు | 96 | నెల్లూరు | 91 |
| విశాఖపట్నం | 102 | అనంతపురం | 87 |
| గోదావరి | 97 | | |

## బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 38,300 | --- | 39,480 | 38,850 | 38,330 |
| క్రితం ముగింపు | 38,190 | 38,800 | 39,310 | 38,850 | 38,190 |
| 22 క్యారెట్లు | 36,480 | --- | 36,320 | 35,980 | 36,510 |
| క్రితం ముగింపు | 36,410 | 36,000 | 36,160 | 35,980 | 36,370 |
| వెండి (కిలో) | 45,400 | --- | 46,400 | 46,100 | 48,800 |
| క్రితం ముగింపు | 44,900 | 46,000 | 45,600 | 45,800 | 48,200 |

## ఏపీ, తెలంగాణలో ఎయిర్‌టెల్
## వాయిస్ ఓవర్ వైఫై సేవలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో భారతీ ఎయిర్‌టెల్ వాయిస్ ఓవర్ వైఫ్ సేవలు ప్రారంభించింది. 'ఎయిర్‌టెల్ వైఫై కాలింగ్' పేరుతో ప్రారంభించిన ఈ సేవల వల్ల ఇండోర్‌లో సిగ్నల్స్ సరిగా అందని చోట కూడా స్పష్టమైన వాయిస్‌ను వినేందుకు అవకాశం ఉంటుందని ఎయిర్‌టెల్ ఒక ప్రకటనలో తెలిపింది. వాయిస్ కాల్స్‌కు వైఫై నెట్‌వర్క్‌ల ద్వారా ఏర్పాటు చేసే డెడికేటెడ్ చానెల్‌ను వినియోగించుకుని ఈ వినూత్న సేవలను అందిస్తున్నారు. ఏ నెట్‌వర్క్ కైనా టెల్కో గ్రేడ్ కాల్స్ చేసుకోవచ్చని భారతీ ఎయిర్‌టెల్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఈఓ అవనీత్ సింగ్ పురి తెలిపారు. వినియోగదారులు సులభంగా ఎయిర్‌టెల్ వైఫై కాలింగ్‌కు మారొచ్చని చెప్పారు. ఎయిర్‌టెల్ వైఫై కాలింగ్ ద్వారా చేసే కాల్స్‌కు ఎటువంటి అదనపు ఛార్జీ ఉండదు. డేటా వినియోగం కూడా చాలా తక్కువ ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారిగా ఈ సదుపాయాన్ని ఎయిర్‌టెల్ తీసుకువచ్చిందన్నారు. వైఫై ప్రాధాన్యాన్ని వీఓవైఫై కాలింగ్ మరింత పెంచుతుందని పురి వివరించారు. 'ఎయిర్‌టెల్ వైఫై కాలింగ్' సేవలకు ఎటువంటి యాప్ అవసరం లేదు. ఎయిర్‌టెల్ డాట్ ఇన్/వైఫై-కాలింగ్‌లో ఈ సేవను వినియోగించుకోవడానికి స్మార్ట్ ఫోన్ అనుకూలంగా ఉందో లేదో చూసుకోవాలి. వైఫై కాలింగ్‌ను సపోర్ట్ చేసే ఆపరేటింగ్ సిస్టమ్ సరికొత్త వెర్షన్‌ను మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. సెట్టింగ్‌లలోకి వెళ్లి 'వైఫై కాలింగ్'ను స్విచ్ ఆన్ చేయాలి. వీఓఎల్‌టీఈని కూడా ఆన్ చేయాలి.

# ఆన్‌లైన్‌లో ఫోన్ల విక్రయం

### యాప్‌ను ప్రారంభించిన బిగ్ సి
### స్టోర్లలో స్మార్ట్ టీవీలు, ఐఓటీ ఉత్పత్తులు



ఆఫర్ వివరాలను ప్రకటిస్తున్న బిగ్ సి సీఎండీ బాలు చౌదరి. పక్కన డైరెక్టర్లు స్వప్న కుమార్, బాలాజీ రెడ్డి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇప్పటి వరకూ స్టోర్ల ద్వారా మొబైల్ ఫోన్లను విక్రయిస్తున్న బిగ్ సి ఇక ఆన్‌లైన్‌లో కూడా విక్రయాలు ప్రారంభించనుంది. కంపెనీ వెబ్‌సైట్‌తోపాటు యాప్ ద్వారా ఖాతాదారులు మొబైల్‌ఫోన్లను కొనుగోలు చేయొచ్చు. స్టోర్లు కలిగిన పట్టణాల్లో బుక్ చేసిన 90 నిమిషాల్లో ఫోన్‌ను డెలివరీ చేస్తామని, ఆన్‌లైన్‌లో విక్రయాల కోసం వెబ్‌సైట్‌ను నవీకరించడంతో పాటు యాప్‌ను కూడా విడుదల చేశామని బిగ్ సి వ్యవస్థాపకుడు, సీఎండీ ఎం బాలు చౌదరి తెలిపారు. 17 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్క్రాచ్ అండ్ విన్ ఆఫర్‌ను ప్రకటించారు. డిసెంబరు 4న ప్రారంభమైన ఈ ఆఫర్ జనవరి చివరి వరకూ ఉంటుంది. ఈ సమయంలో మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసిన ఖాతాదారులు ఫ్రిజ్, వాషింగ్ మిషన్, ఎల్ఈడీ టీవీలు వంటి బహుమతులు పొందొచ్చు. ఈ ఆఫర్‌లో రూ.12 కోట్ల విలువైన బహుమతులను ఖాతాదారులు పొందనున్నారు. దీంతోపాటు రూ.5 కోట్ల విలువైన క్యాష్ పాయింట్లను ఖాతాదారులకు ఇస్తోంది. వీటిని తదుపరి కొనుగోలు సమయంలో రిడీమ్ చేసుకోవచ్చు.

### మరో 75 స్టోర్లు

తెలుగు రాష్ట్రాలు, తమిళనాడులో బిగ్ సికి మొత్తం 225 విక్రయ కేంద్రాలు ఉన్నాయి. విస్తరణ కార్యక్రమంలో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి నాటికి విక్రయం కేంద్రాలను 300కు పెంచుకోనున్నట్లు, కర్ణాటకలో స్టోర్లను ప్రారంభించనున్నట్లు చౌదరి వివరించారు. ఇందు కోసం రూ.40-50 కోట్ల పెట్టుబడులను బిగ్ సి పెట్టనుంది. ప్రస్తుతం ఏపీ, తెలంగాణాల్లో 69 పట్టణాల్లో, తమిళనాడులో 12 పట్టణాల్లో బిగ్ సి స్టోర్లు ఉన్నాయి. మొబైల్ ఫోన్లతో పాటు స్టోర్లలో స్మార్ట్ టీవీలు, ఐఓటీ ఉత్పత్తులను విక్రయించనుంది. ఇప్పటికే కొన్ని స్టోర్లలో ఎంఐ, టీసీఎల్ స్మార్ట్ టీవీలను విక్రయిస్తోంది. త్వరలో శామ్‌సంగ్ టీవీలను ప్రవేశపెట్టనుంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,000 కోట్ల టర్నోవర్‌ను బిగ్ సి నమోదు చేసింది. 2019-20కి రూ.1,100-1,200 కోట్లకు చేరగలదని. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.1,500 కోట్లకు పెరగొచ్చని చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 60 స్టోర్లు ఉన్నాయని.. విస్తరణలో భాగంగా త్వరలో 25 పెద్ద స్టోర్లను హైదరాబాద్‌లోనే ప్రారంభించనున్నట్లు బాలు చౌదరి తెలిపారు. స్మార్ట్ ఫోన్ విక్రయాల్లో రూ.10-20 వేల మధ్య ధర ఉన్న ఫోన్ల విక్రయాలు 50 శాతం ఉంటాయని వివరించారు.

# రెక్కలు రాలుతున్న కమలం

- ఏడాదిలో 5 రాష్ట్రాల్లో ఓటమి.. హిందీ బెల్ట్‌లో సగం ఔట్
- ఆధిపత్య వర్గాలను దూరం పెట్టడమే కారణమా!
- ఢిల్లీ, బిహార్, బెంగాల్.. ముందున్నవి మరిన్ని సవాళ్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 23: ఆరునెలల కిందట సార్వత్రిక ఎన్నికల్లో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ అఖండ విజయం సాధించినపుడు ఇక భారతావని అంతా కమలమే.. అని భావించారు. అమిత్ షా చాణక్యానికి ఎదురేలేదనుకున్నారు. కట్ చేస్తే.. ఇపుడు బీజేపీ ప్రభ తగ్గిపోతోంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మహారాష్ట్ర.. జార్ఖండ్..! ఇలా ఏడాదిలో ఐదు రాష్ట్రాలు చేజారిపోయాయి. ఇవన్నీ కీలక హిందీ బెల్ట్‌లోనివే. విపక్షాల తప్పిదాలతో కర్ణాటక, హరియాణాలను వశం చేసుకోగలిగింది. రెండేళ్ల క్రితం దేశంలో 69 శాతం జనాభాను బీజేపీ లేదా దాని మిత్రపక్షాలు పాలించాయి. వారి అధికారం ఆవరించిన విస్తీర్ణం 71 శాతండి ఉండేది. ఇప్పుడవి 43 శాతానికి, 35 శాతానికి పడిపోయాయి.

### జాతీయ ఓటు అసెంబ్లీకి పడలేదా..?

ఆర్టికల్ 370, పౌరసత్వ సవరణ, భావోద్వేగభరితమైన అయోధ్య సానుకూల తీర్పు.. వీటన్నింటినీ ప్రచారం చేసినా జార్ఖండ్‌లో లాభం లేకపోయింది. స్థానికాంశాలే ప్రధాన భూమిక పోషించాయని బీజేపీనే ఒప్పుకుంది. మోదీ 9 సభల్లో ప్రసంగిస్తే మూడు చోట్ల మాత్రమే బీజేపీ అభ్యర్థులు గెలిచారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 303 సీట్ల అఖండ మెజారిటీ లభించింది. కానీ, ఆ ప్రభావం అసెంబ్లీ ఓటు మీద పడలేదు. అంటే జాతీయ ఓటు వేరు- రాష్ట్ర ఓటు వేరు అని ఓటర్లు తీర్మానించుకున్నారా? అని అనిపిస్తోంది. చాలా రాష్ట్రాల్లో బీజేపీ బలమైన ప్రభుత్వ-వ్యతిరేక పవనాలను ఎదుర్కొన్నదని విశ్లేషకులు అంటున్నారు. జాతీయ స్థాయి వరకూ మోదీ నాయకత్వాన్ని ఆమోదిస్తున్నారని, రాష్ట్రాలకొచ్చేసరికి అది వర్కవుట్ కావడం లేదని చెబుతున్నారు. జార్ఖండ్‌లోనూ ఇదే జరిగిందంటున్నారు.

### బలమైన సామాజిక వర్గాలను విస్మరించడం వల్లేనా..?

మహారాష్ట్రలో మరాఠాలు, రాజస్థాన్‌లో జాట్‌లు, జార్ఖండ్‌లో గిరిజనులను విస్మరించి నాన్-మరాఠా, నాన్-జాట్, నాన్-ట్రైబల్ వర్గాలకు అధికారం కట్టబెట్టడం ఆ వర్గాల్లో ఆగ్రహానికి కారణమైనట్లు చెబుతున్నారు. జార్ఖండ్ వరకు చూస్తే గిరిజన ఓటును సంఘటితం చేసుకోవడంలో జేఎంఎం సఫలమైంది. 2014లో 28 ఎస్టీ సీట్లకు బీజేపీ 13 చోట్ల నెగ్గింది. వాటిలో ఈసారి జేఎంఎం 21 స్థానాలను కైవసం చేసుకోగలిగింది.

### కొంపముంచిన రఘువర్..! మిత్ర పక్షాలు దూరం

జార్ఖండ్ మౌలికంగా గిరిజన రాష్ట్రం. అలాంటి జార్ఖండ్‌ను "ట్రైబల్-ముక్త్ రాష్ట్రం"గా మారుస్తానని రఘువర్‌దాస్ ఓ సందర్భంలో వ్యాఖ్యానించడం ఆగ్రహావేశాలు రగిల్చాయి. ద్వితీయ శ్రేణి నేతయిన ఆయనను రాత్రికి రాత్రి సీఎంను చేశారు మోదీ-షా! సీఎంగానూ రఘువర్ తీరు అభ్యంతరకరంగా మారిందని, ప్రజలను, అధికారులను బాహాటంగానే దూషించి అభాసుపాలయ్యారని బీజేపీ నేతలే అంటున్నారు. మహారాష్ట్రలో శివసేన మాదిరిగా జార్ఖండ్‌లో ఐదేళ్లపాటు కలిసి ఉన్న ఏజేఎస్‌యూను ఎన్నికల వేళ దూరం పెట్టడం చర్చనీయాంశమైంది. పొరుగు రాష్ట్రం బిహార్లో మిత్రపక్షాలుగా ఉన్న జేడీయూ, ఎల్‌జేపీలను సైతం బీజేపీ కలుపుకోలేదు.

### ముందున్న సవాళ్లు

ఢిల్లీ, బిహార్, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు బీజేపీ నాయకత్వానికి అగ్నిపరీక్ష. అమిత్ షా ఉంటే బీజేపీ ఓడిపోయే ప్రశ్నే లేదన్న భ్రమను మహారాష్ట్ర, జార్ఖండ్ పరిణామాలు చెరిపేశాయని, గొప్ప విజయాలు అందించిన షా- వ్యూహాలను మార్చుకోవాల్సిన సమయం వచ్చిందంటున్నారు. బెంగాల్ మరీ కత్తి మీద సవాలు. సీఏఏతో అక్కడ విజయావకాశాలు చేజారే పరిస్థితి. ఢిల్లీలోనూ ఈ చట్టం ప్రకంపనలు రేపింది. బిహార్‌లో జేడీయూ ఇప్పటికే తల ఎగరేస్తోంది. కలిసి వెళ్లకపోతే మరింత ఇబ్బంది... అంటున్నారు.

# జారిన జార్ఖండ్

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యత నాదే. ప్రజలు మార్పు కోరుకున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి పదవికి సోమవారం రాత్రి ఆయన రాజీనామా చేశారు. విశేషమేమంటే పక్కనే ఉన్న బిహార్‌లో బీజేపీ భాగస్వామ్య పక్షాలైన జేడీయూ, ఎల్‌జేపీలు కూడా ఈ ఎన్నికల్లో పోటీచేసిన ఒక్క సీట్లోనూ నెగ్గలేకపోయాయి.

### 'పులి కడుపున పుట్టేది పులే..'

కూటమిదే ఆధిపత్యం కావడంతో జేఎంఎం నేత హేమంత్ సొరెన్ జార్ఖండ్ కొత్త ముఖ్యమంత్రి కానున్నారు. రాష్ట్ర గవర్నరును కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాల్సిందిగా లాంఛనంగా కోరారు. రెండు నియోజకవర్గాలు- దుమ్కా, బార్హైట్ ల నుంచి బరిలో దిగి రెండింటిలోనూ జయకేతనం ఎగరేశారు. హేమంత్ గతంలో 2013-14లో 17 నెలల పాటు సీఎంగా పని చేశారు. ఈ పదవి చేపట్టిన అతి పిన్న వయస్కుడిగా (38 ఏళ్లు) అప్పట్లోనే రికార్డు సృష్టించారు. జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ నేత, రెండు సార్లు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన శిబూ సొరెన్ కుమారుడైన హేమంత్ ప్రస్తుతం పార్టీలో అన్నీ తానై నిర్వహిస్తున్నారు. కూటమికి ప్రధాన ప్రచారకర్త.. ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆది నుంచీ ప్రచారమయ్యారు. ఇంటర్మీడియెట్ వరకూ చదివి- మెకానికల్ ఇంజినీరింగ్‌లో అడ్మిషన్ మాత్రమే తీసుకున్న హేమంత్- అనేక రాష్ట్రాల్లో తిరిగి జాతీయస్థాయి నేతలందరితో సన్నిహిత సంబంధాలు సొంతంగా ఏర్పరుచుకున్నారు. సోదరుడు దుర్గా సొరెన్ మరణించడంతో వారసత్వాన్ని అందిపుచ్చుకున్న హేమంత్- తండ్రి మాదిరి ప్రజానేతగా ఎదగలేదు. తండ్రి ఉద్యమ నేత మాత్రమే. కానీ హేమంత్- ఓ రాజకీయపార్టీకి నేతగా అందులోని గుట్టుమట్లను ఆకళింపుచేసుకున్నారు. గిరిజనులకే కాక గిరిజనేతరుల అభిమానాన్ని సైతం చూరగొన్నారు. వీడియో గేమ్స్ అంటే ఇష్టపడే హేమంత్- కూటమి విజయం ఖాయమవగానే తన ఇంటి ఆవరణలో కాసేపు సైకిల్ తొక్కి సంతోషాన్ని వ్యక్తం చేశారు. "జార్ఖండ్‌లో ఇక కొత్త చరిత్ర మొదలవుతుంది. గురు శిబు సొరెన్ కఠోర శ్రమకు పోరాటానికి ఫలితమిది. ఈ విజయం ఓ మైలురాయి" అని మీడియాతో అన్నారు. వంశపారంపర్యంగా మీకీ పదవి లభించిందా? అన్న ప్రశ్నకు - "ఈ ప్రశ్న నన్ను బాధిస్తోంది. పులి కడుపున పుట్టేది పులే కదా... ఓ చమారీకి పుట్టినవాడు చమారీ అయితే ఏంటి ఇబ్బంది..?" అని ఆయన ఎదురుప్రశ్నించారు. 2014లో బీజేపీ 37 సీట్లు గెల్చుకుని సురేష్ మహతో నేతృత్వంలోని ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ) సహకారంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆనాడు ఏజేఎస్‌యూకు ఐదు సీట్లు వచ్చాయి. ఆ ప్రభుత్వం ఐదేళ్లూ అధికారంలో కొనసాగింది. ఏజేఎస్‌యూతో విభేదాలొచ్చాక మాజీ సీఎం బాబూలాల్ మరాండీ నేతృత్వంలోని జేవీఎం మద్దతుగా నిలిచింది. కానీ ఎన్నికల వేళకు ఎవరిదారి వారిదే అయింది. ఆ రెండు చిన్న పార్టీలూ 3 సీట్లకే పరిమితమయ్యాయి.



రాంచీలో జేఎంఎం కార్యకర్తల విజయోత్సాహం



విలేకరులతో మాట్లాడుతున్న జేఎంఎం వర్కింగ్ ప్రెసిడెంట్, ఝార్ఖండ్ సీఎం అభ్యర్థి హేమంత్ సొరెన్

## హేమంత్ సొరెన్‌కు కేసీఆర్ అభినందనలు

హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న జేఎంఎం వర్కింగ్ ప్రెసిడెంట్ హేమంత్ సొరెన్‌కు సీఎం కేసీఆర్ అభినందనలు తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి హేమంత్, ఆయన తండ్రి శిబూసొరెన్ మద్దతుగా నిలిచారని ఈసందర్భంగా గుర్తు చేసుకున్నారు. జార్ఖండ్ సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్న హేమంత్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## సొరెన్‌కు అభినందనలు: మోదీ

- ప్రజాతీర్పును గౌరవిస్తాం: అమిత్ షా

న్యూఢిల్లీ, డిసెంబరు 23: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో జేఎంఎం కూటమి విజయం నేపథ్యంలో ఆ పార్టీ నేత హేమంత్ సొరెన్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో బీజేపీ ఓడినా.. రాష్ట్రానికి సేవలను, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడాన్ని కొనసాగిస్తామంటూ ట్వీట్ చేశారు. కాగా ఈ తీర్పును గౌరవిస్తామని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. 'భవిష్యత్తులోనూ రాష్ట్రాభివృద్ధికి మా పార్టీ కట్టుబడి ఉంటుంది' అని ట్వీట్ చేశారు.



గవర్నర్‌కు రాజీనామా సమర్పిస్తున్న ఝార్ఖండ్ సీఎం రఘువర్ దాస్

## బీజేపీ.. అప్పుడు - ఇప్పుడు




## కాంగ్రెస్ ఖాతాలో 7వ రాష్ట్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 23: కాంగ్రెస్‌కు మరో ఊపు... జార్ఖండ్‌లో విజయం పార్టీని మరో రాష్ట్రంలో అధికారంలో నిలిపింది. మధ్యప్రదేశ్, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, పాండిచ్చేరిల్లో పార్టీ సొంతంగా ప్రభుత్వాన్ని నిర్వహిస్తోంది. మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీలతో కలిసి అధికారం పంచుకుంది. ఇపుడు జార్ఖండ్‌లో జేఎంఎం, ఆర్జేడీలతో కలిసి అధికార ఫలాన్ని ఆస్వాదించబోతోంది. మోదీ ప్రభుత్వ అవినీతి, చౌకీదార్ చోర్ లాంటి నినాదాలు రాష్ట్రాల్లో పనిచేయవని శరద్ పవార్ నిరూపించారు. ఆయన ఎక్కువగా మౌలికాంశాలైన వ్యవసాయ రంగ దుస్థితి, పెరుగుతున్న నిరుద్యోగం, పెరిగిన ధరవరలు... వీటినే ఎక్కువగా ప్రస్తావించి ఎన్సీపీని విజయపథంలో నిలిపారు. ఇదే ఫార్ములాను కాంగ్రెస్ జార్ఖండ్‌లోనూ అమలు పరిచింది. ఎక్కువగా గిరిజన సమస్యలు, ధరలు... వీటినే ప్రచారం చేసింది.

## బీజేపీ అజేయం కాదు

- ప్రతిపక్షాలన్నీ చేతులు కలపాలి: చిదంబరం
- సీఏఏ. ఎన్ఆర్సీకి వ్యతిరేకంగా తీర్పు: కేజ్రీవాల్

చెన్నై/ముంబయి/న్యూఢిల్లీ, డిసెంబరు 23: ఝార్ఖండ్ ఫలితాలతో బీజేపీ అజేయం కాదని నిరూపితమైందని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం అన్నారు. ఆ పార్టీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ చేతులు కలపాలని పిలుపునిచ్చారు. ఝార్ఖండ్ ఫలితాలు సీఏఏ, ఎన్ఆర్సీలకు వ్యతిరేకంగా ప్రజలిచ్చిన తీర్పు అని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. కాగా ఝార్ఖండ్‌లో ఓటమితో ప్రజాస్వామ్యం గెలిచిందని ఎన్సీపీ పేర్కొంది. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాల అహంకారాన్ని, సెంటిమెంట్ రాజకీయాలను ఝార్ఖండ్ ప్రజలు తిరస్కరించారని ఆ పార్టీ అధికార ప్రతినిధి నవాబ్ మాలిక్ ట్వీట్ చేశారు. అభివృద్ధి అజెండాగా రాజకీయాలు చేస్తామన్న బీజేపీ.. సెంటిమెంట్‌ను రగిల్చి లబ్ధి పొందాలని చూసిందని, కానీ.. వారి ప్రయత్నాలను పేద, ఆదివాసీ ప్రజలు తిప్పికొట్టారని శివసేన అధికార ప్రతినిధి మనీశ్ కయాండే అన్నారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఫలితాలతోనైనా బీజేపీ ఆత్మపరిశీలన చేసుకోవాలని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ హితవు పలికారు.



సీఏఏ, ఎన్ఆర్సీలకు వ్యతిరేకంగా బెంగళూరులో భారీ ర్యాలీ



చెన్నైలో స్టాలిన్, చిదంబరం, వైకో, వామపక్ష నేతల ప్రదర్శన

# శాసనోల్లంఘన ఉద్యమం

## సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా వేలాది మందితో భారీ ర్యాలీలు

బెంగళూరు, న్యూఢిల్లీ, చెన్నై, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ)కి వ్యతిరేకంగా శాసనోల్లంఘన ఉద్యమం చేపడతామని ఆందోళనకారులు స్పష్టంచేశారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా సోమవారం కర్ణాటకలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో నిరసనలు హోరెత్తాయి. బెంగళూరు, బీదర్, చామరాజనగర్, రామనగర్, కనకపుర, బళ్లారి, మంగళూరు సహా పలు చోట్ల భారీగా నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఎన్నార్సీని అమలు చేస్తే తాము ఎటువంటి పత్రాలూ దాఖలు చేయబోమని నినదించారు. బెంగళూరు సంయుక్త కార్యాచరణ కమిటీ పేరిట 35 సంస్థలు ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. భారతీయ జనతా పార్టీ తన పేరును భారతీయ జిన్నా పార్టీ అని మార్చుకోవాలని మాజీ ఐఏఎస్, ఆందోళనకారుడు హర్ష్ మందెర్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ అసహనంపై నిరసన వ్యక్తం చేస్తూ ఈ ఏడాది మొదట్లో రాజీనామా చేసిన ఐఏఎస్ అధికారి శశికాంత్ సెంథిల్ కూడా ఈ ఆందోళనలో పాలుపంచుకున్నారు. సుప్రీం కోర్టు మాజీ జడ్జి గోపాల్ గౌడ పలువురు న్యాయవాదులతో కలిసి రాజ్యాంగ పీఠికను చదివి వినిపించారు. మంగళూరులో హింసాత్మక ఘటనలపై సీఎం యడియూరప్ప న్యాయ విచారణకు ఆదేశించారు. కాగా, చెన్నైలో డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ నాయకత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం, ఎండీఎంకే నేత వైగో, వామపక్ష నేత బాలకృష్ణన్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. కేరళలోని కోచి నగరంలో వివిధ సంస్థల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఢిల్లీలోని జామియా వర్సిటీ వద్ద ఎనిమిదో రోజూ ఆందోళనలు కొనసాగాయి. జామియా, అలీగఢ్ వర్సిటీల్లో 'పోలీసుల అతి'పై న్యాయ విచారణ జరపాలని పౌర హక్కుల సంఘాలు, ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఢిల్లీలోని యూపీ భవన్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించడానికి వచ్చిన 46 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### పాక్ మహిళకు పౌరసత్వం

జమ్మూకశ్మీరు సరిహద్దుల్లోని పూంఛ్ జిల్లాకు చెందిన తాజ్‌ను వివాహం చేసుకున్న పాకిస్థానీ మహిళ ఖతీజా ప్రవీణ్‌కు భారత పౌరసత్వం ఇచ్చారు. భారతీయుడిని పెళ్లి చేసుకున్నందున ఆమెకు పౌరసత్వం ఇచ్చామని అధికారులు తెలిపారు. ఈ నిర్ణయంపై తాజ్ దంపతులు హర్షం వ్యక్తం చేశారు.



### కన్ను కోల్పోయిన జామియా విద్యార్థి

ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడి పేరు మిన్హాజుద్దీన్. జామియా వర్సిటీలో ఎల్ఎల్ఎమ్ చేస్తున్నాడు. ఈ నెల 15న సీఏఏకు వ్యతిరేకంగా ధర్నా సందర్భంలో పోలీసులు జరిపిన దాడిలో ఓ కన్ను కోల్పోయాడు. "నా తప్పేముంది. లైబ్రరీలో చదువుకుంటున్నాను. నిరసన బయట జరుగుతోంది. పోలీసులు లైబ్రరీలోకి వచ్చి కొట్టారు" అని ఆయన అన్నారు.

వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మహాత్మ గాంధీ విగ్రహం ఎదుట ప్రవాస భారతీయ ముస్లిమ్ సంఘాల నేతృత్వంలో శాంతియుతంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాగా.. పౌరసత్వ సవరణ చట్టానికి సంబంధించి అన్ని రకాల మీడియా ప్రచారాలను నిలిపి వేయాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని కోల్‌కతా హైకోర్టు ఆదేశించింది. అటు.. పౌరసత్వ సవరణ చట్టంపై ఆందోళనలను కవర్ చేస్తున్న పాత్రికేయులపై పోలీసుల దాడులను ఎడిటర్స్ గిల్డ్ ఖండించింది. ముఖ్యంగా కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌లో పాత్రికేయులపై పోలీసులు క్రూరంగా వ్యవహరించారని, అకారణంగా నిర్బంధించారని నిరసన తెలిపింది.



కోల్‌కతాలో 'అభినందన్ జాత్రా'లో నడ్డా అభివాదం

## గాంధీ చెప్పారు.. మోదీ చేశారు!

### ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్న మమత: నడ్డా

కోల్‌కతా, డిసెంబరు 23: పౌరసత్వ చట్టం (సీఏఏ) విషయంలో పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, టీఎంసీ నేతలు రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీజేపీ కార్య నిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరోపించారు. సోమవారం కోల్‌కతాలో సీఏఏకు మద్దతుగా నిర్వహించిన భారీ ర్యాలీలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. "భారత్‌కు రావాలనుకునే వారికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలనూ కల్పిస్తుందని 1947లోనే మహాత్మాగాంధీ చెప్పారు. ఇప్పుడు మోదీ దాన్ని ఆచరణలో పెడుతున్నారు" అని నడ్డా చెప్పారు. బెంగాల్ బీజేపీ ప్రధాన కార్యదర్శి సయంతన్ బసు విలేకరులతో మాట్లాడుతూ.. బెంగాల్‌లో భారత రాజ్యాంగం కాకుండా.. షరియా చట్టం అమలవుతున్నట్లుగా ఉందని విమర్శించారు. రాష్ట్రం క్రమంగా 'పశ్చిమ బంగ్లాదేశ్'గా మారుతోందని ఆరోపించారు. కాగా.. సీఏఏకు మద్దతుగా జమ్మూలో పీవోజేకే నుంచి చెల్లాచెదురైన ప్రజల వేదిక ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు శివసేన ఎంపీ సంజయ్ రౌత్ కేంద్ర ప్రభుత్వంపై ట్విటర్ వేదికగా విమర్శలు గుప్పించారు.

## భిన్నాభిప్రాయం ప్రజాస్వామ్య సారం

- విధ్వంసం తగదు... నిర్మాణాత్మకంగా ఉండాలి: వెంకయ్య



న్యూఢిల్లీ, డిసెంబరు 23: 'ప్రజలు విధ్వంసం జోలికి పోకూడదు. ఆటంకవాదులు కాకూడదు. నిర్మాణాత్మకంగా ఆలోచించాలి. అందరూ ప్రభుత్వాన్ని సమర్థించాలని నేను చెప్పడం లేదు. ఆ అవసరం కూడా లేదు. భిన్నాభిప్రాయం అనేది ప్రజాస్వామ్య సారం' అని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. సోమవారం ఇక్కడ జాతీయ సినిమా అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ప్రసంగించారు. 'ముందున్నవారైనా వెనుకబడిన వారైనా, ముస్లిం.. క్రిస్టియన్.. హిందూ ఎవరైనా, ఆస్తికుడైనా నాస్తికుడైనా.. దేశ అభివృద్ధిలో సమాన భాగస్వాములమని భావించాలి. అదే నిజమైన జై హింద్' అని చెప్పారు. 'ఒక రాష్ట్రంలో ఇటీవల జరిగినట్లు కోర్టులు కూడా చేయాలని కొందరు అంటున్నారు. సత్వర న్యాయం అందించలేకపోవచ్చు. కానీ నిరంతర జాప్యాలనూ అనుమతించలేం' అని వ్యాఖ్యానించారు. మహిళలను గౌరవంగా చూసేలా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే కాదని, సినిమా, సమాజానిది కూడా అని తెలిపారు. రాష్ట్రీయ రైఫిల్స్ విభాగం ఆధ్వర్యంలో జమ్మూకశ్మీర్‌కు చెందిన 30 మంది విద్యార్థినులు వెంకయ్యను కలిశారు.

## మోదీ వణికిపోయారు!: సీపీఎం

న్యూఢిల్లీ, డిసెంబరు 23: ఎన్నార్సీపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై విపక్షాలు తీవ్రంగా స్పందించాయి. మోదీ ఢిల్లీ ప్రసంగం అబద్ధాల పుట్ట అని, నిరసన జ్వాలతో వణికిపోయారని సీపీఎం విమర్శించింది. ఎన్నార్సీ ఆలోచనే లేదని అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేసింది.

### ప్రజల్ని ఫూల్స్ చేయాలని చూస్తున్నారు: కాంగ్రెస్

మోదీ ప్రజలను ఫూల్స్‌ను చేయాలని చూస్తున్నారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా ఆరోపించారు. జార్ఖండ్ ఎన్నికల్లో ఎన్నార్సీ హామీ ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. బీజేపీలో మోదీని మంచి పోలీసు అనిపించడం కోసం అమిత్‌షా చెడ్డ పోలీసు పాత్ర పోషిస్తున్నారని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. మతపరంగా నిర్ణయాలను ప్రజలు ప్రశ్నిస్తుంటే మోదీ భావోద్వేగ మార్గంలో తప్పించుకునేందుకు చూస్తున్నారని కేరళ సీఎం పినరయి విజయన్ అన్నారు.

### ప్రధాని వ్యాఖ్యలు ఆశ్చర్యకరం: పవార్

మోదీ వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించాయని ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ అన్నారు. పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించినపుడు దేశవ్యాప్త ఎన్నార్సీ అంశాన్ని రాష్ట్రపతి ప్రస్తావించారని గుర్తు చేశారు. ఆర్థిక సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే బీజేపీ ఇలాంటి ఎత్తుగడలకు పాల్పడుతోందన్నారు.

### విపక్ష సీఎంలకు మమత లేఖ

సీఏఏ, ఎన్ఆర్సీలకు వ్యతిరేకంగా పోరాడదామని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ బీజేపీయేతర సీఎంలకు లేఖ రాశారు. కాంగ్రెస్ చీఫ్ సోనియాగాంధీ, ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్‌కు లేఖలు పంపారు.

### సమగ్ర చర్చ తర్వాతే: చౌహాన్

సమగ్ర చర్చ అనంతరమే దేశవ్యాప్త ఎన్నార్సీపై నిర్ణయం తీసుకుంటామని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. సలహాలు ఆహ్వానించామని, ఈ లోగానే కాంగ్రెస్ గందరగోళం సృష్టిస్తోందని వ్యాఖ్యానించారు. మోదీ దేశంలోకి వలస వచ్చిన హిందువులకు దేవుడిలా అవతరించారని అన్నారు.



రాజ్‌ఘాట్‌లో కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్షలో సోనియాకు శాలువా కప్పుతున్న రాహుల్

## 'భరతమాత' గొంతును నొక్కలేరు!

- రాజ్యాంగంపై మోదీ దాడి చేయలేరు: రాహుల్
- రాజ్యాంగాన్ని కాపాడతాం: ప్రియాంక
- రాజ్‌ఘాట్‌లో 'ఐక్యత కోసం సత్యాగ్రహం'

న్యూఢిల్లీ, డిసెంబరు 23: "పౌరసత్వ చట్టానికి సవరణలు చేయడం ద్వారా మోదీ విద్వేషాలు పెంచడంతో పాటు దేశాన్ని విభజిస్తున్నారు. రాజ్యాంగంపై దాడి చేయాలని చూసినా, 'భరతమాత' గొంతును నొక్కివేయాలని చూసినా ప్రజలు సహించరు. మోదీకి ఆ అవకాశం ఇవ్వరు" అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. మోదీ 'సంస్థ' ఆయనకు దేశాన్ని ఎలా విడగొట్టాలన్న విషయాన్ని ఏళ్ల తరబడి బోధించిందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో రాహుల్ సహా అగ్రనేతలంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్.. ప్రధాని మోదీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యార్థులు, యువత, జ్యుడీషియరీని అణగదొక్కాలని చూస్తే భరతమాత దీటైన బదులిస్తుందని చెప్పారు. అంతకుముందు సత్యాగ్రహంలో తనతో కలిసి పాల్గొనాలంటూ యువతకు రాహుల్ ట్విటర్ ద్వారా పిలుపునిచ్చారు. మధ్యాహ్నం ప్రారంభమైన సత్యాగ్రహంలో సోనియా, మన్మోహన్, రాహుల్ రాజ్యాంగ ప్రవేశికను చదివి వినిపించారు. అనంతరం నేతలంతా మోదీ సర్కారు ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఒక నిమిషం మౌనం పాటించారు. సీఏఏకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో అమరులైన వారి సాక్షిగా రాజ్యాంగాన్ని కాపాడతామని తీర్మానిస్తున్నట్లు ప్రియాంక చెప్పారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ సీఎంలు కమల్‌నాథ్, అశోక్ గెహ్లాట్ మాట్లాడుతూ.. తమ రాష్ట్రాల్లో సీఏఏను అమలు చేయబోమని స్పష్టం చేశారు.

## రహస్యంగా ఎన్నార్సీ అమలు: అసద్



హైదరాబాద్ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జనాభా లెక్కల సేకరణ ద్వారా ఎన్నార్సీ రహస్య అమలు చేపట్టారని మజ్లిస్ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. మోదీ, అమిత్ షా పరస్పర విరుద్ధ వ్యాఖ్యలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం దారుస్సలాంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బహిరంగ సభలు, శాంతియుతంగా నిర్వహించనున్నట్టు యునైటెడ్ ముస్లిం యాక్షన్ కమిటీ ప్రకటించింది.

# జరిగేదీ... ఒరిగేదీ?

- మూడు రాజధానులపై తీవ్ర చర్చ
- అమరావతికి దెబ్బతో జంట జిల్లాల వేదన
- హైకోర్టుతో 'లాభం' స్థాయిపై కర్నూలులో మథనం
- సీమలోని మూడు జిల్లాల్లోనూ ఇదే చర్చ
- నవ్యాంధ్రలో ఏకైక మహా నగరం విశాఖ
- ఇప్పటికే భూములు, ఇంటి అద్దె ధరలు భగ్గు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'మూడు రాజధానులు' మంచిదేనా?
అమరావతిని ఎందుకు మార్చుతున్నారు? చంద్రబాబుపై కోపంతోనా? అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతోనా? వికేంద్రీకరణ అంటే ఏమిటి? అభివృద్ధిని వికేంద్రీకరించడమా? పాలనను వికేంద్రీకరించడమా? కడప జిల్లాలో ఏర్పాటు చేసే ఉక్కు కర్మాగారం వల్ల ఎక్కువ అభివృద్ధి జరుగుతుందా? లేక... కర్నూలులో వచ్చే హైకోర్టు వల్ల ఎక్కువ అభివృద్ధి జరుగుతుందా? పరిపాలన వికేంద్రీకరణ వల్ల అభివృద్ధి జరుగుతుందనుకుంటే... ఇప్పటిదాకా సచివాలయం, హైకోర్టు, ప్రభుత్వ కార్యాలయాలేవీ లేకుండానే విశాఖ నగరం ఎలా అభివృద్ధి చెందింది?

వికేంద్రీకరణ పేరిట సర్కారు చేస్తున్న ప్రయోగం ప్రజలకు మేలు చేస్తుందా? రాష్ట్రంలో ఇప్పుడు ఎక్కడ చూసినా అదే చర్చ! 'విశాఖ పరిపాలనా రాజధానిగా ఉండొచ్చు. కర్నూలు న్యాయ రాజధానిగా మారొచ్చు. అమరావతి చట్ట సభల రాజధానిగా ఉండొచ్చు' అంటూ శీతాకాల సమావేశాల చివరి రోజున ముఖ్యమంత్రి జగన్ చేసిన ప్రకటన సంచలనం సృష్టించింది. ఆ తర్వాత జీఎన్ రావు కమిటీ కూడా ఇదే పద్ధతిలో... ఆయా వ్యవస్థలను 'మరిన్ని' ముక్కలు చేస్తూ నివేదిక ఇచ్చింది.

### తొలి దెబ్బ అమరావతికే...

'మూడు' రాజధానుల ప్రయోగంలో అత్యధికంగా నష్టపోతున్నది అమరావతే. రాజధానికి భూములు ఇచ్చిన రైతులు, రాజధాని ప్రకటన తర్వాత ఇక్కడ భూములు కొనుగోలు చేసిన రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వారు, తెలంగాణతో పాటు విదేశాల్లో స్థిరపడిన తెలుగువారూ ప్రత్యక్ష బాధితులుగా మారారు. హ్యాపీనెస్ట్, ఎన్ఆర్ఐ టవర్స్‌లో ఫ్లాట్లు బుక్ చేసుకుని డబ్బులు కట్టిన వారూ వేలల్లోనే ఉన్నారు. మూడు రాజధానుల ముచ్చటతో వీరందరూ ప్రత్యక్షంగా నష్టపోయినట్లే. ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని, టీడీపీ నేతలే ఎక్కువగా భూములు కొన్నారని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నప్పటికీ... ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం వెల్లడించిన భూముల లెక్కలు చూశాక 'ఈ మాత్రానికే ఇంత రచ్చా' అనే ప్రశ్న మొదలైంది. రాజధాని కోసం దాదాపు 33 వేల ఎకరాల భూసేకరణ జరిపితే .. ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటూ ప్రభుత్వం 600లోపు ఎకరాల వివరాలు బయటపెట్టింది. "ప్రభుత్వ చర్య తప్పు చేసిన వారిని శిక్షించే బదులు... అందరిమీదా కక్ష సాధించుకున్నట్లుంది" అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక... కొత్త ఫార్ములా ప్రకారం అమరావతిలో హైకోర్టు ధర్మాసనం, శీతాకాల అసెంబ్లీ సమావేశాలు మాత్రమే జరుగుతాయి. నవ నగరాలతో కూడిన అమరావతి అసలు ప్రణాళికకూ, ఇప్పుడు ప్రతిపాదిస్తున్న దానికీ ఏమాత్రం పొంతనే లేదు. ఇక, రైతుల భూములు వెనక్కి ఇస్తాం అని ఒక మంత్రి అంటే... రైతుల ప్లాట్లు అభివృద్ధి చేసి ఇస్తాం అని మరొకరు అంటున్నారు. ఏమీ లేని అమరావతిలో ఆ ప్లాట్లు అభివృద్ధి చేసి ఉపయోగం ఏమిటనే ప్రశ్నకు మాత్రం సమాధానం లేదు. కృష్ణా, గుంటూరు జిల్లాల అధికార పార్టీ నేతలకు ఈ సెగ తగులుతోంది. ప్రత్యక్షంగా తమ జిల్లాలకు జరిగే నష్టంపై వీరెవరూ నోరు తెరిచి మాట్లాడలేకపోతున్నారు.

### కర్నూలుకు వచ్చేదేమిటి?

శ్రీబాగ్ ఒడంబడిక మేరకు కర్నూలుకు హైకోర్టు ఇస్తామన్నది మరో ప్రకటన. దీనిపై కర్నూలుతోపాటు రాయలసీమకు చెందిన న్యాయవాదుల్లో హర్షం వ్యక్తమైంది. అయితే... విశాఖలో, అమరావతిలో హైకోర్టు ధర్మాసనాలు ఏర్పాటు చేయాలని జీఎన్‌రావు కమిటీ సిఫారసు చేసింది. ఇది పూర్తిగా సుప్రీంకోర్టు అంగీకారం ప్రకారం జరగాల్సిన ప్రక్రియ. మరో రెండు ధర్మాసనాలు ఏర్పడితే, కర్నూలులో ఏర్పాటు చేసే హైకోర్టు ఒక 'పెద్ద బెంచ్'లాగా మాత్రమే మారుతుందనే అభిప్రాయం ఉంది. కోర్టు వ్యాజ్యాలతో సంబంధం ఉన్న వారు పదిశాతానికి మించి ఉండరు. హైదరాబాద్‌కు కర్నూలుకు కారు ప్రయాణం రెండున్నర గంటలకు మించదు. అంటే... అక్కడ స్థిరపడిన సీనియర్ న్యాయవాదులే ఇక్కడి కేసులూ వాదించే అవకాశం ఉంది. బెంచ్ లేదా హైకోర్టు ఏర్పాటు కావడం రాయలసీమ ప్రజలు, వ్యాజ్యాలతో సంబంధమున్న వారికి ఇది కచ్చితంగా మంచిదే. కానీ... దీనివల్ల అభివృద్ధి జరుగుతుందనే వాదనతో మాత్రం ఏకీభవించలేకపోతున్నారు. నిజానికి... శ్రీబాగ్ ఒడంబడిక మేరకే కర్నూలులో 'ఆంధ్ర రాష్ట్ర' తొలి రాజధాని ఏర్పడింది. ఇప్పుడు కూడా రాయలసీమకు రాజధాని ఇవ్వాలనే డిమాండ్ మొదలైంది. తిరుపతిలో సచివాలయం ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ చింతా మోహన్ డిమాండ్ చేశారు. హైకోర్టు ఏర్పాటు చేయడం వల్ల కొత్తగా ఎలాంటి అభివృద్ధీ జరగదని మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మాజీ మంత్రి భూమన అఖిల ప్రియ పేర్కొన్నారు. ఇతర రాజకీయ పక్షాలకు చెందిన నేతలదీ ఇదే మాట.

### విశాఖ హ్యాపీనా?

నవ్యాంధ్రలోని ఏకైక కాస్మోపాలిటన్, మహా నగరం... విశాఖపట్నం. సీఎం క్యాంప్ కార్యాలయం, సచివాలయం, హైకోర్టు ధర్మాసనం వంటివేవీ ఈ నగరాభివృద్ధికి కారణం కాదు. ఉక్కు కర్మాగారం, తూర్పు నౌకాదళ కమాండ్, ఆంధ్రా యూనివర్సిటీ, ఫార్మా, బ్రాండిక్స్... ఇలాంటి పరిశ్రమలు, వ్యవస్థలు, పర్యాటక రంగం వల్లే విశాఖ అభివృద్ధి చెందింది. ఇప్పటికే... విశాఖలో భూముల ధరలు ఆకాశాన్ని అంటాయి. రాజధాని ప్రకటనతో ఈ ఊపు మరింత పెరుగుతోంది. ఇళ్ల అద్దెలూ పెరగడం మొదలైంది. వీటన్నింటి నేపథ్యంలో... 'రాజధాని మనకు మంచిదేనా? దీనివల్ల జరిగేదేమిటి' అనే అంశంపై విశాఖతోపాటు ఉత్తరాంధ్ర వాసుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.

### మరి మిగిలిన జిల్లాల మాటేమిటి?

'విశాఖ, అమరావతి, కర్నూలు... సరే. మరి మా మాటేమిటి?' అని మిగిలిన జిల్లాల ప్రజలు, నేతలు ప్రశ్నిస్తున్నారు. పరిపాలన వికేంద్రీకరణ ప్రతిపాదనలు చేసిన జీఎన్‌రావు కమిటీ... అభివృద్ధి విస్తరణ-వికేంద్రీకరణ గురించి తన నివేదికలో ప్రస్తావించలేదు. ఏ ప్రాంతాల వారు ఏం కోరుకున్నారనే విషయాన్ని క్లుప్తంగా తెలిపింది. అంతేతప్ప... ఆయా జిల్లాల ప్రజల ఆకాంక్షలు, అక్కడి వనరుల ఆధారంగా ఆ ప్రాంతాల అభివృద్ధికి ఏంచేయాలో వివరించనే లేదు. వెరసి... 'పాలన వికేంద్రీకరణ'కోసం సిఫారసులు చేసే కమిటీయేతప్ప, 'అభివృద్ధి వికేంద్రీకరణ'కు ఏర్పాటు చేసిందికాదనే విమర్శలు మొదలయ్యాయి.

## మహిళకు మరింత భద్రత: డీజీపీ

మచిలీపట్నం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత కోసం పోలీసశాఖ ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటోందని డీజీపీ గౌతంసవాంగ్ అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని రామరాజు కన్వెన్షన్ సెంటరులో సోమవారం మహిళామిత్రలకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన దిశచట్టం ఇంకా కార్యాచరణలోకి రాలేదని డీజీపీ గౌతంసవాంగ్ స్పష్టం చేశారు. దీనికి కేంద్ర ప్రభుత్వ అనుమతి రావాల్సి ఉందన్నారు. మహిళామిత్ర పుస్తకం, కరపత్రాన్ని డీజీపీ ఆవిష్కరించారు.

# రాజధానిని ముక్కలు చేస్తే ప్రజల భవిష్యత్తు అంధకారమే

- రాష్ట్రంలో పెచ్చుమీరుతున్న రెడ్డి వర్గం అరాచకాలు: మంద కృష్ణ మాదిగ



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): "రాష్ట్ర రాజధానిని మూడు ముక్కలు చేస్తే ఐదు కోట్ల ఆంధ్ర ప్రజల భవిష్యత్తు అంధకారంగా మారుతుంది. రాజధాని అంటే ముఖ్యమంత్రుల సొంతింటి నిర్మాణాలు కాదు. రాష్ట్రంలో రెడ్డి సామాజిక వర్గం అరాచకాలు రోజురోజుకూ పెచ్చు మీరుతున్నాయి" అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి మండలం కొండాయపాలెం పంచాయతీ వెంకట్రావుపల్లిలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన దళిత యువతి అనూష కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. అనంతరం అక్కడ, ముందుగా ఒంగోలులోనూ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన యువతిపై అత్యాచారం చేసిన బీసీ, ముస్లిం వర్గాలకు చెందిన వారిని ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులకు, ఆ రాష్ట్ర సీఎంకు, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారన్నారు. "గుంటూరులో ఐదేళ్ల పాపపై, ప్రకాశంలో 20 ఏళ్ల యువతిపై, కర్నూలులో 14 ఏళ్ల బాలికపై మీ సామాజిక వర్గానికి చెందిన వారే అత్యాచారం చేశారు. అనూషను కూడా మీ సామాజిక వర్గానికి చెందినవ్యక్తే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు. రెడ్డి సామాజిక వర్గం ఏం చేసినా కేసులు కూడా నమోదు చేయడం లేదు. పోలీసులు, అధికారులపై వత్తిళ్లు పెరిగాయి" అని కృష్ణ మాదిగ విమర్శించారు. రాజధానిగా అమరావతే ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. అవసరమైతే ఏడాదికి మూడుసార్లు జరిగే అసెంబ్లీ సమావేశాలు విశాఖలో పెట్టుకొంటే ఎవ్వరికీ ఇబ్బంది ఉండదని, సచివాలయం మాత్రం అమరావతిలోనే ఉండాలని తేల్చిచెప్పారు. కర్నూలులో హైకోర్టు సమంజసమేనని అన్నారు. అమరావతికంటే ముందు దొనకొండ ప్రాంతం అనువైనదని తాము చేసిన సూచనను పట్టించుకోలేదని వివరించారు.



మూడు రాజధానుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అమరావతి మండల పరిధిలోని ధరణికోట గ్రామ రైతులు, మహిళలు, చిన్నారులు ధ్యానబుద్ధ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న దృశ్యం

# ఏం జరుగుతోంది..?

- రాజధాని పరిణామాలపై పీఎంవో ఆరా
- ఆందోళనలు, నిరసనలపై ఆరా
- తుళ్లూరు రైతుల పోరుపై ఢిల్లీకి నివేదిక

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో రైతుల ఆందోళన ఢిల్లీని తాకింది. మహిళలు, చిన్నారులు, పాఠశాల విద్యార్థులు సైతం రోడ్లపైకొచ్చి నిరసనల్లో పాల్గొనడం ప్రధాని మోదీ కార్యాలయాన్ని (పీఎంవో) కదలించింది. అమరావతిలో ఏం జరుగుతోంది ? అంటూ ప్రజల నిరసన తీవ్రతను అంచనా వేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. కేంద్ర నిఘా విభాగం (ఐబీ) నివేదికలతోపాటు క్షేత్ర స్థాయి వాస్తవిక రిపోర్టును తెప్పించుకుంటోంది. ఇదే విషయమై రాష్ట్రానికి సంబంధించిన సీనియర్ అఖిల భారత సర్వీసు (ఏఐఎస్) అధికారులతో సంప్రదిస్తున్నట్లు తెలిసింది. కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగం (డీవోపీటీ) నుంచి ప్రత్యేక సమాచారం తెప్పించుకుని.. ఎంపిక చేసిన ఐపీఎస్, ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులతో మాట్లాడుతూ సమాచారం సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం తెలియడంతో రాష్ట్రప్రభుత్వంలో కీలక స్థానంలో ఉన్న ఓ అధికారి ప్రస్తుతం ఢిల్లీలో మకాం వేశారు. వాస్తవిక నివేదికను మోదీ కార్యాలయానికి అందించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఆ అధికారికి ఇప్పటిదాకా పీఎంవో అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని తెలిసింది. దీంతో ప్రధానికి బాగా సన్నిహితంగా ఉండే ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులను కలిసేందుకు ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని ఆ అధికారి సోషల్ మీడియాలో పోస్టుచేసి ప్రభుత్వ పనులపైనే తాను ఢిల్లీలో ఉన్నట్లు వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేశారు. అదిప్పుడు మరింత చర్చనీయాంశంగా మారింది.

### రోజువారీగా మోదీకి ఐబీ నివేదికలు..

మూడు రాజధానులపై ఈనెల 17న అసెంబ్లీలో ముఖ్యమంత్రి జగన్ ప్రకటన తర్వాత రాష్ట్రంలో విభిన్న పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. విశాఖ, కర్నూలు, అమరావతిల్లో రాజకీయ పరిస్థితులు, ప్రజల స్పందనలు, ప్రత్యేకించి ఆర్థిక, వాణిజ్య రంగాలపై ప్రభావం, శాంతిభద్రతలు వంటి అంశాలపై ఐబీ రోజువారీగా ప్రధానికి నివేదికలు ఇస్తోంది. అయితే జీఎన్‌రావు కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత అమరావతి పరిధిలో రైతులు, మహిళలు, చిన్నారుల ఆందోళనలు ఎగసిపడుతున్నాయి. తెలంగాణ ఉద్యమం తరహాలోనే రాజకీయాలకతీతంగా ప్రజలు రహదారులపైకి వచ్చి వంటావార్పు, నిరసనలు కొనసాగిస్తున్నారు. అయితే సీఎం ప్రకటన, జీఎన్ రావు కమిటీ నివేదిక అనంతరం రాయలసీమ, ఉత్తరాంధ్రలో సర్కారు ఆశించిన స్థాయిలో పరిణామాలు, ప్రజా స్పందన ఉందా? వాస్తవ పరిస్థితులు ఏమిటని పీఎంవో ఆరాతీస్తోంది. గత కొద్దిరోజులుగా ఇక్కడి ఐఏఎస్ అధికారులతో ఫోన్లో మాట్లాడుతూ సమాచారం తీసుకుంటున్నారు. రాజధానిలో ఇప్పటిదాకా చేపట్టిన నిర్మాణాలు, వాటి విలువ.. ఇంకా ప్రతిపాదిత పనులు, పెండింగ్‌లో ఉన్న వర్కులు.. అసంపూర్తిగా వదిలేసిన పనులపై నివేదికలు తెప్పించుకుంటున్నట్లు తెలిసింది.

### ఆర్థిక భారం మాటేంటి?

'మీ సీఎం నిర్ణయం సరైనదేనని మీరు భావిస్తున్నారా? రాజధాని నిర్మాణానికి కేంద్రం నిధులు ఇచ్చింది కదా! వాటినేం చేస్తారు? అధికార యంత్రాంగం అమరావతి నుంచి తరలివెళ్లడానికి సుముఖంగా ఉందా? అమరావతి కేంద్రంగా జరిగిన ఎస్టాబ్లిష్‌మెంట్స్ మాటేమిటి? అభివృద్ధి వికేంద్రీకరణ ఎలా ఉంటుంది? పరిపాలనా వికేంద్రీకరణ వల్ల అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారా? రాజధాని మారిస్తే పడే ఆర్థిక భారం మాటేమిటి? రాజధాని మారుస్తామని అధికార పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచారా? రాజధానిలో జరుగుతున్న ఆందోళనల్లో అధికార పార్టీ కేడర్ కూడా పాల్గొంటోందా? ప్రతి లోక్‌సభ నియోజకవర్గాన్ని జిల్లాగా ప్రకటిస్తామన్నారు.. అది కార్యరూపం దాల్చకుండానే ఆకస్మికంగా ఈ మూడు రాజధానుల ప్రస్తావనను తెర పైకి ఎందుకు తెచ్చారు' వంటి ప్రశ్నలు సంధిస్తూ.. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల అభిప్రాయాలను ఐబీ తీసుకుంటున్నట్లు తెలిపింది. 'ఆంధ్రజ్యోతి'కి అందిన సమాచారం ప్రకారం.. దాదాపు 21 మంది అధికారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నట్లు సమాచారం. అయితే ఇది ఇంతటితోనే ఆగిపోలేదు. సోమవారం కూడా మరో ముగ్గురు అధికారులతో ఫోన్లో మాట్లాడినట్లు తెలిసింది. అంటే 24 మంది అధికారుల నుంచి కూపీలాగారన్న మాట. రెగ్యులర్ కాల్స్ చేయడానికి భయపడినవారు నేరుగా ఫేస్‌టైమ్‌లో మాట్లాడినట్లు సమాచారం. ఇంకోవైపు.. కేంద్ర నిఘా బృందాలు కృష్ణా, గుంటూరు, విశాఖ, విజయనగరం, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో రంగంలోకి దిగాయి. రాజధాని తరలింపును నిరసిస్తూ జరుగుతున్న ఆందోళనలు, కొత్తగా రాజధాని వచ్చే ప్రాంతాల్లో పరిస్థితిపై ఆరాతీస్తున్నారు. సోమవారం తుళ్లూరులో జరిగిన రైతుల ఆందోళనపైనా వారు నివేదిక పంపించినట్లు తెలిసింది.

### ఢిల్లీపైనే నిఘా?

ఐబీ రంగప్రవేశం చేసిన దరిమిలా.. ఢిల్లీలో ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు రాష్ట్రప్రభుత్వంలో కీలక హోదాలో ఉన్న అధికారి ఢిల్లీలో మకాం వేశారు. రాష్ట్ర పరిణామాలపై కేంద్రం ఏమనుకుంటోంది.. ప్రభుత్వ పెద్దల అంతరంగం ఎలా ఉంది.. ఐబీ నుంచి ఎలాంటి నివేదికలు వెళ్తున్నాయో ఆరా తీసేందుకు ఆ అధికారి దేశ రాజధానిలో కలియదిరుగుతున్నట్లు తెలిసింది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు అత్యంత సన్నిహితంగా ఉండే ఓ శాఖ కార్యదర్శిని కలిసేందుకు వెళ్లగా అపాయింట్‌మెంట్ లభించలేదని తెలిసింది. ఆ అధికారి పీఎంవో సమావేశంలో ఉండడంతో మీటింగ్ కార్యరూపం దాల్చలేదని సమాచారం. కేంద్రంలోనే మరో ఇద్దరు సీనియర్ కార్యదర్శులను కలిసేందుకు చేసిన ప్రయత్నం కూడా ఫలించలేదని అంటున్నారు.

## బాబుది మొసలికన్నీరు

- ఆయన్ను నమ్మి రైతులు మోసపోవద్దు
- అనవసరపు ఆందోళనలొద్దు
- మీ భూముల్ని అభివృద్ధిచేసి ఇస్తాం
- అక్కడ ఆందోళన చేస్తోంది కొద్ది మందే
- 2 చానళ్లు, పత్రికల విస్తృత ప్రచారం: బొత్స



విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోనే అన్నీ ఉండాలంటూ ఆందోళన చేస్తున్నవారి వద్దకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లి మొసలికన్నీరు కార్చుతున్నారని పురపాలక మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఆయన మాటలకు దయచేసి మోసపోవద్దని, అనవసర ఆందోళనతో జీవితాలను నాశనం చేసుకోవద్దని రాజధాని ప్రాంత రైతులకు సూచించారు. 'రాజధాని వచ్చినంత మాత్రాన అభివృద్ధి జరగదని గతంలో చంద్రబాబే చెప్పారు. ఇప్పుడు రాజధానిని తరలిస్తే అభివృద్ధి ఆగిపోతుందని ఆ ప్రాంత ప్రజలను ఎందుకు రెచ్చగొడుతున్నారో చెప్పాలి' అని కోరారు.

### రాజధానికి 5వేల కోట్లేనా?

ఐదేళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు రూ.1.95 లక్షల కోట్లు అప్పులు చేస్తే కేవలం ఐదు వేల కోట్లు మాత్రమే రాజధానికి ఖర్చుపెట్టారని, దీనికి సమాధానం ఇవ్వాలని బొత్స డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం రాజధాని కోసం ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి తిరిగి రైతులకు ఇస్తామని, ఆ విషయంలో ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. రాజధానిపై కొద్ది మంది వ్యక్తులు ఆందోళనలు చేస్తుంటే రెండు చానళ్లు, పత్రికలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. రాజధాని ఏర్పాటు విషయంలో ప్రాంతీయ అసమానతలు రాకూడదనే జీఎన్ రావు కమిటీని సీఎం జగన్ వేశారని బొత్స తెలిపారు. కమిటీ నివేదికపై ఈనెల 27న కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అమరావతి ప్రాంతాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. తమది చంద్రబాబు మాదిరిగా విజన్ 2050లా ఏళ్ల తరబడికాలంగడిపే ప్రభుత్వంకాదని,వారానికి, రోజుకు ఓవిజన్‌తో ముందుకెళతామన్నారు.

# ఉంటుందా.. పోతుందా?

- కుదిస్తారా.. మళ్లీ 'ఉడా' చేస్తారా?
- సీఆర్‌డీఏ భవితవ్యంపై సమాలోచనలు!
- రెండు చట్టాలపై లోతుగా పరిశీలన

(ఆంధ్రజ్యోతి-అమరావతి)

రాష్ట్ర రాజధానిగా అమరావతి కొనసాగే విషయంపైనే తీవ్ర సందిగ్ధత నెలకొన్న ప్రస్తుత తరుణంలో దాని రూపకల్పన, నిర్మాణ బాధ్యతలను చేపట్టిన ఏపీసీఆర్‌డీఏ భవితవ్యంపైనా నీలినీడలు కమ్ముకుంటున్నాయి! రాజధానినే ఇక్కడి నుంచి తరలించేస్తే.. దాని నిర్మాణమే ప్రధాన లక్ష్యంగా ఆవిర్భవించిన సీఆర్‌డీఏ ప్రాధాన్యం సైతం దానంతటదే గణనీయంగా పడిపోతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సీఆర్‌డీఏను పూర్తిగా రద్దుచేయడమో.. లేక దాని స్థాయిని బాగా తగ్గించి, పూర్వపు విజయవాడ-గుంటూరు-తెనాలి-మంగళగిరి పట్టణాభివృద్ధి సంస్థ (వీజీటీఎం ఉడా)గా మళ్లీ నామకరణం చేయడమో జరగవచ్చని సమాచారం. ఇప్పటికే ఈ అంశంపై ప్రభుత్వ స్థాయిలో చర్చలు మొదలయ్యాయని, సంబంధిత ఉన్నతాధికారులు భావి కార్యాచరణపై న్యాయ నిపుణులతో సంప్రదింపులు ప్రారంభించారని తెలుస్తోంది! ఇందులో భాగంగా ఏపీసీఆర్‌డీఏ చట్టంతోపాటు దాని పూర్వ రూపమైన వీజీటీఎం ఉడా (విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి పట్టణాభివృద్ధి సంస్థ) చట్టాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

### రాజధానే లేనప్పుడు ఇదెందుకు?

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నవ్యాంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ఎంపిక చేసి, దానిని ప్రపంచంలోని అత్యుత్తమ 5 రాజధాని నగరాల్లో ఒకదానిగా రూపొందించాలని నిర్ణయించిన సంగతి విదితమే. ఈ నిర్మాణ భారాన్ని మోసే శక్తిసామర్థ్యాలు వీజీటీఎం ఉడాకు లేవన్న అభిప్రాయంతో ప్రభుత్వం దానిని సీఆర్‌డీఏగా పునర్వ్యవస్థీకరించింది. అతి తక్కువ కాలంలోనే అది బ్రహ్మాండమైన సంస్థగా ఎదిగి, అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధానిని నిర్మించేందుకు తన శాయశక్తులా కృషి చేసింది. రూ.50 వేల కోట్లకుపైగా అంచనా వ్యయంతో ఎన్నెన్నో ప్రాజెక్టులను సంకల్పించింది. అంతకు ముందే ఎక్కడా లేని విధంగా కొద్ది నెలల్లోనే వేల మంది రైతుల నుంచి 33 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ ప్రాతిపదికన సమీకరించి రికార్డు సృష్టించింది. దేశ విదేశాలకు చెందిన ఎందరెందరో నిపుణులు, పేరొందిన సంస్థలు అమరావతి నిర్మాణంలో భాగస్వాములను చేసేందుకు కృషిచేసింది. ఇప్పుడు రాజధానిని తరలిస్తే.. సీఆర్‌డీఏను ఉంచి ఉపయోగమేమిటని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. జగన్ అధికారంలోకి వచ్చిన రోజు నుంచీ.. అంటే సుమారు 7 నెలలుగా అమరావతి నిర్మాణం దాదాపుగా స్తంభించింది. అయితే నేడో రేపో ఆ పనులన్నీ పునరుద్ధరణకు నోచుకుంటాయని, తద్వారా మళ్లీ చేతినిండా పనితో సీఆర్‌డీఏ గతంలో మాదిరిగా కళకళలాడుతుందని ప్రజలతోపాటు అందులో పని చేసే అధికారులు, ఉద్యోగులూ ఆశించారు. కానీ.. జగన్ మూడు రాజధానుల ప్రకటన చేయడంతో ఆ ఆశలన్నీ ఆవిరయ్యాయి. అమరావతి నుంచి త్వరలోనే సచివాలయం, హైకోర్టు తరలిపోవడం ఖాయమని పేరుకు 'లెజిస్లేటివ్ కేపిటల్'గా అమరావతిని ఉంచినా దాని వల్ల ఒరిగేది శూన్యమనుకుంటున్నారు. ఏడాదికి కొద్ది రోజులపాటు జరిగే శాసనసభ, రాజ్‌భవన్, హైకోర్టు బెంచ్ అమరావతిలో కొనసాగితే ఉపయోగం లేదని.. ఇప్పటికే చేపట్టిన పలు పథకాలకు ఫుల్‌స్టాప్ పడుతుందని చెబుతున్నారు. ఈ కారణాల వల్ల ఇకపై ఇక్కడ సీఆర్‌డీఏ చేయించాల్సిన లేదా చేపట్టాల్సిన భారీ ప్రాజెక్టులేవీ ఉండవని.. పర్యవసానంగా ఈ సంస్థ ఆవశ్యకతా ఉండదని అభిప్రాయపడుతున్నారు.

### రద్దు.. అంత ఈజీ కాదు..!

ఒకవేళ రాజధాని అమరావతి నుంచి తరలితే దాని నిర్మాణానికి వేలాదిమంది రైతులు ఇచ్చిన భూముల పరిస్థితి ఏమి కానుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రాజధాని నిర్మాణానికి మాత్రమే తాము భూములిచ్చామని, ఇప్పుడు రాజధానే ఇక్కడి నుంచి వెళ్లిపోతే తమకు అంధకారమేనని పేర్కొంటూ రాజధాని గ్రామాల రైతులు, ఇతర వర్గాలు కొన్ని రోజులుగా పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. వారిచ్చిన భూములను తిరిగి ఇచ్చేస్తామని కొందరు రాష్ట్ర మంత్రులు చెబుతుండగా.. ఇంకొందరేమో ఎల్పీఎస్ నిబంధనల ప్రకారం వారికి ఇంకో ఐదేళ్లపాటు వార్షిక కౌలు చెల్లిస్తామని, రైతులకిచ్చిన రిటర్నబుల్ ప్లాట్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని అంటున్నారు. వీటిలో ఏది చేయాలన్నా సీఆర్‌డీఏ మనుగడలో ఉండడం తప్పనిసరన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజధాని ప్రాంతంలోని భూమి లేని పేదలు, వ్యవసాయ కార్మికులకు గత ఐదేళ్లుగా ఇస్తున్న నెలవారీ పింఛన్లను కూడా గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం మరో ఐదేళ్లు ఇవ్వాల్సి ఉంటుంది. దీని పర్యవేక్షణకు సీఆర్‌డీఏ తప్పనిసరి. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు భవితవ్యం కూడా ప్రస్తుతం ఊగిసలాటలో ఉంది. వీటితోపాటు సీఆర్‌డీఏ గతంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలపై వివిధ న్యాయస్థానాల్లో కేసులున్నాయి. ఈ కారణాల దృష్ట్యా సీఆర్‌డీఏను ఇప్పటికిప్పుడు రద్దు చేయడం, దాని స్థాయి తగ్గించడం అంత సులభం కాదని న్యాయ నిపుణులు చెబుతున్నట్లు తెలిసింది.

## కమిషనర్ చెబితేనే ఆ రంగులేశాం!

- వైసీపీ రంగులపై గుంటూరు కలెక్టర్ వివరణ
- బాబు హయాంలో పసుపురంగేశారు: సర్కారు
- అన్ని వివరాలు ఇవ్వాలని హైకోర్టు ఆదేశం



అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భవనాలకు తెలుపు, నీలం, ఆకుపచ్చ రంగులు వేయాలంటూ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ గిరిజా శంకర్ ఆదేశించారని, దీంతో తాము గుంటూరులోని వట్టిచెరుకూరు మండలం పల్లపాడు గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఆ రంగులు వేయించామని గుంటూరు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన హైకోర్టుకు నివేదించారు. పంచాయతీ కార్యాలయాలకు వైసీపీ పతాక రంగులు వేయడాన్ని అడ్డుకోవాలని కోరుతూ పల్లపాడు గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వరరావు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా కలెక్టర్ నివేదికను అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ధర్మాసనం ముందుంచారు. గత ఆగస్టు 28న కమిషనర్ గిరిజా శంకర్ జిల్లా కలెక్టర్లకు లేఖ రాశారని నివేదికలో కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ భవనాలకు రంగుల మార్పిడిపై చర్యలు తీసుకోవాలని సూచించడంతో పాటు నమూనా కూడా పంపించారని, ఆ మేరకు తాము చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నిధులతో రంగుల మార్పిడి చేపట్టామన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ఒక పార్టీ పతాక రంగుల్ని ప్రభుత్వ భవనాలకు ఎలా వేస్తారని ప్రశ్నించింది. ఈ సందర్భంగా అదనపు అడ్వకేట్ జనరల్ బదులిస్తూ.. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ కార్యాలయాలకు పసుపు రంగు వేశారని తెలిపారు. దీనిని రికార్డు చేసుకున్న ధర్మాసనం.. ఆ వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని, దానిపైనా చర్యలు తీసుకుంటామని పేర్కొంది. అంతేగాక ఎన్నికల కమిషన్‌ను కూడా ప్రతివాదిగా చేర్చేందుకు పిటిషనర్‌కు వీలు కల్పించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి నెలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎం.వెంకటరమణలతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## రంగా వర్సిటీ వీసీ నియామకం సబబే: హైకోర్టు

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ వి.దామోదరనాయుడుకు ఊరట లభించింది. వీసీగా ఆయనకున్న అర్హతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఆయన నియామకం సబబేని తేల్చి చెప్పింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎం.వెంకటరమణలతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తగిన అర్హతలు లేకుండానే దామోదరనాయుడును 2017లో నాటి ప్రభుత్వం వీసీగా నియమించిందని, ఆయన నియామకానికి సంబంధించి దాఖలైన జీవోను రద్దు చేయాలని అభ్యర్థిస్తూ గతంలో కొంత మంది హైకోర్టును ఆశ్రయించారు.

## 'బార్ల' ఉపసంహరణపై స్టే: హైకోర్టు

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బార్లను తగ్గించాలన్న ప్రభుత్వ ప్రయత్నానికి హైకోర్టులో చుక్కెదురైంది. బార్ల లైసెన్సులను ఉపసంహరించుకుంటూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై స్టే విధించింది. అదేవిధంగా కొత్త లైసెన్సుల మంజూరు ప్రక్రియ సహా తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేసింది. బార్ల యజమానులు దాఖలు చేసిన పిటిషన్లను విచారణకు స్వీకరించిన హైకోర్టు దీనిని ఆరు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎం.వెంకటరమణలతో కూడిన ధర్మాసనం సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## రైతే రాజు కావాలి.. కన్నా ట్వీట్

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'ఏ దేశమైనా అభివృద్ధి సాధించాలంటే, ఏ దేశ ప్రజలైనా సుఖ సంతోషాలతో ఉండాలంటే.. రైతన్నల శ్రమ జీవనమే అన్నింటికీ ఆధారం, మూలం' అని బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం రైతు దినోత్సవం సందర్భంగా ఆయన ఈ ట్వీట్ చేశారు.

## వైఎస్ స్మృతివనం హైదరాబాద్‌లోనా?: వీహెచ్

హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో వైఎస్ స్మృతి వనాన్ని ఎందుకు ఏర్పాటు చేయాలని పీసీసీ మాజీ చీఫ్ వి. హన్మంతరావు ప్రశ్నించారు. పార్టీ నాయకత్వాన్ని ఉద్దేశిస్తూ.. మనది ఇందిరా కాంగ్రెస్సా.. లేక వైఎస్ కాంగ్రెస్సా అని సోమవారం గాంధీభవన్‌లో వ్యాఖ్యానించారు. పంజాగుట్టలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠంచడానికి తాను ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకున్నప్పుడు పీసీసీ అధ్యక్షుడు, ఇతర కాంగ్రెస్ నేతలు ఎందుకు స్పందించలేదని నిలదీశారు.

## బొత్స సోదరుడి భూ కబ్జా యత్నం!

- స్పందనలో జేసీ, ఎస్పీలకు బాధితుల ఫిర్యాదు



స్పందనలో విజయనగరం ఎస్పీ రాజకుమారికి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కలెక్టరేట్(విజయనగరం), డిసెంబరు 23: మంత్రి బొత్స సత్యనారాయణ సోదరుడు ఆదిబాబు భూ కబ్జాకు పాల్పడుతున్నారని పలువురు బాధితులు స్పందన కార్యక్రమంలో విజయనగరం జేసీ, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. తాము మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారమని, 37 సంవత్సరాల కష్టంతో విజయనగరంలోని సత్యసాయినగర్ లే అవుట్‌లోని సర్వే నెంబరు 53-4, 53-5లలో కొంత స్థలాన్ని కొనుగోలు చేశామని విజయనగరానికి చెందిన కిరణ్, బి.రాజేష్, టీపే సూర్యనారాయణ, అశోక్‌కుమార్, వాసవి, పద్మావతి, గోవిందమ్మ వాపోయారు. ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ఆదిబాబు ప్రయత్నిస్తున్నారని బాధితులు ఆరోపించారు.

## రాజధానిపై చర్చకు సిద్ధమా!: డొక్కా

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): "రాజధాని లేని రాష్ట్రం దేశంలో ఎక్కడైనా ఉందా?రాజధాని అంటే మంత్రి బొత్స సత్యనారాయణకు అర్థం తెలుసా? తుగ్లక్ తమ్ముడిలా వ్యవహరిస్తున్న బొత్స... రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఆదాయ వనరుగా చేపట్టిన ప్రజా రాజధాని అమరావతిపై బహిరంగ చర్చకు సిద్ధమా?" అని టీడీపీ నేత, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఉపాధి కల్పన, సంపద సృష్టి, పేదరిక నిర్మూలనే ధ్యేయంగా రాజధాని నిర్మాణం చేపట్టి, 13 జిల్లాల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం ప్రణాళికలు వేసిన విషయం మంత్రి బొత్స గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధితో పాటు రాజధాని నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించేందుకు వైసీపీ ప్రభుత్వం వేసిన జీఎన్‌రావు కమిటీకి రాజధాని ఎంపిక చేసే అర్హత లేదన్నారు. ఇది చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. జీఎన్‌రావు కమిటీలో ఉన్న సభ్యులందరికీ రాష్ట్ర స్థితిగతులపై ఎటువంటి అవగాహన లేదన్నారు.

## రాజధాని పేరుతో రియల్ వ్యాపారం: సీపీఎం

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజధాని పేరుతో టీడీపీ, వైసీపీలు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వి.శ్రీనివాసరావు ఆరోపించారు. దేశంలో జరుగుతున్న పరిణామాలు ప్రజలపై ఎంతటి తీవ్ర ప్రభావం చూపినా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఏ మాత్రం పట్టడం లేదని విమర్శించారు. ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాకు దేశం, మతం అంటే భక్తి లేదని.. ఏదో ఒకటి చేసి భరతమాత గుండెల్లో గునపం దింపే దుర్మార్గులని ఆరోపించారు.

## అమరావతికే మా మద్దతు: నారాయణ

తిరుపతి సిటీ, డిసెంబరు 23: నవ్యాంధ్ర రాజధానిగా అమరావతికే తమ మద్దతని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్ర కమిటీ తీర్మానం కూడా చేసిందని సోమవారం తిరుపతిలో చెప్పారు. రాష్ట్రంలో మూడు రాజధానులు ఏర్పాటు చేయాలని జీఎన్ రావు కమిటీ సిఫారసు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ కమిటీ సిఫారసులను తాము గౌరవించడం లేదని స్పష్టం చేశారు. అమరావతి ప్రాంతాన్ని రాజస్థాన్ ఎడారిగా అభివర్ణిస్తూ స్పీకర్ తమ్మినేని సీతారాం వ్యాఖ్యానించడం బాధాకరమని, స్పీకర్ ఇలా రాజకీయాలు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

# 3 ఒక రాష్ట్రం.. రాజధానులు

విజయవాడ ● మంగళవారం 24 డిసెంబరు 2019

## రాజధాని పోరు.. నేడు వెంకయ్యతో భేటీ

విజయవాడ: 'ఆంధ్రప్రదేశ్‌ను రక్షించండి.. అమరావతిని కాపాడండి' నినాదంతో వివిధ ప్రజాసంఘాలు ఏకమయ్యాయి. అమరావతి నుంచి రాజధానిని విశాఖకి, హైకోర్టును కర్నూలుకు తరలించాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 20 సంఘాల ప్రతినిధులు సోమవారం విజయవాడలో సమావేశమయ్యారు. రాజధానిని అమరావతిలోనే కొనసాగించాలనే డిమాండ్‌తో ఉద్యమించాలని తీర్మానించారు. 'అమరావతి పరిరక్షణ సమితి' పేరుతో జేఏసీని ఏర్పాటు చేశారు. గన్నవరంలోని స్వర్ణభారతి ట్రస్టులో బస చేసిన ఉప రాష్ట్రపతి వెంకయ్యను మంగళవారం కలిసి ప్రభుత్వ నిర్ణయంపై చర్చించనున్నారు.



వైసీపీకి ఓటు వేసి తప్పు చేశానంటూ చెప్పులతో మందడంలో కొట్టుకుంటున్న వ్యక్తి

# సర్కారుకు సవాల్!

## హైకోర్టు జడ్జితో విచారణ జరపండి: చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): "రాజధాని అమరావతిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందంటున్నారు. దీనిపై హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించండి. తప్పు చేసినవాళ్లను కఠినంగా శిక్షించండి. అంతే తప్ప ఆ పేరుతో రాజధాని రైతుల్ని శిక్షించవద్దు" అని విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తనపై కోపంతో ప్రజలు, రైతుల్ని శిక్షించడం సరికాదన్నారు. రాజధాని రైతులు చేపట్టిన 'రిలే నిరాహార దీక్ష' శిబిరాలకు వెళ్లి వారికి చంద్రబాబు సంఘీభావం ప్రకటించారు. తుళ్లూరు, వెలగపూడిలో రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. "ఒక కుక్కను చంపేందుకు దానిపై పిచ్చిదనే ముద్ర వేస్తారు. అలాగే... ఇన్‌సైడర్ ట్రేడింగ్, భారీ వ్యయం, ముంపు ఇలా రకరకాల కారణాలు చూపించి అమరావతిని చంపేస్తున్నారు" అని ఆక్రోశించారు. రాజధాని నిర్మాణానికి డబ్బులు ఎక్కడి నుంచి తేవాలంటున్న మంత్రుల వాదనపై మండిపడ్డారు. "ప్రభుత్వానికి సవాల్ చేస్తున్నా. రాజధాని నిర్మాణానికి ప్రభుత్వం ఒక్క రూపాయి ఖర్చు చేయనక్కర్లేదు. రైతుల నుంచి తీసుకుని అభివృద్ధి చేశాక 10వేల ఎకరాల భూమి ఉంది. అందరికీ ఇళ్లు, ప్రభుత్వ సంస్థల కోసం తీసేసినా ఇంకా ఐదువేల ఎకరాలు ఉంటుంది. ఇందులో కొంత భూమి అమ్మితే ఆ డబ్బుతోనే రాజధాని నిర్మించ వచ్చు" అని తెలిపారు. కావాలంటే దీనిపై ఒక కమిటీ వేయాలని సూచించారు.

అందరూ ఆలోచించాలి

రాజధాని విషయంలో ఐదు కోట్లమంది ఆంధ్రులు ఆలోచించాలని చంద్రబాబు కోరారు. "మళ్లీ ఈ సమస్య ఎందుకు వచ్చింది? మద్రాసు, కర్నూలు, హైదరాబాద్... ఇలా రాజధానులు మారుతూ వచ్చాయి. రాష్ట్రం విడిపోయాక నిలువనీడలేని పరిస్థితిలో ఇక్కడి రైతులు మొత్తం ప్రజల కోసం ఆలోచించి భూములిచ్చారు. ఎప్పుడో పరిష్కారమైపోయిన రాష్ట్ర రాజధాని సమస్యను మళ్లీ ఇప్పుడు లేవనెత్తడం సరైందేనా?" అని ప్రశ్నించారు. అందరికీ అందుబాటులో.. సమదూరంలో ఉండేలా అమరావతిని రాజధానిగా ఎంపిక చేశామన్నారు. "రాజధానికి అటు ఏడు జిల్లాలు, ఇటు ఆరు జిల్లాలు ఉన్నాయి. ఒక ఇల్లు కట్టాలంటేనే రెండేళ్లు పడుతుంది. హైదరాబాద్‌లో ఒక్క పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని ఐదేళ్లలో కట్టలేకపోయారు. అలాంటిది 33 వేల ఎకరాలు భూసేకరణ చేసి.. సింగపూర్‌తో ప్రణాళిక వేయించి నిర్మాణాలు చేసే స్థాయికి తీసుకొచ్చాం" అని తెలిపారు.

ఒక సచివాలయం, ఒక హైకోర్టు ఉన్నంత మాత్రాన ఏ నగరమూ అభివృద్ధి చెందదని చంద్రబాబు తెలిపారు. "హైదరాబాద్‌లో అన్నీ ఉన్నప్పటికీ... హైటెక్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, రింగ్‌రోడ్డు వచ్చాకే అభివృద్ధి వేగంగా జరిగింది. హైదరాబాద్, సికింద్రాబాద్ రెండు నగరాలకు తోడు... సైబరాబాద్ అనే మూడో నగరాన్ని నిర్మించాం. అదేవిధంగా విజయవాడ-గుంటూరు రెండు నగరాల మధ్య మూడో నగరం నిర్మించాలనుకున్నాం" అని తెలిపారు. 2014 సెప్టెంబరు 4న అమరావతిపై శాసనసభలో చర్చ జరిగినప్పుడు... విజయవాడలో రాజధాని పెట్టడాన్ని స్వాగతిస్తున్నామని జగన్ అన్నారని గుర్తు చేశారు. రాజధాని ఏ ప్రాంతంలో పెట్టినా... కనీసం 30 వేల ఎకరాలు సేకరించాలి అని కూడా అన్నారన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక ఎందుకు మాట తప్పారు? ఎందుకు మడమ తిప్పారు? అని నిలదీశారు. "నాడు 30వేలు ఎకరాలు కావాలని... ఇప్పుడు 500 ఎకరాలు చాలని ఎలా అంటున్నారు. జీఎన్‌రావు కమిటీని వేశానన్నారు. కానీ దాని నివేదిక రాకముందే ప్రశ్నపత్రం లీక్ చేశారు. నివేదిక ఎలా ఇవ్వాలో సీఎం చెప్పేశారు. అది జీఎన్‌రావు కమిటీ నివేదిక కాదు. జగన్ రెడ్డి నివేదిక" అని చంద్రబాబు విమర్శించారు.

### దళిత రైతులకు అన్యాయం

"అసైన్డ్ భూములు ఉన్నవాళ్లకు కూడా ప్లాట్లు ఇచ్చాం. అమ్ముకునే హక్కు కూడా ఇచ్చాం. ఇప్పుడది వీలుకాదంటూ కొట్టేయడం దళితులకు అన్యాయం చేయడమే! ఒక సామాజిక వర్గమే ఉందంటూ ప్రభుత్వం కక్ష కడుతుందా? అమరావతి ప్రాంతం ఎస్సీ నియోజకవర్గంగా ఉంది. ఇక్కడ ఎస్సీలు ఎక్కువ. పక్కనున్న నందిగామ, పామర్రు కూడా ఎస్సీ నియోజకవర్గాలే. కృష్ణా, గుంటూరుల్లో బ్రాహ్మణులు, వైశ్యులు, కాపులు, రెడ్డి, కమ్మ, దళితులు... ఉన్నారు. ఇప్పుడు అందరిదీ ఒకటే కులం. అమరావతి కులం. అమరావతికి న్యాయం చేయాలి" అని చంద్రబాబు డిమాండ్ చేశారు.





తుళ్లూరులో ఆందోళనకు హాజరైన జనం (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న చంద్రబాబు

### ముంపు ఎక్కడుంది?

అమరావతి శ్మశానమని ఒక మంత్రి చెప్పగా... దీనిని స్పీకర్ ఎడారితో పోల్చారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ముంపు ప్రాంతమని ఇంకొకరు అంటున్నారని తెలిపారు. "గ్రీన్ ట్రైబ్యునల్ ఇది ముంపు ప్రాంతం కాదని స్పష్టంగా చెప్పింది. 1953, 2009లో అతి పెద్ద వరదలు కృష్ణా నదికి వచ్చాయి. అప్పుడు కూడా అమరావతి ప్రాంతం ముంపునకు గురికాలేదు. కొండవీటి వాగు సమస్య తీర్చేందుకు ఎత్తిపోతల పథకాన్ని కూడా చేపట్టాం. ఇంకోవైపు ఇక్కడ పునాదులు వేయడానికి చాలా ఖర్చవుతుందని ప్రచారం చేస్తున్నారు. ఇక్కడి భూములకు 150మెట్రిక్ టన్నుల బేరింగ్ కెపాసిటీ ఉందని... చెన్నై, బెంగళూరుకంటే నిర్మాణ వ్యయం తక్కువని చెన్నై ఐఐటీ ఒక నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక కూడా ప్రభుత్వం దగ్గరే ఉంది" అని తెలిపారు.

### విశాఖ అంటే ఎంతో ప్రేమ

విశాఖపట్నం అంటే తనకు ఎంతో అభిమానమని చంద్రబాబు తెలిపారు. "అక్కడి మనుషులు మంచివారు. విశాఖ హుద్‌హుద్ బారిన పడి ఇక కోలుకోదు అన్న బాధలో అంతా ఉన్నప్పుడు నేనే అక్కడుండి మళ్లీ పరిస్థితి చక్కదిద్దా. విశాఖను ఆర్థిక నగరంగా అభివృద్ధి చేసే దిశగా ముందుకెళ్లా. ఐటీ హబ్‌గా చేశాం. విశాఖలో అతిపెద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి లులూ గ్రూప్‌ను ఒప్పించాం. ఇక్కడ అదానీ గ్రూప్ రూ.70వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఇప్పుడు వాటన్నింటినీ పోగొట్టి... సచివాలయం కడతారట! విశాఖపట్నాన్ని ఐటీ హబ్, పర్యాటక కేంద్రంగా, ఆర్థిక నగరంగా అభివృద్ధి చేయాలి. అది మంచి నగరం. కానీ అమరావతిని పరిపాలనా నగరంగా చేస్తామని ఇక్కడి రైతులకు మాటిచ్చాం" అని తెలిపారు. తమ హయాంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రచించామని చంద్రబాబు అన్నారు. "కర్నూలులో విమానాశ్రయం, విత్తన అభివృద్ధి కేంద్రం, సోలార్ ప్రాజెక్టులు పెట్టాం. తిరుపతిని హార్డ్‌వేర్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు స్థానంగా చేశాం. అనంతపురంలో కియ పరిశ్రమ తెచ్చాం. కేంద్రం ఇచ్చిన 13 ప్రతిష్ఠాత్మక సంస్థలను అమరావతిలో కాకుండా రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాల్లో పెట్టాం" అని చంద్రబాబు గుర్తు చేశారు. అమరావతి రాజధాని గ్రామాల్లో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో అన్ని పార్టీల నేతలు పాల్గొంటున్నారని తెలిపారు. ప్రపంచ రైతు దినోత్సవం రోజునే రైతులు పిల్లాపాపలతో సహా రోడ్డెక్కారని... ఇన్ని లక్షలమంది రైతులు, ప్రజల ఉసురు పోసుకోకూడదని ప్రభుత్వానికి హితవు పలికారు.

### రైతులతోనే... తుళ్లూరు వైసీపీ శాఖ నిర్ణయం

రాజధాని రైతులకు అండగా ఉండాలని తుళ్లూరు మండల వైసీపీ నిర్ణయించిందని మండల అధ్యక్షుడు మాదల మహేంద్ర, మాజీ ఎంపీపీ, రాయపూడి సొసైటీ అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి వెల్లడించారు. రాజధానికి భూములిచ్చిన వారిలో అన్ని వర్గాలు, పార్టీల అభిమానులు ఉండటం వల్లే తాము ఈ నిర్ణయం తీసుకొన్నామన్నారు. నేరుగా వెళ్లి రైతులకు మద్దతు ప్రకటించలేకపోతున్నందుకు బాధగా ఉందన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, బాపట్ల ఎంపీ నందిగం సురేశ్‌ను సంప్రదించి సీఎం దగ్గరకు వెళ్లి రైతుల బాధలు చెప్పాలని నిర్ణయించుకున్నామన్నారు. "మూడు రాజధానుల ప్రకటన చేసిన నాటినుంచీ రాజధాని రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. రైతు కుటుంబాల్లోని ఆడవారి కన్నీరు రాష్ట్రానికి మంచిది కాదు" అని మల్లెల వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు ఆలోకం సురేశ్, వెంకటరెడ్డి, వెంగలరెడ్డి, రాంబాబు, వినోద్ యడ్లపల్లి రమేశ్, తురకా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమక్షంలో ఒప్పుకొంటారా!

ముఖ్యమంత్రి జగన్ నిర్ణయం సరైందని, విశాఖలో సచివాలయం ఏర్పాటుకు ఒప్పుకొంటున్నామని రాయలసీమకు చెం దిన వైసీపీ ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యే లు ప్రజాపక్షంలో ప్రకటిస్తారా? దమ్ముంటే హైకోర్టును విశాఖలో పెట్టి సచివాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలి.

- కాల్వ శ్రీనివాసులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు

### ప్రజల మధ్య చిచ్చు కోసమే

నవ్యాంధ్ర ప్రజల మధ్య చిచ్చురేపడానికే వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటన చేసింది. విశాఖలో సెక్రటేరియేట్ ఏర్పాటు చేస్తే సీమ ప్రజలు రాను పోను 2 వేల కిలోమీటర్లు ప్రయాణించాలి. రూ.20 వేల దాకా ఖర్చు చేయాలి.

- ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ ఎమ్మెల్సీ

### హైకోర్టుతో సీమకు ఒరిగేదేమీ లేదు

హైకోర్టు వచ్చినంతమాత్రాన కర్నూలుకు నీళ్లు రావు. పెట్టుబడులు రావు. హైకోర్టు ఇచ్చి నీళ్లు, పెట్టుబడులు పోగొడతామంటే సహించేది లేదు. హైకోర్టు ఒక్కటే కర్నూలుకు ఇచ్చి సీఎం జగన్ చేతులు దులుపుకోవడం సరికాదు.

- భూమా అఖిల ప్రియ, మాజీ మంత్రి

### ఏడ్చే పిల్లాడికి ఎలక్కాయ ఇవ్వడమే

మూడు రాజధానులతో రాయలసీమను వంచిస్తున్న సీఎం జగన్.. మూడు ముక్కలు చేసిన హైకోర్టును కర్నూలుకు ఇస్తామని చెప్పడం ఏడ్చే పిల్లవాడికి ఎలక్కాయ ఇవ్వడం కాదా!.

- బీటీ నాయుడు, ఎమ్మెల్సీ

### అది దళితుల రాజధాని

అమరావతి దళితుల రాజధాని. బడుగు, బలహీన వర్గాలు ఎక్కువగా నివసించే ప్రాంతం. గణాంకాలు ఇదే చెబుతున్నాయి. అమరావతిలో నిజంగా ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని నిరూపిస్తే రాజీనామాలకు మేం సిద్ధం. నిరూపించలేని పక్షంలో వైసీపీ ప్రజాప్రతినిధులు రాజీనామాలు చేయగలరా?

- పంచుమర్తి అనురాధ, టీడీపీ

### విశాఖను దేవుడే రక్షించాలి

పాకిస్తాన్ నుంచి విశాఖను రక్షించేందుకు సైన్యం ఉంది. కానీ విశాఖకు అసలు ముప్పు ప్రస్తుతం మన జగనన్న అండ్ గ్యాంగ్(వైసీపీ) నుంచే. వీళ్ల నుంచి విశాఖను దేవుడే రక్షించాలి. అమెరికాలో లాస్ వేగాస్ నగరాన్ని ఎడారిలోనే నిర్మించారు. ఒకసారి అక్కడికి వెళ్లి చూసి రా నాయనా(తమ్మినేని సీతారాం).

- కేశినేని నాని, టీడీపీ ఎంపీ(ట్విటర్‌లో)

### విశాఖపై కక్షపూరితంగా జగన్

విశాఖపై జగన్మోహన్‌రెడ్డికి ప్రేమ లేదు. గత ఎన్నికల్లో ఆయన తల్లి విజయమ్మను విశాఖలో ఓడించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో నగరంలో అన్ని సీట్లు టీడీపీకి వచ్చాయి. ఈ అక్కసుతో విశాఖ ప్రజలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. విశాఖలో రూ.70 వేల కోట్లతో ఆదాని గ్రూప్ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకొస్తే దాన్ని ఎందుకు రద్దు చేశారో జగన్ విశాఖ ప్రజలకు సమాధానం చెప్పాలి. విశాఖలో మెడిటెక్ జోన్, సాఫ్ట్‌వేర్ హబ్‌ల ఏర్పాటును అడ్డుకున్నారు.

- అచ్చెన్నాయుడు, టీడీఎల్పీ ఉపనేత

### అది చారిత్రక తప్పిదం: తులసిరెడ్డి

అమరావతిని మార్చాలనుకోవడం చారిత్రక తప్పిదమని కాంగ్రెస్ సీనియర్ నేత తులసిరెడ్డి తెలిపారు. ఇది అందరికీ ఆమోదయోగ్యమైన రాజధాని అని స్పష్టం చేశారు. సీఎం జగన్ చేష్టలకు సొంత మనుషులే తలలు పట్టుకుంటున్నారని చెప్పారు. పులివెందుల నుంచి జగన్ మనుషులు తనకు ఫోన్ చేసి ఆయన తీరు పిచ్చోడి చేతికి రాయి ఇచ్చినట్లుగా గాక ఏకే 47 ఇచ్చినట్లుగా ఉందని వాపోతున్నారని తెలిపారు. సోమవారం ఆయన తుళ్లూరులో రైతులు చేస్తున్న ఆందోళనకు కాంగ్రెస్ తరపున మద్దతు తెలిపారు.

### 27 తర్వాత కాంగ్రెస్ వైఖరి: కేవీపీ

మూడు రాజధానుల విషయంలో కాంగ్రెస్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు అన్నారు. పార్టీ వైఖరేంటో ఈ నెల 27వ తేదీ తర్వాత చెబుతామని తెలిపారు. పార్టీ నిర్ణయం తప్ప తమకు స్వతంత్ర అభిప్రాయాలు ఉండవని సోమవారం విజయవాడలో చెప్పారు.

### ఐదో రాజధానీ వస్తుందేమో: చింతా

"ఏపీకి కర్నూలు, హైదరాబాద్, అమరావతి.. ఇప్పుడు విశాఖపట్నం పేరు వచ్చినట్టు భవిష్యత్‌లో ఐదో రాజధాని కూడా వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. 400 ఏళ్ల క్రితమే తిరుపతి రాజధాని అవుతుందని బ్రహ్మంగారు చెప్పారు. ఆయన మాటా నిజం కావచ్చు" అంటూ కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ తిరుపతిలో అన్నారు. జగన్ రాష్ట్రాన్ని ముక్కలు చేసి పాలన సాగిస్తున్నారని ఆరోపించారు.

### పచ్చచొక్కాల ఉద్యమం: స్పీకర్

"ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన మూడు రాజధానుల ప్రకటనకు వ్యతిరేకంగా అమరావతి ప్రాంతంలో కొంతమంది పచ్చచొక్కా వాళ్లు స్వప్రయోజనం కోసం ఉద్యమిస్తున్నారు. దేనికోసం ఉద్యమిస్తున్నారో ఒక్క ముక్కలో పచ్చచొక్కాల నాయకుడు ప్రజలకు వివరణ ఇవ్వాలి. మూడు రాజధానులు వద్దనుకొంటున్నారా? లేదా కావాలని అనుకుంటున్నారా! అనే విషయంపై స్పష్టత ఇవ్వాలి" అని శాసనసభాపతి తమ్మినేని సీతారాం శ్రీకాకుళంలో డిమాండ్ చేశారు.

### రాజధాని ఇక్కడే: రఘునాథబాబు

మూడు రాజధానుల ప్రకటనపై బీజేపీ సీనియర్ నాయకులు, పొగాకు బోర్డు చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలి కానీ, పరిపాలన కాదని స్పష్టం చేశారు. రాజధాని రైతుల నిరసనకు రఘునాథబాబు సంఘీభావం తెలిపారు. అమరావతి నుంచి రాజధానిని తరలించడం కుదరదన్నారు.

# రాజధాని రణం

(మొదటి పేజీ తరువాయి)

కల్యాణ్, శ్యామాప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాల్ ఉపాధ్యాయ ఫొటోలు! ఈ శిబిరాలకు ముస్లింలు, రాజధాని వైసీపీ కార్యకర్తలు, నిర్మాణ కూలీలు మద్దతు తెలిపి.. దీక్షల్లో పాల్గొన్నారు. రైతులకు మద్దతుగా బెజవాడలో మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు కార్యాలయాన్ని అమరావతి పరిరక్షణ జేఏసీ నేతలు ముట్టడించారు. వరుసగా ఆరోరోజూ తమ ఆగ్రహాన్నీ, ఆక్రోశాన్నీ చాటుకొన్నారు. 'అది రాజధాని కాదు.. శ్మశానం, ఎడారి' అన్న స్పీకర్ తమ్మినేని సీతారాం వ్యాఖ్యలపై నిరసన శిబిరాలు నిప్పులుకక్కాయి. 'రాజధానుల నిర్ణయం రద్దు కావాలి' అంటూ ఈ శిబిరాల్లో కొందరు నల్లబట్టలు ధరించి దీక్షలుచేపడితే, కళ్లకు నల్లగుడ్డతో గంతలు కట్టుకొని మరికొందరు రోడ్డుపైనే బైఠాయించారు. 'కరకట్ట కమల్‌హాసన్' ఎక్కడ అంటూ ఒకరు మెడలో చెప్పులదండతో అర్ధనగ్నంగా 'రాజధాని' ఆవేదనను కళ్లకు కట్టారు. నడిరోడ్డుపై పశువులను కట్టేసి, ట్రాక్టర్లు, ఎద్దులబండ్లు నిలబెట్టి.. ఎక్కడికక్కడ వాహనాలను రైతులు అడ్డుకొన్నారు. తమను నీడలా వెంటాడుతూ, నిరసనలను వీడియోల్లో చిత్రీకరించడానికి ప్రయత్నించిన పోలీసులతో రైతులు వాగ్వాదానికి దిగారు.

### టెంటు వద్దు.. వేస్తాం..

ధర్నా చేసేందుకు తుళ్లూరులో టెంటు వేస్తున్న రైతులను పోలీసులు అడ్డుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా టెంటు వేశారని అభ్యంతరం తెలిపారు. రోడ్డు పక్కనే వేశామని, వాహనాలకు ఆటంకం లేదని రైతులు సమాధానమిచ్చారు. దీనిపై ఒకదశలో పోలీసులు, రైతులకు మధ్య పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అయినా, వెనక్కి తగ్గకుండా టెంటు వేసుకొని రైతులు ఆందోళన కొనసాగించారు. మద్దతుగా పాఠశాలలు బంద్ పాటించారు. విద్యార్థులు ప్లకార్డులు చేతబూని ఉత్సాహంగా పాల్గొన్నారు. అరగుండు, సగం గీసేసిన మీసంతో కొందరు తుళ్లూరు రహదారిపై నిరసన తెలిపారు. కృష్ణాయపాలెంలో రోడ్డుపై వంటా వార్పు నిర్వహించారు. మందడంలో రైతులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్లు పెట్టి రైతులంతా రోడ్డుపై బైఠాయించడంతో సచివాలయానికి రాకపోకలు నిలిచిపోయాయి. రహదారిపైనే పశువులను కట్టేసి రైతులు తమ ఆవేదన తెలిపారు. నెక్కల్లులో మిరప, పత్తి మొక్కలు మెడలో వేసుకొని ఆందోళన చేపట్టారు. వెలగపూడిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష ఆరో రోజు కొనసాగింది. రాజధాని గ్రామాల్లో పెద్ద ఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి. కరకట్ట నుంచి సచివాలయం వైపు ఎవరూ వెళ్లకుండా కట్టడి చేసే ప్రయత్నం చేశారు. ఈ చర్యలపై అమరావతి పరిరక్షణ సమితి సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. 'మేమేమైనా పాకిస్థాన్‌కు వెళ్తున్నామా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### మేమున్నాం: ముస్లింల సంఘీభావం

తుళ్లూరులో జరుగుతున్న నిరసన కార్యక్రమంలో సోమవారం వందలాది మంది ముస్లిం యువకులు, రైతులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. రోడ్డుపై వంట చేసి అన్నదానం చేశారు. రైతులకు న్యాయం చేయలేని వైఎస్ జగన్ సీఎంగా పనికి రారని ముస్లిం రైతులు మండిపడ్డారు. రాజధాని అమరావతిని కేంద్ర ప్రభుత్వం.. మన రాష్ట్ర పటంలో పొందుపరిచిందని, దానిని మార్చడం సీఎం కాదు కదా.. ఎవరొచ్చినా సాధ్యం కాదని సోహర్ధ అనే విద్యావేత్త.. రైతులకు ధైర్యం చెప్పారు.

### ఉద్యోగుల అసహనం

రాజధాని రైతుల నిరసనతో సచివాలయం బోసిపోయింది. ఉద్యోగులు సచివాలయానికి రావడానికి ఇక్కట్లు పడ్డారు. ఆరు రోజులుగా ఇదే పరిస్థితి! సచివాలయం వైపు తరచూ రైతులు మూకుమ్మడిగా దూసుకురావడానికి ప్రయత్నిస్తుండటంతో.. అక్కడి పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.ఈక్రమంలో అడుగడుగునా తనిఖీ చేస్తుండటంపై కొందరు ఉద్యోగులు అసహనానికి గురవుతున్నారు. కాగా, రాజధానిని తరలించవద్దంటూ విజయవాడలోని మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు కార్యాలయాన్ని వద్ద 'అమరావతి పరిరక్షణ సమితి' ముట్టడించింది. ఉద్యమ నేతలను అక్కడినుంచి పంపించివేయడానికి పోలీసులు చేసిన ప్రయత్నం ఉద్రిక్తతలకు దారితీసింది.

### ఆళ్ల ఆచూకీ తెలపండి

మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కనిపించడం లేదంటూ అమరావతి రైతులు సోమవారం గుంటూరు జిల్లా మంగళగిరి అర్బన్, రూరల్ పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు మూడు రాజధానులు అంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించడం, దానినే బలపరుస్తూ జీఎన్‌రావు కమిటీ నివేదిక ఇవ్వడం.. ఈ పరిణామాలపై రైతులు పోరాడుతున్న నేపథ్యంలో.. ఈ వారం పదిరోజులుగా మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల కనిపించడంలేదని రాజధాని రైతులు పోలీసులను ఆశ్రయించారు. మంగళగిరి మండలం పరిధిలోని రాజధాని గ్రామాలైన నిడమర్రు, బేతపూడి, కురగల్లు, యర్రబాలెం, నవులూరు, కృష్ణాయపాలెం, నీరుకొండ గ్రామాల రైతులు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ జె శ్రీనివాసరావుకు, రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐ సుభానీకి ఫిర్యాదులు అందజేశారు. "ప్రస్తుత తరుణంలో మా గోడు వెళ్లబోసుకుందామంటే మా ఎమ్మెల్యే ఎక్కడ ఉన్నారో తెలియడం లేదు. మంగళగిరి నియోజకవర్గంలో కానీ, కార్యాలయంలో కానీ, నివాసంలో కానీ ఆయన అందుబాటులో లేరు. మా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక మిమ్మల్ని ఆశ్రయించాం. అలాగే ఆయన గురించి మేమంతా తీవ్ర ఆందోళన చెందుతున్నాం. పోలీసు వారు వెంటనే తగు చర్యలు తీసుకుని మా శాసనసభ్యుణ్ణి మాకు అప్పగిస్తారని ఆశిస్తున్నాం" అని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

మంగళగిరి గాంధీ బొమ్మ సెంటర్‌లో నల్ల జెండాలతో రాస్తారోకో చేస్తున్న రైతులు





వెలగపూడిలో ఆందోళన చేస్తున్న మహిళలు

కృష్ణాయపాలెంలో ఆందోళన చేస్తున్న రైతులు, మహిళలు





రాజధానిలోని పెనుమాక గ్రామంలో ఆందోళనకు దిగిన మహిళలు, రైతులు



# విరాట్ నామ 'దశ'కం

కటక్‌లో వెస్టిండీస్‌పై విజయంతో ఈ దశాబ్దిని టీమిండియా విజయంతో ముగించింది. గత పదేళ్లలో భారత్ అన్ని ఫార్మాట్లలో కొనసాగించిన జైత్రయాత్ర వెనుక విరాట్ కోహ్లీ పాత్ర కీలకం. ఈ ప్రయాణంలో వ్యక్తిగతంగా కోహ్లీ చేరుకున్న మైలురాళ్లు..

| | |
|---|---|
| ఓవరాల్‌గా అత్యధిక పరుగులు | 20,960 |
| వన్డేల్లో అత్యధిక పరుగులు | 11,125 |
| టీ20ల్లో అత్యధిక పరుగులు | 2633 |
| అత్యధిక శతకాలు | 69 |
| అత్యధిక అర్ధ సెంచరీలు | 98 |
| అత్యధిక సగటు | 57.58 |
| అత్యధిక బౌండరీలు | 2090 |
| అత్యధిక డబుల్ సెంచరీలు | 7 |

# 'టాప్'గా ముగించారు



**దుబాయ్:** భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ, వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ అంతర్జాతీయ వన్డే ర్యాంకింగ్స్‌ను ఈ ఏడాదిని ఘనంగా ముగించారు. తాజాగా ఐసీసీ వెల్లడించిన ఈ జాబితాలో కోహ్లీ నెంబర్‌వన్.. రోహిత్ నెంబర్‌టుగా ఉన్నారు. వెస్టిండీస్‌తో ముగిసిన వన్డే సిరీస్‌లో రోహిత్ మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. ఇక ఓపెనర్ రాహుల్ ఈ సిరీస్‌లో 185 పరుగులతో రాణించడంతో 17 స్థానాలు మెరుగుపర్చుకుని 71వ ర్యాంకుకు చేరాడు. విండీస్ ఆటగాడు షాయ్ హోప్ తొమ్మిదో ర్యాంకుకు చేరాడు. అలాగే హెట్‌మయెర్ (19), పూరన్ (30), కాట్రెల్ (30), కీమో పాల్ (104) కూడా తమ స్థానాలను మెరుగుపర్చుకున్నారు.

## భారత్ 'ఎ' జట్టు కెప్టెన్‌గా విహారి

**కీపర్‌గా కేఎస్ భరత్**

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్‌లో పర్యటించే భారత్ 'ఎ' జట్లను కూడా సెలెక్టర్లు సోమవారం ప్రకటించారు. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురు ఆటగాళ్లకు చోటు దక్కింది. రెండు నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లకు కెప్టెన్‌గా హనుమ విహారి, వికెట్ కీపర్‌గా కేఎస్ భరత్ ఎంపికయ్యారు. అలాగే హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ అటు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లతో పాటు శుభ్‌మన్ గిల్ ఆధ్వర్యంలో ఆడే వన్డే సిరీస్‌కు ఎంపికయ్యాడు. వెన్నునొప్పి నుంచి కోలుకుంటున్న స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు కూడా వన్డే సిరీస్ జట్టులో చోటు దక్కింది. 8 నెలల నిషేధం ముగించుకున్న పృథ్వీ షా తిరిగి జాతీయ జట్టులో చోటు కోసం ఈ టూర్‌లో సత్తా చాటుకోవాలనుకుంటున్నాడు. అలాగే నాలుగు రోజులపాటు జరిగే రెండు టెస్టుల్లో రహానె, పుజార, సాహా, అశ్విన్ కూడా ఆడనున్నారు.


అంజలి


కల్పన


అరుంధతి

## 'టీ20 చాలెంజర్'కు ముగ్గురు తెలుగమ్మాయిలు

**ముంబై:** మహిళల టీ20 చాలెంజర్ ట్రోఫీలో ముగ్గురు తెలుగమ్మాయిలు.. కల్పన, అంజలీ శర్వాణి, అరుంధతి రెడ్డిలకు చోటుదక్కింది. స్మృతి మంధాన నేతృత్వంలోని ఇండియా-బి టీమ్‌కు వికెట్ కీపర్ కల్పన, ఆల్‌రౌండర్ శర్వాణీ ఎంపికయ్యారు. అలాగే పేసర్ అరుంధతి రెడ్డికి ఇండియా-సి టీమ్‌లో చోటు లభించింది. ఇండియా ఎ, బి, సి టీమ్‌లు తలపడే టీ20 చాలెంజర్ ట్రోఫీ వచ్చే నెల 4-11 వరకు కటక్‌లో జరగనుంది. ఇండియా-ఎకు హర్మన్‌ప్రీత్ కౌర్, సి-టీమ్‌కు వేద కృష్ణమూర్తి సారథ్యం వహించనున్నారు. సోమవారమిక్కడ జరిగిన సమావేశంలో మూడు జట్లకు 14 మంది ప్లేయర్ల చొప్పున మహిళల సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసింది.

## కెరీర్‌కు ఫిలాండర్ గుడ్‌బై!

**ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీసే ఆఖరు**



**జొహాన్నెస్‌బర్గ్:** దక్షిణాఫ్రికా పేసర్ వెర్నన్ ఫిలాండర్ కెరీర్‌కు వీడ్కోలు పలకనున్నాడు. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్ తర్వాత అతడు కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తాడని క్రికెట్ సౌతాఫ్రికా (సీఎస్) ట్వీట్ చేసింది. సఫారీ పేస్ దళంలో డేల్ స్టెయిన్, మోర్నీ మోర్కెల్‌తో పాటు ఫిలాండర్ కూడా కీలకపాత్ర పోషించాడు. టెస్ట్ ఫార్మాట్‌లో దక్షిణాఫ్రికాకు ఎక్కువగా ప్రాతినిధ్యం వహించిన 34 ఏళ్ల ఫిలాండర్ 60 టెస్టులు, 30 వన్డేలు, 7 టీ20లు ఆడాడు. టెస్టుల్లో 216 వికెట్లు పడగొట్టాడు. సొంతగడ్డపై టెస్ట్ సిరీస్‌లో తాము ఇంగ్లండ్‌ను ఓడిస్తే తనకు మంచి వీడ్కోలు లభించినట్టు భావిస్తానని ఫిలాండర్ అన్నాడు.

## పాక్ కంటే భారత్‌లోనే ప్రమాదం

**పీసీబీ చీఫ్ మణి**



**కరాచీ:** భద్రతా పరంగా పోల్చుకుంటే పాకిస్థాన్‌లో కంటే భారత్‌లోనే రిస్క్ ఎక్కువని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చీఫ్ ఎహ్‌సాన్ మణి అన్నాడు. ఉగ్రవాదుల అడ్డా పాకిస్థాన్‌లో 2009లో శ్రీలంక పర్యటన సందర్భంగా లాహోర్‌లో బాంబుదాడి జరిగింది. దాంతో శ్రీలంక ఆ పర్యటనను అర్ధంతరంగా రద్దు చేసుకోగా...నాటినుంచి పాకిస్థాన్‌లో ఏ క్రికెట్ జట్టూ పర్యటించలేదు. కానీ 10 ఏళ్ల తర్వాత ఆ దేశంలో పర్యటించిన శ్రీలంక జట్టు రెండు టెస్టులు ఆడింది. సోమవారం ముగిసిన చివరి, రెండో టెస్ట్‌లో పాకిస్థాన్ గెలుపొందడంతో మణి స్పందించాడు. 'పాకిస్థాన్ సురక్షిత ప్రదేశమేనని మేం నిరూపించాం. ఎవరైనా ఇక్కడకు రాకపోతే మా దేశం భద్రతపరంగా సురక్షితం కాదని వారు నిరూపించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో పాకిస్థాన్ కంటే కూడా భారత్‌లోనే ప్రమాదం ఎక్కువగా ఉంది' అని వ్యాఖ్యానించాడు.

## హింసను ఖండించాలి

**క్రీడాలోకానికి గుత్తా జ్వాల పిలుపు**



**న్యూఢిల్లీ:** పౌరసత్వ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల్లో చోటుచేసుకుంటున్న హింసను ఖండించాలని భారత బ్యాడ్మింటన్ డబుల్స్ మాజీ స్టార్ గుత్తా జ్వాల పిలుపు నిచ్చింది. తన క్రీడా సహచరులను 'శాంతి రాయబారులు'గా అభివర్ణిస్తూ ట్విటర్‌లో ఓ వీడియో విడుదలజేసింది. 'ఈ హింసలో ఎంతోమంది చనిపోయిన వార్తలను మనం చూస్తున్నాం. ఇలాంటి వాటిని నేను ఊహించలేదు. ఈ హింసను దేశంలోని క్రీడాకారులందరూ ఖండించాలి' అని జ్వాల కోరింది.



# బుమ్రా వచ్చేశాడు

భారత పేస్ దళానికి తురుపు ముక్కగా భావించే జస్ప్రీత్ బుమ్రా మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. వచ్చే నెలలో శ్రీలంక, ఆస్ట్రేలియాతో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌లో తన పదునైన యార్కర్లతో ప్రత్యర్థి పనిబట్టేందుకు సిద్ధమవుతున్నాడు. ఇక ఏడాది కాలంగా పరుగుల పండుగ చేసుకుంటున్న స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ బ్యాట్‌కు కాస్త విశ్రాంతినిచ్చారు. లంకతో జరిగే మూడు టీ20ల్లో అతడు ఆడడం లేదు. గాయంతో బాధపడుతున్న మరో ఓపెనర్ శిఖర్ ధవన్ ఫిట్‌నెస్ నిరూపించుకోవడంతో తిరిగి జట్టులోకొచ్చాడు. దీపక్ చాహర్ గాయం కారణంగా యువ పేసర్ సైనీకి మరో చాన్స్ దక్కింది.

## రోహిత్, షమిలకు విశ్రాంతి

- శ్రీలంకతో టీ20 సిరీస్‌కు జట్టు ఎంపిక
- ఆస్ట్రేలియాతో వన్డేలకు కూడా..

**న్యూఢిల్లీ:** వచ్చే నెలలో శ్రీలంకతో జరిగే మూడు టీ20లు, ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌ల కోసం భారత జట్లను ప్రకటించారు. సోమవారం సమావేశమైన ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని జాతీయ సెలెక్షన్ కమిటీ ఈ రెండు జట్లలో 15 మంది చొప్పున సభ్యులను ఎంపిక చేసింది. జనవరి 5 నుంచి లంకతో టీ20 సిరీస్, 14 నుంచి ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్ జరుగనున్నాయి. వెన్నెముక గాయం నుంచి కోలుకున్న పేసర్ జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులో చోటు దక్కించుకున్నాడు. భువనేశ్వర్, దీపక్ చాహర్ గాయాలతో బలహీనంగా మారిన పేస్ విభాగం బుమ్రా రాకతో పటిష్ఠంగా మారనుంది. జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో ఫిట్‌నెస్ టెస్టును చేయించుకోలేకపోయిన ఈ పేసర్‌కు భారత జట్టు ఫిజియో నితిన్ పటేల్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడు. దీంతో ముందుగా అతడు సూరత్‌లో జరిగే రంజీ మ్యాచ్‌లో ఆడనున్నాడు. ఆ తర్వాత ఈ రెండు సిరీస్‌ల కోసం జట్టులో చేరతాడు. మరోవైపు ఓపెనర్ శిఖర్ ధవన్ కూడా గాయం నుంచి కోలుకున్నాడు. దీంతో అతడిని కూడా టీ20, వన్డే సిరీస్‌లకు ఎంపిక చేశారు. అలాగే విండీస్‌తో వన్డే సిరీస్‌లో గాయపడిన పేసర్ దీపక్ చాహర్ ఈ రెండు సిరీస్‌లకు దూరమయ్యాడు. అతడి స్థానంలో నవ్‌దీప్ సైనీ కొనసాగుతున్నాడు. ఇదిలావుండగా ఈనెలలో చీఫ్ సెలెక్టర్ పదవి నుంచి వైదొలగనున్న ఎమ్మెస్కే చివరిసారి తన ఆధ్వర్యంలో జట్టును ఎంపిక చేసింది.

**లంకతో సిరీస్‌కు రోహిత్, షమి దూరం**

ఈ ఏడాది మూడు ఫార్మాట్లలో కలిపి రోహిత్ శర్మ భారీ సంఖ్యలో 47 మ్యాచ్‌లు ఆడాడు. అందుకే శ్రీలంకతో మూడు టీ20ల సిరీస్ నుంచి అతడికి విశ్రాంతినిచ్చారు. ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు రోహిత్ తిరిగి జట్టులో చేరనున్నాడు. నిజానికి విండీస్‌తో టీ20 సిరీస్‌కే అతడికి విశ్రాంతి ఇస్తారని భావించినా అప్పుడు వీలు కాలేదు. అలాగే పేసర్ షమి కూడా లంకతో టీ20 సిరీస్ ఆడడం లేదు. 'లంక, ఆసీస్‌లతో జరిగే సిరీస్‌లకు బుమ్రా ఎంపికయ్యాడు. టీ20ల్లో సంజూ శాంసన్ బ్యాకప్ ఓపెనర్‌గా ఉంటాడు. అయితే ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు రోహిత్, రాహుల్, ధవన్‌ల రూపంలో ముగ్గురు ఓపెనర్లు అందుబాటులో ఉంటారు. ఇక జనవరి మూడో వారంలో హార్దిక్ పాండ్యా గాయంపై ఓ అంచనాకు రానున్నాం' అని ఎమ్మెస్కే తెలిపాడు. మరోవైపు ధోనీ జట్టు ఎంపిక కోసం ఎప్పుడు అందుబాటులో ఉంటాడన్న ప్రశ్నకు ఎమ్మెస్కే నేరుగా సమాధానమివ్వలేదు. 'ఈ విషయంలో నేనేమీ కామెంట్ చేయను. జట్టుకు ఎంపిక కావాలంటే అతడికి ముందు మ్యాచ్ ప్రాక్టీస్ కావాలి' అని అన్నాడు.

**శ్రీలంకతో టీ20 సిరీస్‌కు..**

విరాట్ కోహ్లీ (కెప్టెన్), శిఖర్ ధవన్, కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా, శివమ్ దూబే, చాహల్, కుల్దీప్ యాదవ్, బుమ్రా, నవ్‌దీప్ సైనీ, శార్దూల్ ఠాకూర్, మనీశ్ పాండే, వాషింగ్టన్ సుందర్, సంజూ శాంసన్.

**ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు..**

విరాట్ కోహ్లీ (కెప్టెన్), శిఖర్ ధవన్, రోహిత్ శర్మ, రాహుల్, శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్, జడేజా, శివమ్ దూబే, మనీశ్ పాండే, కేదార్ జాదవ్, చాహల్, కుల్దీప్ యాదవ్, బుమ్రా, శార్దూల్ ఠాకూర్, సైనీ.



భారత క్రికెట్ చరిత్రలో మహేంద్రసింగ్ ధోనీది ప్రత్యేకస్థానం..బ్యాట్స్‌మన్‌గా, కీపర్‌గా, కెప్టెన్‌గా టీమిండియాను కొత్త పుంతలు తొక్కించిన మేటి. నరాలు తెగే ఉత్కంఠ భరిత క్షణాల్లోనూ ప్రశాంత చిత్తంతో విజయాలు అందుకొనే 'మిస్టర్ కూల్'గా ప్రసిద్ధి...కోట్లాది మంది అభిమానుల్లో తిరుగులేని పాపులారిటీ..బంగ్లాదేశ్‌పై వన్డేతో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ధోనీ విజయవంతంగా 15 ఏళ్లు పూర్తి చేసుకున్నాడు..

# 15 ఏళ్ల 'మహీ'మ

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

**భారత్‌**కు రెండు వరల్డ్‌కప్‌లు అందించిన మేటి కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ. క్రికెటర్‌గా ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించిన మహీ..సోమవారం మరో మైలురాయిని చేరుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లోకి ప్రవేశించి 15 సంవత్సరాలను అతడు పూర్తి చేసుకున్నాడు. 2004, డిసెంబరు 23న సౌరవ్ గంగూలీ సారథ్యంలో బంగ్లాదేశ్‌పై వన్డేతో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ధోనీ..అన్ని ఫార్మాట్లలో కలిపి 17,266 పరుగులు చేశాడు. 36 ఏళ్ల ఈ రాంచీ క్రికెటర్ 350 వన్డేలు, 90 టెస్టులు, 98 టీ20లలో టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాడు. కీపర్‌గా 829 మందిని అవుట్ చేశాడు. 2014 డిసెంబరులో టెస్టులకు వీడ్కోలు పలికాడు.

**కెప్టెన్‌గా రెండు వరల్డ్‌కప్‌లు**

దశాబ్దంన్నర కెరీర్‌లో భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన మహీ..కెప్టెన్‌గా రెండుసార్లు జట్టును విశ్వవిజేతగా నిలిపాడు. ప్రపంచ క్రికెట్‌లో బెస్ట్ ఫినిషర్‌గా మన్ననలు అందుకున్న ధోనీ 2011 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్‌ను ముగించిన తీరు అద్భుతం. శ్రీలంక పేసర్ నువాన్ కులశేఖర బంతిని లాంగాన్ దిశగా అద్భుత సిక్సర్‌గా మలిచి మెన్‌ఇన్ బ్లూకు రెండోసారి ప్రతిష్ఠాత్మక ట్రోఫీని అందించాడు. మహీ కెప్టెన్సీలో వన్డేల్లో భారత్ తిరుగులేని శక్తిగా నిలిచింది. అంతకు ముందు 2007లో తొలి టీ20 వరల్డ్‌కప్‌ను కూడా మహీ సారథ్యంలోనే భారత్ జట్టు ముద్దాడింది. ఇంకా..2013 చాంపియన్స్ ట్రోఫీని కూడా అతడి కెప్టెన్సీలోనే టీమిండియా చేజిక్కించుకుంది. ఇలా..మూడు అతిపెద్ద ఐసీసీ ట్రోఫీలు అందుకున్న ఏకైక భారత సారథి మహీనే కావడం విశేషం. అలాగే టెస్టులు, వన్డేల్లో భారత్‌ను నెంబర్ వన్‌గా కూడా నిలిపాడు. ఐపీఎల్‌లో ధోనీ ఘనత గురించి ఎంత చెప్పినా తక్కువే. మహీ కెప్టెన్సీలో చెన్నై సూపర్ కింగ్స్ 3 ఐపీఎల్ టైటిళ్లు, 2 చాంపియన్స్ లీగ్ ట్రోఫీలు సాధించడం అతడి సత్తాకు నిదర్శనం. అయితే మూడు నెలలుగా మహీ అంతర్జాతీయ క్రికెట్‌కు పూర్తిగా దూరంగా ఉన్నాడు. గత జూలైలో న్యూజిలాండ్‌తో వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ అనంతరం ధోనీ క్రికెట్ నుంచి విశ్రాంతి తీసుకుంటున్నాడు. పలు సిరీస్‌లకు దూరంగా ఉండడంతో అతడి రిటైర్మెంట్‌పై ఊహాగానాలు వెల్లువెత్తాయి. కానీ ఆ విషయమై ధోనీ చాలా రోజులు నోరు విప్పలేదు. ఎట్టకేలకు కొద్దిరోజుల కిందట స్పందించిన మహీ..'జనవరి వరకు నన్నేమీ అడగొద్దు' అని అన్నాడు. అంటే..జనవరిలో టీమిండియా న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఆ జట్టుతో ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది. బహుశా..ఆ సిరీస్‌లో ధోనీ ఆడొచ్చని అంతా భావిస్తున్నారు. ఆపై ఐపీఎల్‌లో పాల్గొననున్న మహీ.. 2020 అక్టోబరులో ఆస్ట్రేలియాలో జరిగే టీ20 వరల్డ్‌కప్‌లోనూ పాల్గొని కెరీర్‌కు వీడ్కోలు పలికే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు.

## పాక్‌దే రెండో టెస్ట్

● శ్రీలంకతో సిరీస్ కైవసం

**కరాచీ:** పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత స్వదేశంలో జరిగిన టెస్ట్ సిరీస్‌ను పాకిస్థాన్ ఘనంగా ముగించింది. శ్రీలంకతో సోమవారం ముగిసిన రెండో టెస్ట్‌లో పాకిస్థాన్ 263 పరుగుల తేడాతో నెగ్గి, రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-0తో కైవసం చేసుకుంది. రావల్పిండిలో జరిగిన మొదటి టెస్ట్ డ్రా అయిన సంగతి తెలిసిందే. 476 పరుగుల లక్ష్యంతో ఓవర్‌నైట్ 212/7 స్కోరుతో చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక అదే స్కోరువద్ద ఆలౌటైంది. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 191, రెండో ఇన్నింగ్స్‌లో 555/3 (డిక్లేర్డ్) స్కోరు చేసింది. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 271 పరుగులు సాధించింది. కాగా నసీమ్ షా (5/31, 16 ఏళ్ల 307 రోజులు) ఓ టెస్ట్ ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన రెండో అత్యంత పిన్నవయస్సు బౌలర్‌గా రికార్డు సృష్టించాడు.



## రాఖీకి కాంస్యం

**దోహా:** కతార్ ఇంటర్నేషనల్ కప్ వెయిట్ లిఫ్టింగ్‌లో భారత అథ్లెట్ రాఖీ హల్దార్ కాంస్య పతకం సాధించింది. ఈ క్రమంలో రెండు జాతీయ రికార్డులను నెలకొల్పింది. ఆదివారం రాత్రి జరిగిన మహిళల 64 కిలోల విభాగంలో రాఖీ మొత్తం 218 (95+123) కిలోలు ఎత్తి మూడోస్థానంలో నిలిచింది. స్నాచ్, ఓవరాల్ లిఫ్ట్‌లో జాతీయ రికార్డును రాఖీ తనపేరిట లిఖించుకుంది. ఈ క్రమంలో తన వ్యక్తిగత బెస్ట్‌ను సాధించింది. కాగా, ఈ ఒలింపిక్ క్వాలిఫయింగ్ సిల్వర్ లెవెల్ ఈవెంట్‌ను భారత్ 3 పతకాలతో ముగించింది.

2020 CALENDAR
2020
ఆంధ్రజ్యోతి పంచాంగం
క్యాలండర్ మార్కెట్‌లో ఉంది




వెల ₹ 25/-
క్యాలండర్ కొరకు స్థానిక ఏజెంట్‌ను సంప్రదించగలరు
ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*

epaper.andhrajyothy.com